ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్
: fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
15-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 314 పేజీలు: 10+4 వెల: 6.50

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

# ఓటు చోరులను గద్దెదించుతాం



ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ ర్యాలీ సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

### ఢిల్లీ రామ్‌లీలా మైదాన్ మహా ర్యాలీలో కాంగ్రెస్ నేతల గర్జన

### బిజెపితో కుమ్మక్కవుతున్న ఇసి: రాహుల్ గాంధీ

### సత్యవాక్కులతోనే అవినీతి సర్కార్‌కు చరమగీతం: ఖర్గే

### ఓటు చోరీ నినాదంతో దేశవ్యాప్త ఆందోళనకు నిర్ణయం

### పాల్గొన్న సోనియా, ప్రియాంక, కెసి వేణుగోపాల్ తదితరులు

### ర్యాలీకి వేలాదిగా హాజరైన అభిమానులు కార్యకర్తలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశంలో రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ఎన్నికల సంఘం బిజెపికి పనిచేస్తోందని, అధికార పార్టీతో కుమ్మక్కవుతోందని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ల జాబితాలో భారీ ఎత్తున బిజెపి అవకతవకలకు పాల్పడుతున్నా ఎన్నికలసంఘం పట్టించుకోవడంలేదని, ఆపార్టీ అవకతవకలన్నింటికీ గొడుగుపడుతోందని ఆరోపించారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లు సుక్‌బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషిలు కూడా >>2

## రాజ్యాంగం రద్దుకు బిజెపి కుట్ర

### రాహుల్ పోరాటానికి అంతా మద్దతు ఇవ్వాలి: సిఎం రేవంత్



న్యూఢిల్లీలో ఓటు చోరీ సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్14:** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న రాహుల్‌గాంధీకి దేశంలోని ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలబడాలని తెలంగాణ సిఎం ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. >>2



## బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

### ప్రకటించిన పార్టీ పార్లమెంటరీ బోర్డు

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** భారతీయ జనతాపార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బీహార్‌మంత్రి నితిన్‌నబీన్‌ను హైకమాండ్‌నియమించింది. బిజెపి పార్లమెంటరీ బోర్డు ఈమేరకు నిర్ణయం ప్రకటించింది. వెంటనే అమలులోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీచేసారు. బీహార్‌లోని బాంకీపూర్ అసెంబ్లీ స్థానంనుంచి నితిన్‌నబీన్ వరుసగా నాలుగు సార్లు >>2

## బీచ్ పర్యాటకులపై దుండగుల కాల్పులు

యూదుల పండుగ విషాదాంతం
సిడ్నీలో దారుణకాండ
12 మందిపైగా మృతి..
పలువురికి తీవ్రగాయాలు 5

## రాష్ట్రంలో పెరుగుతున్న ఫుడ్‌పాయిజన్ కేసులు 3

## రెండో విడతలోనూ కాంగ్రెస్‌దే హవా

### రెండో స్థానంలో బిఆర్‌ఎస్, 3వ స్థానంలో బిజెపి

### ఈ ఎన్నికల్లోనూ చిత్ర విచిత్రాలు



ఆదివారం ములుగులో ఓటువేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్14:** తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత ఓట్ల లెక్కింపుప్రక్రియ ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. రెండో విడతలో కూడా కాంగ్రెస్ హవా నడిచింది. రాత్రి 11 గంటల వరకు ప్రకటించిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2216కు పైగా సర్పంచి >>2



## కెసిఆర్ జాగ్రత్త!

### హరీష్ వెన్నుపోటు పొంచి ఉంది

### పిసిసి చీఫ్ మహేష్ 2

## 19న ఎమ్మెల్యేలతో కెసిఆర్ కీలక భేటీ



### తెలంగాణ భవన్‌కు రానున్న మాజీ సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్14:** బీఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కేసీఆర్ ఈ నెల 19వ తేదీన తెలంగాణ భవన్‌కు రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం సందర్భంగా కృష్ణా, గోదావరి జలాల విషయంలో, తెలంగాణ రాష్ట్రానికి, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి మీద చర్చించనున్నారు. దానితోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోదావరి, కృష్ణా జలాలను కొల్లగొడుతున్నా కూడా దానిని అడ్డుకునే విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటువంటి సందర్భంలో తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హక్కులను కాపాడుకోవడానికి మరో ప్రజాఉద్యమంతప్పదని భావించడం >>2

## బిసి రిజర్వేషన్ల కోసం నేడు, రేపు ఛలో ఢిల్లీ

### పిలుపునిచ్చిన బిసి జెఎసి

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 14:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి జేఏసీ పిలుపులో భాగంగా నేడు, రేపు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అందులో భాగంగా బిసి నేతలు ఆదివారమే రైళ్లో దేశ రాజధాని ఢిల్లీకి బయలుదేరారు. బీసీ ఉద్యమంతో ఢిల్లీ దిగి వచ్చేలా పోరాడుతామని, బీసీల చలో ఢిల్లీ తోనైనా కేంద్రం కళ్ళు తెరవాలనే ఉద్దేశంతో చలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్టు బిసి జేఏసీ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ గల్లీలో ఉద్యమించినట్టుగానే నేటి(సోమవారం) నుంచి ఢిల్లీలో ఉద్యమిస్తామని, బీసీల చలో ఢిల్లీ ద్వారా ఢిల్లీ దిగివచ్చేలా బీసీల >>2





న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ఇంధన పరిరక్షణ అవార్డు అందుకుంటున్న తెలంగాణ విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్. చిత్రంలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

# తెలంగాణకు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో) జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుకు ఎంపికైంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ చే స్థాపించబడిన ప్రతిష్టాత్మక జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు-2025లో భాగంగా రాష్ట్ర పనితీరు విభాగంలో ద్వితీయ బహుమతి లభించింది. రాష్ట్ర ఏజెన్సీగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థం రంగంలో సంస్థ కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు ఈ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తెలంగాణ ప్రభుత్వం తరపున రాష్ట్ర విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రెడ్కో ఎండి వి. అనిల ఈ అవార్డును. అందుకున్నారు. ఇంధన పరిరక్షణలో తెలంగాణ చేపట్టిన నిరంతర మరియు ప్రభావవంతమైన కార్యక్రమాలను ఈ అవార్డు గుర్తిస్తుంది. ముఖ్యమైన విజయాలలో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అమలు చేసిన కూల్ రూఫ్ డెమో ప్రాజెక్ట్ ఒకటి. అలాగే ఎలక్ట్రిక్ టూవీలర్ రుణ పథకం, స్టాండర్డ్స్ లేబులింగ్ కార్యక్రమం కింద విస్తృతమైన కార్యకలాపాలు చేపట్టబడ్డాయి. ఎనర్జీ కన్జర్వేషన్ సస్టైనబుల్ బిల్డింగ్ కోడ్ అమలులో గణనీయమైన పురోగతి సాధించింది. రాష్ట్రంలో 3.03 లక్షల ఎనర్జీ సేవింగ్ సర్టిఫికేట్లు జారీ చేయబడ్డాయి. పునరుత్పాదక ఇంధనం, ఇంధన నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, తయారీ, పెట్టుబడులు మరియు ఉపాధి కల్పనను ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన తెలంగాణ క్లీన్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 ద్వారా రాష్ట్ర ప్రయత్నాలు మరింత బలోపేతం అవుతున్నాయి.

# కెసిఆర్ కీలక భేటీ

>> జరుగుతున్నది. ఇందులో భాగంగా తదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చ జరగనున్నది. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలు అని కేంద్రం ముందు చెబుతుందని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరించడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడమే అని బిఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ ప్రజలు, రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఒక్కరూ మాట్లాడిన పాపాన పోవట్లేదు. ఇంకా చెప్పాలంటే బీజేపీ పార్టీయే తెలంగాణ ప్రయోజనాలకు రైతాంగ ప్రయోజనాలకు గండి కొడుతున్నదనేది స్పష్టమవుతున్నదని బిఆర్ఎస్ ఆరోపణ. తెలంగాణ రాష్ట్రానికి సాగునీటి విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని కానీ, కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జల దోపిడికి సహకరిస్తున్న కేంద్ర బీజేపీ విధానాన్ని గాని ఎదుర్కోవాలంటే.. తెలంగాణ సమాజం మరొకసారి ప్రత్యక్ష పోరాటం చేయాల్సి ఉంటుందని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.

## ఎపికి జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు అందజేసిన రాష్ట్రపతి ముర్ము

**విజయవాడ, డిసెంబర్ 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థం లో ఆంధ్ర ప్రదేశ్ సాధించిన జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు2025 ను ఏపీఎస్పీడీసీఎల్ సిఎండీ ఎల్ శివ శంకర్ కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధానం చేసారు. ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు ను ఏపీఎస్పీడీసీఎల్ సిఎండీ అందుకున్నారు. ఈ అవార్డు ఇంధన సామర్థం, ఇంధన సంరక్షణ రంగాలలో రాష్ట్రానికి మరో గర్వకారణమైన మైలురాయిగా నిలిచింది. ఈ అవార్డు ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు లభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకత్వం, గౌరవ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సహాయసహకారాలు , అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మార్గదర్శకం ప్రధాన పాత్ర వహించాయి. వారి సమర్థ నాయకత్వంలో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసిఎం) అనేక రంగాల్లో ప్రభావవంతమైన ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తూ జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు విశేష గుర్తింపును తీసుకువచ్చింది.

## పలురంగాల్లో ఎపి టాప్: ఆర్‌బిఐ నివేదిక

**విజయవాడ, డిసెంబర్ 14, ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ స్ధాయిలో అభివృద్ధిపరంగా ఆంధ్రప్రదేశ్ తన ఆస్థిత్వాన్ని బలీయంగా చాటుకుంటుంది. తాజాగారిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడయింది.ఆర్బిఐ నివేదికను అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనేక రంగాల్లో అగ్రస్థానం సాధించింది. పండ్ల ఉత్పత్తిలో దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం దక్కించుకుంది. రాష్ట్రం 1 కోటి 93 లక్షల టన్నుల పండ్లను ఉత్పత్తి చేస్తూ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. చేపల ఉత్పత్తిలో కూడా ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానం సాధించింది. రాష్ట్రం 51.58 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి చేసింది. ఆర్థిక రంగంలోనూ రాష్ట్రం స్థిరమైన పురోగతి సాధించింది.

2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (బిజీడిపి) ..15.93 లక్షల కోట్లుగా నమోదైంది. తలసరి జీఎస్డీపీ ..2.66 లక్షలుగా ఉంది. విద్యుత్ లభ్యతలో ఆంధ్రప్రదేశ్ 1481 యూనిట్లతో దేశంలో 14వ స్థానంలో నిలిచింది.జనాభా ఆరోగ్య పరంగా ఆంధ్రప్రదేశ్‌లో సగటు జీవితకాలం 70 సంవత్సరాలుగా నమోదైంది. ఇందులో పురుషుల సగటు జీవితకాలం 68 సంవత్సరాలు, మహిళలది 73 సంవత్సరాలుగా ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ఇతర తెలుగు రాష్ట్రంతో కలిపి 74 మార్కులతో దేశంలో 10వ స్థానంలో నిలిచింది.

## బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

>> ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రహదారుల శాఖమంత్రిగాకొనసాగారు. బిజెపి ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా 2020 జనవరిలో ఈపదవిలో నియమితులయినా ఇప్పటికే ఆయన పదవీకాలం ముగిసినప్పటికీ పొడిగిస్తూ వచ్చింది. కాగా నితిన్‌నబీన్‌కు ప్రధానిమోడీ శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తగా నబీన్ గుర్తింపుపొందారని, ఆయనకు సంస్థాగత అనుభవం అపారంగా ఉందని, బీహార్ ఎమ్మెల్యేగా మంచి రికార్డుసాధించారని ప్రశంసించారు. ఆయన పనితీరు రానున్న కాలంలో బిజెపిని మరింత బలోపేతంచేస్తుందన్న నమ్మకం ఉందని మోడీ ఆకాంక్షించారు.

## బిసి రిజర్వేషన్ల కోసం నేడు, రేపు ఛలో ఢిల్లీ

>> పోరాటం ఉంటుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. 15,16 తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ఆదివారమే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ఉదయం వందలాదిమంది ఉద్యమకారులు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంచుతూ చేసిన చట్టాన్ని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోని ఆమోదించాలని, దేశవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం రిజర్వేషన్ పరిమితి ఎత్తివేయాలనే ప్రధాన డిమాండ్‌లతో బీసీ జేఏసీ ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. చలో ఢిల్లీ ద్వారా నైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటనతో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకులను కలిసి బీసీ బిల్లు ఆమోదం కోసం కృషి చేస్తామన్నారు. ఢిల్లీ బయలుదేరిన వారిలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బి మణి మంజరి, కాటేపల్లి వీరస్వామి, కౌల జగన్నాథం, నందగోపాల్, గూడూరు భాస్కర్, స్వర్ణ, గౌతమి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాసచారి, బండి గారి రాజు ఉన్నారు.

## వారం - వర్జ్యం

15-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
ఏకాదశి రా.9.21
చిత్త ఉ.11.09, మూల కార్తె
వర్జ్యం : సా.5.27-7.15
దు.ము.12.26-1.11,
2) మ.2.40-3.25
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** స్థిరాస్తులను కొనుగోలు చేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**వృషభం:** ఖర్చులను తగ్గించు విషయ ములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. సోదరి కలయిక.సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**మిథునం:** కొన్ని దుబారా ఖర్చులు రహస్య ఋణములు, దానములు తప్పవు. విలువైన సమాచారం వింటారు.కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కర్కాటకం:** కరస్పాండెన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమములు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మందుల వ్యాపారము అనుకూలం.

**సింహం:** ఆర్థికపరమైన అంశాలు కొంతమేర ఆశాజనకంగా ఉంటాయి. వివాహయత్నాలు ముమ్మరంచేస్తారు.

**కన్య :** మీకు న్యాయం చేయవలసిన వాళ్ళు సంపూర్ణంగా న్యాయం చేయరు. వృత్తి లోకొన్ని అనుకోని మార్పులు.

**తుల :** కోర్టు సంబంధించిన భూవివాదాలు, స్థిరాస్తులకు సంబంధించిన వివాదాలు ఒక పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృశ్చికం:** కళా, సాంస్కృతిక, ఉద్యోగ రంగాలలోని వారికి పోటీ ఎదురవుతుంది. కళాత్మక వసువులను కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ఒకరి జీవితానికి ఆధారం కల్పించి మనశ్శాంతి పొందుతారు. ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలి.

**మకరం:** ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలు మీద అధికార ఆమోద ముద్రలు పడుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కుంభం:** వస్తు భద్రతకు ప్రాముఖ్యం ఇస్తారు. ఇతర భాషల పట్ల విదేశాల పట్ల ఆకర్షణ కలుగుతుంది. వస్త్ర లాభం.

**మీనం :** వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరం. కార్యాచరణ కోసం యోచనచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఓటు చోరులను గద్దెదించుతాం



ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదనాన్ ర్యాలీ సభలో రాజ్యాంగ ప్రతితో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ

>> బిజెపికోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. వోట్‌చోర్ గద్దీఛోడ్‌నినాదంతో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రామ్‌లీలామైదాన్ ర్యాలీలో ఎసిసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఇతర కాంగ్రెస్ సీనియర్లతోపాటు రాహుల్ పాల్గొని ఎన్డియె ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. ర్యాలీ సభలో రాహుల్‌తోపాటుప్రియాంక గాందీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరామ్‌రమేష్, సచిన్‌పైలట్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొనగా వేలాదిగా మద్దతుదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సత్యంపైనే ఆధారపడి పనిచేస్తామని, ఈ శక్తితోనే నరేంద్రమోడీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాన్ని అధికారంనుంచి దించుతామని ప్రకటించారు. వారికి అధికారం ఉందని, అందువల్లనే వారంతా వోట్‌చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో బిజెపి రూ.10వేలు చొప్పున పంపిణీచేసిందని, అయినా కూడా ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి చర్యలు లేవని గుర్తుచేసారు. వాస్తవం అవాస్తవాలమధ్య జరిగే పోరులో తాము ఎప్పటికీ రాజీ పడలేమన్నారు. ఎన్నికల సంఘం బిజెపి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని నిష్పాక్షిక వైఖరితో లేదని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్‌భగవత్ ప్రకటన గుర్తుచేసుకోవాలని చెపుతూ ప్రపంచం నిజాలవైపు చూడదని, అధికారంవైపే ఉంటుందని, అధికారంలో ఎవరు ఉంటారో వారినే గైరవిస్తారని అన్నారు. ఇదే మోహన్ భగవత్ ఆలోచన అని ఇదే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతమని చెపుతూ మా సిద్ధాంతం సర్వమత సమానత్వం అని ఒక్క హిందూత్వంతో సరిపెట్టుకోబోమని అన్నారు. సత్య వాక్కులతోనే తాము నరేంద్రమోడీ, అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాలను గద్దెదించుతామని ప్రకటించారు. వోట్‌చోరీ ప్రచారంతో దేశ రాజధాని ఢిల్లీలో పార్టీపరంగా కొంత ఉత్తేజాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు. అంతకుముందు బీహార్‌లో నిర్వహించిన వోటర్ అధికార యాత్ర అంత ఫలితాలను ఇవ్వలేదు. కేవలం 61 స్థానాలకు మాత్రమే పోటీచేసింది. అయినా కూడా పార్టీ వెనకడుగు వేయకుండా వోట్‌చోర్ గద్దీఛోడ్ నినాదంతో దేశవ్యాప్త ప్రచారానికి శ్రీకారం చుట్టడం వెనుక రానున్న రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలేనని తెలుస్తోంది. గతంలోనే మూడు సార్లు మీడియామీట్‌నిర్వహించిన రాహుల్ కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానాల్లోకూడా ఓట్‌చోరీచేసిందని బిజెపిపై ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. అయితే ఈసీఐ ఇవన్నీ నిరాధారమని కొట్టిపారేసింది. ఈసారి ఇండియాకూటమితో కాకుండా కాంగ్రెస్ పార్టీ సొంతంగా ఓట్‌చోరీ నినాదాన్ని దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని నిర్ణయించింది. అందులోభాగంగానే ఢిల్లీ రామ్‌లీలామైదాన్‌లో ఓట్‌చోర్ గద్దీఛోడ్ పేరిట నిరసనసభలునిర్వహించింది. ఇదే సభలో ఎఐసిసి అద్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే, ప్రియాంక గాంధీలు కూడా మాట్లాడుతూ ఓట్లచోరీచేస్తున్న మోడీ ఎన్డీయే ప్రభుత్వాన్ని గద్దెదించేవరకూ విశ్రమించకూడదని పిలుపునిచ్చారు.

# రాజ్యాంగం రద్దుకు బిజెపి కుట్ర

>> ఓట్ చోరీ సమస్య కాంగ్రెస్ పార్టీది కాదని, దేశానిదికాదన్నారు. వ్యవస్థలను కలుషితం చేసి బిజెపి ఓటు చేరి చేస్తోందన్నారు. ఆదివారం ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ఓటు చోర్... గద్దీ చోడ్ ధర్నాలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పేలకు ఓటు హక్కు లేకుండా బిజెపి కుట్ర పన్నుతుందని విమర్శించారు. ఫలితంగా పేదలు పథకాలు కోల్పోతారని పేర్కొన్నారు. 'దళిత్ ఆదివాసీలకు, మైనారిటీలకు, పేదలకు ఓటు హక్కు కల్పించేందుకు ఆర్‌ఎస్‌ఎస్,గోల్వాల్కర్, వారి పరివారం అడ్డుకుందన్నారు. గాంధీ, అంబేడ్కర్ గరీబ్‌లకు ఓటు హక్కు కల్పించి దేశంలో ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇచ్చారు.ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనా విధానంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోదీ, అమిత్ షాలు ఆ చట్టాన్ని, ఆలోచనా విధానాన్ని అమలు చేయడానికి గత ఎన్నికల్లో 400సీట్లు అడిగారు.అప్పుడు బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని రాహుల్ గాంధీ చెప్పారు. అందుకే దేశ ప్రజలు బీజేపీకి 240సీట్లతో సరిపెట్టారు. దీంతో ఇవాళ రాజ్యాంగం,రిజర్వేషన్లు ఉన్నాయి, 400సీట్లు రాలేదు కాబట్టి ఎస్ఐఆర్, ఓట్ చోరీ పేరుతో దళిత, ఆదివాసీ, మైనారిటీ, నిరుపేదల ఓట్లు తొలగించే పనిలోపడ్డారు' అని పేర్కొన్నారు. గతంలో ఈ వర్గాలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ, అంబేడ్కర్ నిలబడ్డారు.

ఇప్పుడు ఈ వర్గాల కోసం రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు మోదీ, అమిత్ షాలకు వ్యతిరేకంగా నిలబడ్డారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్, గోల్వాల్కర్ ఆలోచనా విధానికి వ్యతిరేకంగా రామ్‌లీల మైదానంలో నిలబడ్డారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సమస్య కాదు. దేశ సమస్య అని చెప్పారు. ఈ యుద్ధంలో రాహుల్ గాంధీకి అండగా మనమంతా ఉండాలి. రాహుల్‌ను దేశ ప్రజలు గెలిపించాలి. లేదంటే ఓటు హక్కును లాక్కుంటారు అని చెప్పారు. ఒకసారి ఓటరు లిస్టు నుంచి పేరు పోయిన తార్వాత.. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు,భూమి, ఆస్తులు కూడా కోల్పోతారు,. మూలవాసీలు ఆదివాసీలు అన్నీ కోల్పోతారు.ఈ సమస్యకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, దేశ ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జై కాంగ్రెస్.. జై రాహుల్ గాంధీ నినాదంతో ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమానికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే,అగ్ర నేతలు రాహుల్‌గాంధీ,ప్రియాంక గాంధీతో పాటు పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ధర్నాలో రేవంత్‌రెడ్డి,డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు.



పంజాబ్‌లో 'పంచాయత్ సమితి' ఓటింగ్ సందర్భంగా ఆదివారం అమృత్‌సర్ పరిసర గ్రామాల్లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఆదివారం తనిఖీ చేస్తున్న పోలీసు అధికారి

# రెండో విడతలోనూ కాంగ్రెస్‌దే హవా

>> స్థానాల్లో విజయాలను కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంది. బిఆర్ఎస్ మద్దతుదారులు 1177, బీజేపీ మద్దతుదారులు 259 స్థానాల్లో గెలుపొందారు. 619 స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 85.86 శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలు కాకుండా 3,911 సర్పంచ్, 29,917 వార్డు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామ పంచాయతీల్లో ఓట్ల లెక్కింపును చెపట్టారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఫలితాలు వెలువడ్డాయి. రెండో విడతలో 4,332 సర్పంచ్ స్థానాలకుగానూ 415, వార్డుల్లో 38,322కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.

**స్పీకర్‌తో సహా ఓటేసిన పలువురు ప్రజాప్రతినిధులు**

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తన స్వగ్రామం ఝరాసంఘంలో తోటి గ్రామస్థులతో కలిసి లైన్‌లో నిలబడి ఓటు వేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన స్వగ్రామం కొరివిపల్లి ఓటు వేశారు.చేగుంట మండలం రుక్మాపూర్‌లో ప్రశాంత్‌రెడ్డి అనే వ్యక్తి సింగపూర్ నుంచి వచ్చి ఓటేశారు. సిద్దిపేట జిల్లా పోతారంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బొప్పాపూర్‌లో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు దంపతులు ఓటు వేశారు. భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం జరిగిన పోలింగ్‌లో మర్పల్లి మండల కేంద్రంలో అసెంబ్లీ స్పీకర్,వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి ఎన్నికల్లోనూ చిత్ర విచిత్రాలు చోటు చేసుకున్నాయి.

**గుండెపోటుతో మరణించినా... ఎన్నికల్లో గెలిపించారు**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది.8వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసిన పల్లె లత(42), ఈనెల 7వ తేదీ గుండెపోటుతో మరణించారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో ప్రత్యర్థి పల్లె అనితపై పల్లె లత 30 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 7వ తేదీన సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించారు.అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా, 8వ వార్డుకు తిరిగి నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నిక నిర్వహిస్తామని స్థానిక ఎంపీడీవో తెలిపారు.

మెదక్ మండలం చీపురుదుబ్బతండా గ్రామ సర్పంచ్ ఎన్నిక ఫలితం డ్రాలో తేలింది. ఈ తండాలో 377 ఓట్లు ఉండగా, 367 ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన కేతావత్ సునీతకు 182,బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన బీమిలికి 182 ఓట్లు లభించాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశారు. లాటరీలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతను అదృష్టం వరించింది. దీంతో ఆమె సర్పంచ్‌గా ఎన్నికలైనట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

**ఓటు వేసిన తర్వాత పోలింగ్ కేంద్రం వద్ద మృతి చెందిన వృద్ధుడు**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద విషాద ఘటన చోటు చేసుకుంది. 14వ వార్డులో ఓటు వేసి బయటకు వచ్చిన వృద్ధుడు సోలిపేట బుచ్చయ్య(70) అక్కడే కుప్పకూలాడు. హుటాహుటిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అలూరు అనుబంధ గ్రామమైన వెంకన్నగూడ 14వ వార్డులో బుచ్చయ్య కుమార్తె రాములమ్మ వార్డు సభ్యురాలిగా పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో ఓటు వేసేందుకు వచ్చి బుచ్చయ్య మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

# కెసిఆర్ జాగ్రత్త!

## హరీష్ వెన్నుపోటు పొంచి ఉంది

## ప్రజాసంక్షేమంలేని బిజెపిపాలిత రాష్ట్రాలు

## మంత్రి మండలి ప్రక్షాళన దిశగా అడుగులు

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఢిల్లీలో చిట్‌చాట్

**హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని, హరీశ్‌రావు ఏ క్షణంలోనైనా వెన్నుపోటు పొడుస్తారని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు.న్యూఢిల్లీలో ఆదివారం మీడియాతో చిట్‌చాట్ చేస్తూ ఎవరికైనా సీఎం కావాలని ఉంటుంది కదా అందుకే హరీశ్‌రావుతో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చాలా జాగ్రత్తగా ఉండాలని హితవు చెప్పారు. జూబ్లీహిల్స్ లో ఓడిపోతామనే కెసిఆర్ ప్రచారంకు రాలేదని,పార్టీశ్రేణులు కూడా ఇతర పార్టీలోకి పోతుండటంతో నానాటికి బిఆర్ఎస్ బలహీనపడుతోందని అన్నారు.బిఆర్ఎస్‌కు ఫ్యూచర్ ఉంటే కవిత ఎందుకు బయటకు వచ్చేదని విలేఖరులను ప్రశ్నించారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ వల్ల సామాన్యులను బిఎల్ఓలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రంలో పదికిలోల దొడ్డు బియ్యం తప్ప ఆ రాష్ట్రాలలో సంక్షేమం లేదని,తెలంగాణలో బిజెపి ఎన్నటికి అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. బిజెపి నేతలు కలలు కంటున్నారని అన్నారు. మాజీ మంత్రి కెటిఆర్‌కు డబ్బులుండటంతోనే సోషల్ మీడియాతో లేని ఉన్నట్లు కనికట్టు చేస్తున్నారని ఆరోపించారు.మా ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌తో గ్రామాల్లోని ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఒక నెలలోపు పెండింగులో ఉన్న పదవులు అన్నీ భర్తీ చేస్తాం. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉంది. పార్టీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా సర్పంచ్‌లను కాంగ్రెస్ గెలిచింది. ఇతర రాష్ట్రాల కన్నా హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం ఉంది. అనేక మంది హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. ఫోర్త్ సీటు ఏర్పాటుతో నగరంలో అభివృద్ధి జరుగుతోంది. భాగ్యనగర అభివృద్ధిని ఎవరు ఆపలేరు. హైదరాబాద్ ఇండియాలో బెస్ట్ సిటీ అవుతుంది. వచ్చే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర కేబినెట్ ప్రక్షాళన కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని అన్నారు. ఢిల్లీకి రాహుల్ గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను, పార్టీ నేతలు కలిసి ఒకే విమానంలో శనివారం రాత్రి ప్రయాణించినప్పుడు జరిగిన సంభాషణపై కీలక విషయాలు టిపిసిసి చీఫ్ వివరించారు. తెలంగాణలో పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేశారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ఫలితాలు, జూబ్లీహిల్స్ ఫలితాలపై సీఎం రాహుల్ గాంధీకి వివరించారని, దేశ, విదేశాల్లో రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నామని చెప్పారు. డిసిసి పదవుల్లో బిసిలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించామని వివరించారు. రాష్ట్ర కేబినెట్‌లోకి నేను వెళ్లే ప్రసక్తే లేదని అన్నారు. కేవలం ప్రచారం మాత్రమే చేస్తున్నారు. టిపిసిసి అధ్యక్ష పదవితో చాలా సంతోషంగా ఉన్నాను. రాష్ట్ర మంత్రికి లేని ప్రాధాన్యం టిపిసిసి అధ్యక్షుడికి ఉంది. మా ప్రభుత్వ ఏర్పాటుకు ముందు కేసీ వేణుగోపాల్ నన్ను మంత్రి పదవి తీసుకుంటావా అని అడిగారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి గురించి సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. భవిష్యత్తులో హైదరాబాద్‌తో ఎవరూ పోటీ పడలేని విధంగా అభివృద్ధి చేస్తాం. సిఎంరేవంత్‌రెడ్డికి తెలంగాణ డెవలప్‌మెంట్‌పై ఓ విజన్ ఉంది. తెలంగాణలో మా ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదు' అని వ్యాఖ్యానించారు మహేశ్ కుమార్ గౌడ్.

## 2వ విడత సర్పంచ్ ఎన్నికల్లో టిడిపి విజయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్14:** తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు పోటీ చేసిన విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎన్నికల ఫలితాల్లో పలు పంచాయతీల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. ప్రధానంగా కామేపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు అజ్మీరాహరి గెలుపొందారు. కామేపల్లి కామేపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అజ్మీరా హరిని తెలుగుదేశం పార్టీ బలపరిచింది. అయితే ఆ అభ్యర్థి గెలుపు సాధించడంతో టిడిపిశ్రేణులు సంబురాలుచేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం గూడూరు ఎన్నిక ఫలితాన్ని అధికారులు నిలిపివేశారు.రీకౌంటింగ్ చేసినా ఇద్దరుఅభ్యర్థులకు సమానఓట్లు రావడంతోఫలితం ఆగిపోయింది.



## గంట వినోదం కోసం సింగరేణి సొమ్ము వాడుకున్న సిఎం

### తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ

**హైదరాబాద్ (స్టఫ్‌రిపోర్టర్), డిసెంబరు 14 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి ఒక గంట వినోదం కోసం పది కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ఈ ఫుట్‌బాల్ మ్యాచ్ కారణంగా తెలంగాణ ప్రజలకు ఒరిగింది ఏమిటని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల శ్రమశక్తికి సంబంధించిన డబ్బులు పది కోట్ల రూపాయలు సిఎం వాడారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నిధుల నుంచి ఈ పది కోట్ల రూపాయలు కార్మికులకు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. గత 5 రోజులుగా జాగృతి హైదరాబాద్ నగరంలో జనం బాట పట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోకసభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చిక్కడపల్లిలోని గ్రంథాలయానికి రాకుండా మ్యాచ్‌ను తిలకించడంపై ఆరోపించారు. రవీంద్రభారతిలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటు విషయంలో తాను తెలంగాణ ప్రజల పక్షాన ఉంటానని, రవీంద్రభారతిలో తెలంగాణ కవులు, కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను సిఎం పట్టించుకోకుండా సిఎం ఢిల్లీ వెళ్ళారని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం తాను కృషి చేస్తానని చెప్పారు. ఎలక్ట్రికల్ బస్‌లు తీసుకు వచ్చి ఆర్టీసిని ప్రైవేటు వారికి అప్పగిస్తున్నారని ఆమె ఆరోపించారు. హైదరాబాద్‌లో చెత్త పేరుకుపోతున్నదని, దీంతో కుక్కల సంఖ్య పెరిగిపోతున్నదని ఆమె ధ్వజమెత్తారు. తాను చేపట్టిన జనంబాట కార్యక్రమంలో ప్రజలు అనేక సమస్యలను తనకు వివరించారని కవిత తెలిపారు.

## దేశంలోనే అత్యంత ఫిట్‌నెస్ సిఎం

### రేవంత్‌రెడ్డి: సోదరుడు కొండల్‌రెడ్డి ప్రశంస

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్14:** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత ఫిట్‌నెస్ ఉన్న ముఖ్యమంత్రి అని ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డి ప్రశంసించారు. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో కలిసి సీఎం రేవంత్ హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ ఆడిన నేపథ్యంలో కొండల్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 56 ఏళ్ల వయసులోనూ తన సోదరుడు చూపించిన ఉత్సాహం,ఫిట్‌నెస్ అందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. శనివారం సాయంత్రం ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ కార్యక్రమంలో 38 ఏళ్ల మెస్సీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ, గోల్స్ చేస్తూ మెస్సీతో సమానంగా అడుగులుకదిపారని కొండల్ రెడ్డి తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.'ఇది నిజమైనస్ఫూర్తి. ఇలాంటి నాయకులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం ద్వారా దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తారు. నాయకులు ఫిట్‌నెస్‌కుప్రాధాన్యం ఇస్తే, పౌరులు కూడా చురుగ్గా ఉండేందుకు, వ్యాధులతో పోరాడేందుకు ప్రేరణ పొందుతారు. తద్వారా ఆరోగ్యకరమైన భారత్‌ను నిర్మించవచ్చు' అనిఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఉత్సాహ భరితమైన నాయకత్వానికి మరింత శక్తిచేకూరాలని కొండల్ రెడ్డి ఆకాంక్షించారు.

## నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు చిక్కిన డ్రగ్స్ స్మగ్లర్లు

**హైదరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ముగ్గురు డ్రగ్స్ స్మగ్లర్లను అరెస్టు చేసింది. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి నాలుగు లక్షల 65వేల రూపాయల విలువైన ఎండిఎంఎ సింథటిక్ డ్రగ్స్‌ను జప్తు చేశారు. మాసాబ్‌ట్యాంక్ ప్రాంతంలో డ్రగ్స్ స్మగ్లర్లు వున్నారనే సమాచారంతో శనివారం రాత్రి నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు దాడి చేయగా ముగ్గురు పట్టుబడ్డారు. ఇందులో కార్తిక్ అలియాస్ అలెక్స్ ప్రధాన సరఫరాదారు కాగా బాలాజి, దీపక్‌లు అతని వద్ద సహాయకులుగా వుంటూ తమ ముఠాతో నమ్మకంగా వుండే వారికి డ్రగ్స్ అందిస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరు డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. వీరి వద్ద 11 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌తో పాటు మూడు సెల్ ఫోన్లు, చౌక ద్విచక్ర వామనం, మరో కారును జప్తు చేశారు. పట్టుబడ్డ ఎండిఎంఎ డ్రగ్స్ విలుల నాలుగు లక్షల 65 వేల రూపాయలుగా తేలింది. వీరు బెంగళూరునుంచి హైదరాబాద్‌కు తీసుకు వచ్చి విక్రయిస్తున్నట్లు తేలింది. వీరు ఎండిఎంఎ డ్రగ్‌ను ఒక్కో గ్రాము చొప్పున చిన్నపాటి ప్యాకెట్‌లో వుంచి అమ్ముతున్నారు. ఈ ముఠాలో బాలాజి ఇదివరకు ఒకసారి మాదకద్రవ్యాల కేసులో అరెస్టయ్యాడు. ఈ ముఠా నుంచి డ్రగ్స్‌ను కొన్నవారితో పాటు వీరికి మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారి కోసం నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు ఆరా తీస్తున్నారు.

## వైఎస్ఆర్ ఆహ్వానంతో కాంగ్రెస్‌లో చేరా..

### బిఆర్ఎస్ వీడటానికి హరీష్‌రావు కారణం కాదు



### డిస్టర్బ్ అయ్యా..మే నెలలో చెబుతా

### మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్,డిసెంబరు 14,ప్రభాతవార్త:** స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సంగారెడ్డికి ఐఐటి, ముంబై హైవేకు ఫోర్‌వే మంజూరు చేస్తానని హామి ఇస్తూ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడంతో నేను బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్ళానని కెసిఆర్ కూతరు నా విషయంలో రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చారని అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ బాగారెడ్డి, పి.రామచంద్రారెడ్డి వంటి తోపు లీడర్లు అందించిన జిల్లా నుంచి వచ్చిన తోపునే నేను అయితే ప్రస్తుతం కొంత డిస్ట్రబ్ అయ్యానని జగ్గారెడ్డి తెలిపారు. అందుకే ఎవరి ఫోటోలు వద్దు రాహుల్ గాంధీ ఫోటో ఒక్కటే పెట్టాలని చెప్పానని పేర్కొన్నారు. అన్నీ ఇప్పుడే చెప్పను సమయం వచ్చినప్పుడు చెప్తానని అన్నారు. ఎవరి వల్ల డిస్ట్రబ్ అయ్యాననేది మే నెలలో చెబుతానని ప్రకటించారు. నేను డిసైడ్ అయ్యాక వెనక్కి రాను, ముందుకెళ్తా అని స్పష్టం చేశారు. ప్రచార కమిటీ చైర్మన్ పదవిపై కూడా ఆసక్తి లేదని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి మండిపడ్డారు. జగ్గారెడ్డి బిఆర్ఎస్ పార్టీలో నుంచి బయటకు రావడానికి హరీశ్‌రావు కారణమని చేసిన ఆరోపణలను ఖండించారు. కవిత చేసిన ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. తాను హరీశ్‌రావుపై కోపంతో కాంగ్రెస్‌లోకి రాలేదని తెలిపారు. తాను బిఆర్ఎస్ వీడటానికి హరీశ్‌రావు కారణం కాదని పేర్కొన్నారు.కెసిఆర్ కూతురు కాబట్టే కవిత లీడర్ అయ్యారు. అందుకే ఆమెను కెసిఆర్ కుమార్తె అంటున్నా అని వివరించారు. తన పనితీరు నచ్చి కాంగ్రెస్‌లోకి రావాలని వైఎస్ఆర్ పిలిచారని చెప్పారు. తన మీద సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కవిత తనపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.హరీష్ రావు నేను రాజకీయ శత్రువులమే అయినా,పని విషయంలో ఇద్దరం పని పురుగులం సంగారెడ్డిలో నేను రాహుల్ గాంధీ సభ పెట్టిన అని హరీష్ ను కేసీఆర్ తిట్టాడు ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో హరీష్ నన్ను ఓడగొట్టాలనీ చూశాడనీ అన్నారు.జిల్లాలో హరీష్‌రావుకు, నాకు పొలిటికల్ వార్ సహజంగానే ఉంటుంది. హరీష్‌ది వెనుక నుంచి పొడిచే రాజకీయం..నాది డైరెక్ట్ ఎటాక్. వ్యూహం..ప్రతి వ్యూహం రాజకీయాల్లో మామూలే ఇది అందరికి తెలుసు ఈపోరు ఆగదు ఇది కవితకు తెలియక పోవడం దురదృష్టం అన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఫుడ్‌పాయిజన్ కేసులు

### గడువు ముగిసిన సరకులు, పాడైన కూరగాయలే కారణం, కలుషిత నీటితో అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 14:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం, గురుకులాల్లోని భోజనాలు ఫుడ్ పాయిజన్ అవుతున్న సంఘటనలు ఈ మధ్య కాలంలో పెరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా అక్కడక్కడా ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. ఎక్కువ మంది విద్యార్థులుంటున్న గురుకులాలతోపాటు మధ్యాహ్న భోజనం పెడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇటువంటి ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. ఫుడ్ పాయిజన్ ఘటనలు నేపథ్యంలో విద్యార్థులు అనారోగ్యంపాలవుతున్నారు. కొన్ని సంఘటనల్లో కొందరు విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి సైతం గురై తరువాత కోలుకుంటున్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు కాకుండా ఆహారంలో పురుగు లొస్తున్నాయని, నాణ్యమైన ఆహారం అందించడం లేదని పేర్కొంటూ విద్యార్థులు ఆందోళనబాట పడుతున్నారు. మొన్న అయితే తమకు అందిస్తున్న ఆహారంలో పరుగులొస్తున్నాయని పేర్కొంటూ విద్యార్థులు నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుసైతం చేశారు. కొద్దిరోజుల క్రితం విద్యార్థినులు రోడ్డుపైకి వచ్చి గంటలకొద్ది రాస్తారోకో చేశారు. ఇటువంటి ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ జరుగుతున్నాయి. గురుకులాలు,



హాస్టళ్లతోపాటు మధ్యాహ్న భోజనంలోనూ ఆహారం కలుషితం కావడానికి పలు కారణాలు ఉంటున్నాయి. భోజనం తయారీలో ఉపయోగించే కూరగాయలు శుభ్రంగా లేకపోవడంతోపాటు.. పాడైన కూరగాయలను సైతం వంటలో ఉపయోగించడం వల్ల ఫుడ్ పాయిజన్ అవుతున్నట్టుగా అధికారుల పరిశీలనలో కొన్నిచోట్ల తేలింది. అలాగే కొన్నిచోట్ల భోజనం తయారీకి ఉపయోగించే సరుకులు గడువు ముగిసినప్పటికీ వాటిని పడేయకుండా.. అలాగే ఉపయోగిస్తుండటం వల్లకూడా ఆహారం కలుషితం అవుతున్నట్టు తేలింది. ఇవి కాకుండా ప్రధానంగా నీరు కలుషితం కావడంతో ఫుడ్‌పాయిజన్ జరుగుతోంది. గురుకులాలు, హాస్టళ్లతోపాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వహకులు నాణ్యమైన, పరిశుభ్రమైన సరుకులను వాడకపోవడం కారణంగా కనిపిస్తుంది.. వాటిని పరిశీలించాల్సిన వారు కూడా రెగ్యులర్‌గా చూడకపోవడంతో కూడా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నట్లు విచారణ సందర్భంగా బయట పడుతుంది. గురుకులాలు, హాస్టళ్ళ, పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం కలుషితం అయిన చోట్ల ఎక్కువగా వాంతులు, విరోచనాలు కావడమే కాకుండా.. విపరీతమైన కడుపునొప్పి కూడా వస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఫుడ్‌పాయిజన్ జరిగిన తరువాత కొద్ది రోజుల వరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నప్పటికీ.. తరువాత కాలంలో తిరిగి యధావిధిగానే పరిస్థితులు కొనసాగుతున్నాయని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కలుషిత ఆహారం మూలంగా విద్యార్థులు ఆసుపత్రి పాలవుతుండటంతో విద్యార్థులతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గురుకులాల తోపాటు, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ. ఇటువంటి ఫుడ్‌పాయిజన్ సంఘటనలు జరుగుతుండటంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. గురువారం రాత్రి హైదరాబాద్‌లోని మైనారిటీ గురుకులంలో ఫుడ్ పాయిజన్ కాగా శుక్రవారం మధ్యాహ్నం మాదాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కలుషితం కావడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురి కావడంతో.. చికిత్స అందించడం కోసం విద్యార్థులను ఆసుపత్రిలో చేర్పించారు. వారిలో కొందరు విద్యార్థులకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో వారికి వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. మొన్న షామీర్ పేట్‌లో బీసీ గురుకుల పాఠశాలలో అన్నంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఏకంగా పోలీస్ స్టేషన్ కి వెళ్లే పరిస్థితి వచ్చింది. నిన్న మాదాపూర్‌లోని సిద్దిక్ నగర్ తండాలో మధ్యాహ్న భోజనం వికటించి 43 మంది పిల్లలు ఆసుపత్రిలో చేరారు. బాగ్ లింగంపల్లిలో ఉన్న మైనార్టీ గురుకులంలో కలుషిత ఆహారం తిని 90 మంది ఆసుపత్రి పాలయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటూ.. ఘటనలపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో అక్కడక్కడా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతుండటంతో ప్రభుత్వానికి తీవ్రమైన చెడ్డపేరు వస్తోంది. ఇటువంటి ఘటనలపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.

## కొవిడ్ వ్యాక్సిన్‌తోనే గుండెపోటు అన్నది అపోహాలే..

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశంలో యువతలో ఆకస్మిక మరణాలపై కొంతకాలంగా నెలకొన్న ఆందోళనలకు ఢిల్లీ ఎయిమ్స్ క్లారిటీ ఇచ్చింది. కోవిడ్19 వ్యాక్సిన్‌కు, యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు ఎలాంటి శాస్త్రీయ సంబంధం లేదని స్పష్టం చేసింది. వ్యాక్సిన్లు సురక్షితమైనవేనని, వాటి సమర్థతను ఈ అధ్యయనం మరోసారి ధృవీకరించిందని పరిశోధకులు ఆదివారం తెలిపారు. భారత వైద్య పరిశోధన మండలికి చెందిన ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. ఏడాది పాటు సాగిన ఈ పరిశోధనలో భాగంగా, 18 నుంచి 45 ఏళ్ల వయసు మధ్య ఆకస్మికంగా మరణించిన వారి కేసులను ఎయిమ్స్ వైద్యులు క్షుణ్ణంగా విశ్లేషించారు. ఇందుకోసం పోస్టుమార్టం, ఇమేజింగ్,




హిస్టోపాథలాజికల్ పరీక్షలతో పాటు మృతుల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విశ్లేషణలో కోవిడ్19 వ్యాక్సిన్ తీసుకున్న వారికి, తీసుకోని వారికి మధ్య ఆకస్మిక మరణాల విషయంలో గణాంకపరంగా ఎటువంటి తేడా లేదని తేలింది. యువతలో సంభవించిన మరణాలకు ప్రధాన కారణంగా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్యాలు కూడా కొన్ని కేసులలో మరణానికి దారితీశాయని తేలింది. ఈ ఫలితాలు ప్రపంచవ్యాప్తంగా జరిగిన శాస్త్రీయ పరిశోధనల ఫలితాలతో సరిపోలుతున్నాయని ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ అరవ తెలిపారు. వ్యాక్సిన్ల వల్లే యువత చనిపోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలు, నిరాధారమైన ప్రచారాన్ని ఈ అధ్యయనం ఖండిస్తోంది. ప్రజలు ఈ అపోహలను నమ్మకుండా, శాస్త్రీయ ఆధారాలను మాత్రమే విశ్వసించాలని ఆయన సూచించారు. యువతలో ఆకస్మిక మరణాలకు గుర్తించని అనారోగ్య సమస్యలే కారణమని, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి మార్పుల ద్వారా ఇలాంటి ముప్పులను తగ్గించుకోవచ్చని ఆరోగ్య ఎయిమ్స్ నిపుణులు సూచించారు.

## నేడు శంషాబాద్‌లోని కన్హా శాంతివనానికి ఏపి సిఎం చంద్రబాబు

### కన్హాశాంతి వనం అధ్యక్షుడు దాజీతో భేటీ

### సాయంత్రం విజయవాడలో అమరజీవి ఆత్మార్పణ దినం కార్యక్రమానికి సిఎం హాజరు

**విజయవాడ, డిసెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు సందర్శించనున్నారు. రేపు ఉదయం జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సీఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీ తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్ నెస్ , మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను ముఖ్యమంత్రి తిలకించనున్నారు. ట్రీకన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ను సీఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్ ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షులు దాజీ నేతృత్వంలో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ ఈ ఆశ్రమం నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్ని కూడా ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలి కాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి రానున్నారు. మధ్యాహ్నం సచివాల యంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొనున్నారు. రేపు సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరు కానున్నారు.

## మా పిల్లలపైనా సోషల్‌మీడియా వినియోగంపై ఆంక్షలు పెట్టా..

### యూట్యూబ్ సిఇఒ నీల్‌మోహన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై చిన్నపిల్లలు అధికంగా సమయం వెచ్చించడం ఆరోగ్యదాయకం కాదని అందుకే తనతోపాటు తన భార్య హేమామోహన్ కూడా తమ ముగ్గురు పిల్లల్ని సోషల్‌మీడియా వినియోగంపై ఆంక్షలు విధించినట్లు యూట్యూబ్ సిఇఒ నీల్‌మోహన్ చెప్పారు. చిన్నపిల్లలకు అవసరమైన విజ్ఞానంతో కూడిన సమాచారం అందించేందుకే తాము 2015లో కిడ్స్ యూట్యూబ్ ప్లాట్‌ఫామ్ రూపొందించినట్లు తెలిపారు. 52 ఏళ్ల సీనియర్ ఎగ్జిక్యూటివ్ మాట్లాడుతూ తమ పిల్లల్ని నిర్దిష్ట మైన సమ యా లకు మాత్రమే సోషల్ మీడి యా వినియో గానికి నిర్ణయించామని, ఇతర సమయాల్లో చదువు ఇతర కీలక అంశాల పైనే



దృష్టిపెట్టే చర్యలు తీసుకుంటామ న్నారు. యూట్యూబ్ ఇతర ప్లాట్‌ఫారాలతోపాటు ఇతర మీడియా ప్లాట్ ఫారాల వినియోగంపైనా తమ పిల్లలకు ఆంక్షలు పెట్టామని అన్నారు. వారంరోజుల్లో మరింత కఠినంగా ఉంటామని, వారాంతంలో కూడా వాటినిపరిమితంగా వినియోగించేందుకు మాత్రమే వెసులుబాటు కల్పిస్తామని నీల్‌మోహన్ చెప్పారు. సోషల్‌మీడియా వినియోగంపై పిల్లలు అత్య ధికంగా సమయం వెచ్చించకుండా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని ఆయన అన్నారు. ఆస్ట్రేలియా ఇటీవలే 16 ఏళ్లలోపువారికి సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విదించిన సం దర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. 16 ఏళ్లలోపు పిల్లలు టిక్‌టాక్, ఆల్ఫాబెట్ యూట్యూబ్, మెటా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల వినియోగంపై చిన్నారులకు నిషేధం ప్రకటించిన సంగతి తెలిసిందే. సోషల్‌మీడియా అతి వినియోగం అనర్థాలకు దారితీస్తుందని నీల్‌మోహన్ అభిప్రాయపడ్డారు.

## ఫోన్ ట్యాపింగ్‌పై కొనసాగుతున్న ప్రభాకర్ రావు విచారణ

### నాటి సిఎం పేషీ నుంచి ఒత్తిడి ఉండేదని వెల్లడి!

### నాటి సిఎం పేషీ అధికారులు, డిజిపి, నిఘా విభాగం బాస్‌ల విచారించాలని సిట్ నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు కస్టడీ విచారణ మూడవ రోజూ కొనసాగింది. జూబ్లీహిల్స్‌లోని సిట్ విచారణాధికారి ఎసిపి వెంకటగిరి కార్యాలయంలో ఈ విచారణ ఆదివారం నాడు ఆరు గంటల పాటు సాగింది. శుక్ర, శనివారాలతో పోలిస్తే ఆదివారం నాటు సాంకేతిక అంశాలపై విచారణ సాగిందని తెలిసింది. దీనికి సంబంధించి నాటి సిఎం పేషీ నుంచి తనపై ఒత్తిడి వుండేదని, పోలీసు ఉన్నతాధికారులు కూడా దీని గురించి చెప్పేవారని ప్రభాకర్ రావు వెల్లడించినట్లు తెలిసింది. కాగా ప్ర భాకర్ రావు వెల్లడించిన సమాచారం ఆధారంగా అప్పటి సిఎం పేషీ అధికారులతో పాటు డిజిపి, నిఘా విభాగం బాస్‌లను కూడా విచారించాలని సి ట్ భావిస్తున్నట్లు తెలిసింది. ప్రభాకర్ రావు విచారణ గురువారం వరకు సాగనుండడంతో ఈ లోపు వీరిని విచారించాలని సిట్ భావిస్తున్నట్లు సమా చారం.

రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్‌పై అప్పటి పాలకుల పాత్రకు సంబంధించిన ఆధారాలను వెలికి తీసేందుకు సిట్ ముమ్మరంగా ప్రయత్నాలు చేబట్టింది. ఈ కేసులో నలుగురు నిందితులు ఇప్పటికే అరెస్టయి జైలుకు వెళ్లి బెయిలుపై విడుదలవడం తెలిసిందే. వీరిచ్చిన వాంగ్మూ లం ప్రకారం అప్పటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావుతో పాటు నాటి సిఎం కెసిఆర్, ఆయన తనయుడు కెటిఆర్‌ల ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జ రిగిందని వెల్లడవడం విదితమే. ఇదే అంశాలను పోలీసులు కోర్టుకు వివరించారు. అయితే ఈ కేసులో ఏడాదిన్నర తరువాత ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును కస్టడీకి తీసుకుని విచారిస్తున్న సిట్ బృందం అప్పటి సంఘటనలపై వివరాలు సేకరిస్తోంది. మూడు రోజులుగా సాగుతున్న ఈ వి చారణ రోజుకో కొత్త అంశంపై దర్యాప్తు సాగుతోంది. ఆదివారం నాడు కేవలం సాంకేతిక అంశాలపై దృష్టి సారించారు. ఫోన్ ట్యాపింగ్‌పై అప్పట్లో ఎవరి ఆదేశాల మేరకు ముందుకు వెళ్లారు...? మీ కిందిస్థాయి అధికారులను చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేందుకు ఎందుకు ఆదేశించారు? అనే అంశాలపై సిట్ బృందం ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. దీనికి ప్రభాకర్ రావు కూడా తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. అప్పట్లో తనపై అధికారుల ఆదేశాలను తాను పాటిం చానని సిట్ అధికారుల బృందానికి చెప్పినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వందలాది ఫోన్‌లను ఎవరి ఆదేశాల మేరకుట్యాపింగ్ చేశారనే దాని గురించి ప్రభాకర్ రావు కొద్దిసేపు మౌనం వహించినా చివరకు నాటి బాస్ ఆదేశాలను పాటించానని చెప్పినట్లు తెలిసింది. తనపై అప్పట్లో సిఎం పేషీ నుంచి ఒత్తిడి వుండేదని ఆయన అంగీకరించినట్లు తెలిసింది. ఈ విషయాలన్నీ అప్పటి పోలీసు ఉన్నతాధికారులకు కూడా తెలుసునని ఆయన చెప్పినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు వెల్లడించిన వివరాల ఆధారంగా అప్పట్లో సిఎం కెసిఆర్ పేషీలో వున్న అధికారులను, నాటి డిజిపి మహేందర్ రెడ్డి, నిఘా విభాగం బాస్ అనిల్ కుమార్‌లను కూడా విచారించాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. కాగా ఫోన్ ట్యాపింగ్‌పై ఇప్పటికే అప్పటి డిజిపి మహేందర్ రెడ్డి, ఆయన తరువాత డిజిపిగా పనిచేసిన అంజనీ కుమార్, నాటి నిఘా విభాగం బాస్‌లుగా వ్యవహరించిన నవీన్‌చంద్, అనిల్ కుమార్‌ల వాంగ్మూలాన్ని సిట్ బృందం తీసుకుంది. తాజాగా ప్రభాకర్ రావు వెల్లడించిన వివరాల ఆధారంగా మరోసారి వీరిని విచారించాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం.

# ఫలితాల తారుమారుతో పరేషాన్

### పరాజిత అభ్యర్థుల చిత్ర విచిత్రాలు

### డబ్బులు ఇవ్వాలంటూ వింత నిరసనలు

### ఆసక్తికర ఫలితాలతో నిరాశ

### చర్చనీయాంశమైన ఓటమిపాలైన అభ్యర్థుల చర్యలు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త:** రిజర్వేషన్ల పుణ్యమా అని అవకాశం వచ్చింది. అంద వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవటం ఎందుకని ముందడుగు వేశారు. అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకున్నారు. ప్రజలు అవకాశం ఇవ్వకపోరా అని ఆశపడ్డారు. రిజర్వేషన్లు ప్రకటించినప్పటి నుండి అహర్నిశలు శ్రమించారు. గెలిచేందుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని చేశారు. గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నిక కావాలని కలలు కన్నారు. రిజర్వేషన్లు తమకు పదవులను చేజెక్కించుకునేలా చేస్తాయని ఆశించి చివరికి ఓటర్ల చేతిలో భంగపడ్డారు. గెలుస్తామని నమ్మకంతో ఎన్నికల్లో ఖర్చు చేశారు. చివరికి గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి విడత ఫలితాలు తారుమారవడంతో ఖమ్మం,నల్లగొండ జిల్లాలో ఓటమిపాలైన పలువురు అభ్యర్థులు వింత నిరసనలు చిత్రవిచిత్రాలు చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ పది పర్యాయాలు గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఓటమిపాలైన అభ్యర్థులు ఎప్పుడు కూడా ఈ రకమైన నిరసనలకు చిత్రవిచిత్రాలకు పాల్పడలేదు. 11 వ సారి జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాత్రం పలు చర్చనీయాంశమైన సంఘటనలు చోటు చేసుకోవడంతో వివిధ పార్టీల శ్రేణులు గుసగుసలాడుతున్నారు. ఏమిటా వింత పరిస్థితి అని వీస్తూ పోతున్నారు. ఓటు వేయని వాళ్లు తమ డబ్బులు ఇచ్చేయాలంటూ దేవుడి ఫోటో పట్టుకుని ఇల్లు తిరుగుతూ డిమాండ్ చేస్తున్న సంఘటన నల్లగొండ జిల్లా నార్కెట్పల్లి మండలం ఔరవాణి గ్రామంలో చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పై టిఆర్ఎస్ బలపరిచిన పార్టీ అభ్యర్థి కాలూరి బాలరాజు ఓటమిపాలయ్యారు. దీంతో భార్యాభర్తలిద్దరూ డబ్బులు తీసుకుని తమను ఓడించారని డబ్బులు ఇవ్వాలంటూ దేవుడి ఫోటో పురుగుల మందు డబ్బా తీసుకొని ఇంటింటికి తిరిగారు. ఓటు వేశామని చెబుతున్నప్పటికీ దేవుడిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. పేదవారమని డబ్బులు ఖర్చు చేసి పోటీ చేశామని అయినప్పటికీ ఓట్లు వేయలేదని వారు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటన గ్రామ ప్రజల్లో చర్చనీయాంశం కావడంతో పాటు అవాక్కయ్యారు. మరో సంఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంది. సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిపాలైనందుకు సెల్ టవర్ ఎక్కి హల్చల్ చేసిన ఘటన ఖమ్మం జిల్లా హరియా తండాలో చోటుచేసుకుంది. మాలోతు రంగా తన భార్యను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపారు. ఎన్నికల్లో ఆమె ఓటమిపాలైంది. తండాలో ప్రజలకు ఎంత సేవ చేసినప్పటికీ డబ్బులు పంచినప్పటికీ తన భార్యను ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ రంగా సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. 6 గంటల పాటు సెల్ టవర్ పైనే ఉన్నాడు. ప్రజలంతా సంఘటన స్థలానికి చేరి పరిస్థితిని గమనించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎంత పని చేశాయని అక్కడికి వచ్చినవారు మాట్లాడుకోవడం జరిగింది. తుదకు ఎన్నికపై విచారణ జరిపిస్తామని ఎమ్మార్వో నచ్చజెప్పడంతో ఓటమిపాలైన అభ్యర్థి భర్త రంగా సెల్ టవర్ దిగాడు. అదేవిధంగా ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో మరో విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. 2019 సంవత్సరంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో భర్తలు ఓటమిపాలయ్యారు. ఈసారి మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భార్యలు పోటీలో నిలిచి గెలుపొందారు. ఖమ్మం జిల్లా మత్కేపల్లి నామవరంలో 2019లో ఓటమిపాలైన కాంగ్రెస్ నాయకుడు కంచం కోటేశ్వరరావు భార్య ద్రౌపది ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 392 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. అదేవిధంగా పందిళ్ళపల్లి గ్రామంలో సిపిఎం నేత ఉత్సవాయి జానకి రాముడు భార్య పద్మ కూడా ఈ ఎన్నికల్లో సర్పంచ్ గా గెలుపొందింది. ఇది ఇలా ఉండగా మహబూబాబాద్ జిల్లాలో ఈ విధమైన సంఘటన చోటుచేసుకుంది. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ సొంత ఊరు సోమ్లా తండాలో ఆయన వదిన భూక్య కౌసల్య కాంగ్రెస్ తరఫున సర్పంచ్ గా పోటీ చేసింది. అదే తండాకు చెందిన ఇస్లావత్ సుజాత కాంగ్రెస్ రెబల్గా పోటీ చేసింది. మొదట విడత ఎన్నికల్లో సుజాత 17 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. దీంతో ఓడిపోయిన అభ్యర్థి కౌసల్య ఆమె భర్త దల్ సింగ్ కుమారుడు సందీప్ సేవాలాల్ జెండాతో తండాలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ముందు తాము ఓటర్లకు ఇచ్చిన పైకము ఇవ్వాలని కోరారు. కోడి కూడా అందజేశామని అయినప్పటికీ తమకు ఓటు వేయలేదని ఈ కారణంగానే ఓటమిపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రతి ఓటర్ను కలుస్తూ మీరు నాకు ఓటు వేసినట్లు కులదైవమైన సేవాలాల్ జెండా పట్టుకుని ప్రమాణం చేయాలని లేకుంటే పంచిన డబ్బులు నాకు ఇవ్వాలని అంటూ డిమాండ్ చేశారు.

వార్త

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు,
ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.

న-స్వామి వివేకానంద


# మెస్సీ మెరిసెన్

అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ ..ఉప్పల్ స్టేడియంలో అలా మెరిసి... ఇలా మురిపించాడు. క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి రేవంతరెడ్డితో కలియ తిరిగారు. అతి సాధారణ క్యాజువల్ వస్త్రధారణతో గ్యాలరీలోని అభిమానులను పలకరించారు. ఫుట్‌బాల్‌లను గ్యాలరీలోకి విసిరారు. దానిని పట్టుకున్న పలువురు దానిని ఎంతో ఉత్సాహంతో ఉద్వేగంతో పట్టుకుని ముద్దాడారు. స్టేడియం గ్రౌండ్లో ఎంతోమంది యువకులు, ఫుట్‌బాల్ ప్లేయర్లు తాము ఆడుకునే ఫుట్ బాల్ మీద మెస్సీ ఆటోగ్రాఫ్ తీసుకుని సంబరపడి పోయారు. మెస్సీ కదలికల్లో ఎలాంటి ఆర్భాటం లేదు. దర్పం లేదు. అతిశయం అసలే లేదు. స్టేడియంలో ఆడిన ఫ్రెండ్లీ మ్యాచులో ఆ విషయమే అర్థం అవుతుంది. తన ప్రతిభనంతా పక్కన పెట్టి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆడిన సింగరేణి బ్యాచ్ ఆటగాళ్ల గెలుపే తన గెలుపుగా భావించారు. ఎలాంటి ఎత్తుగడలు లేవు. మన ప్రాంతానికి వచ్చి మనల్ని గెలిపించి వెళ్లడమంటే....అదే కదా ఫ్రెండ్లీ అంటే. కాస్మోపాలిటన్ సిటీగా ఎదిగి ఒదిగిన ప్రాంతం కావడంతో దేశంలోని అన్ని ప్రాంతాల వారూ హైదరాబాద్‌లోనే ఉంటారన్నది జగద్విదితం. అందుకే అన్ని భాషలకు చెందిన క్రీడాసక్తి, ప్రత్యేకించి ఫుట్ బాల్ అంటే చెవి కోసుకునేవారు మెస్సీని ఎలాగైనా చూడాలని వ్యయ ప్రయాసలకోర్చి ఉప్పల్ స్టేడియంకు ముందుగానే వచ్చి చేరారు. లియోనల్ మెస్సీ అంటేనే ఫుట్ బాల్ ప్రపంచలో ఓ సంచలనం. భారత ప్రేక్షకులు ఇంతవరకు టీవీ చానల్స్‌లో మాత్రమే ఆయన్ని చూడగలిగారు. కలకత్తా కార్యక్రమం నిర్వాహకుల వైఫల్యం వలన అభాసుపాలయ్యింది. మ్యాచ్ ఆడకుండానే మెస్సీ కోల్‌కతా నుంచి వెనుదిరగడంతో అభిమానుల ఆగ్రహానికి గురయ్యారు. అక్కడి స్టేడియంలో మెస్సీని చూడలేక పోయామనే బాధతో అభిమానులు విధ్వంస చర్యలకు పాల్పడ్డారు. ఆ సంఘటనతో హైదరాబాద్‌లో అసాధారణ భద్రతతో ప్రమత్తమయ్యారు. దాంతో ఎక్కడా ఎలాంటి అలజడి లేకుండా కార్యక్రమం విజయవంతమయ్యింది. ప్రపంచ ఫుట్బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా' ప్రారంభమైంది. ఇండియాలో మూడు రోజుల పర్యటనలో 4 ప్రధాన నగరాలకు వెళ్లే కార్యక్రమం. ఆయనతో పాటు అతడి ఇంటర్ మియామీ జట్టు సహచరులు రోడ్రిగో డి పాల్, లూయిన్ సూవారెజ్ ఇండియాకు వచ్చారు. శనివారం ఉదయం కోల్కతాలో ఏర్పాటు చేసిన తన విగ్రహాన్ని వర్చువల్‌గా తానూ, హిందీ నటుడు షారుక్ ఖాన్ కలిసి ఆవిష్కరించారు. సిఫా వరల్డ్ న్క్ ట్రోఫీని చేతబట్టుకున్న మెస్సీ రూపంలో ఈ విగ్రహాన్ని రూపొందించారు. 2022 ప్రపంచకప్ విజయానికి ఇది ప్రతీకగా నిలిచింది. ఇక హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంకి మెస్సిని చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కలకత్తాలో మెస్సీ అభిమానులతో ఫ్రెండ్లీ మ్యాచ్ కోర్కె తీర్చలేకపో యినా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఆయన అభిమానులను, నిర్వాహకులను కూడా సంతృప్తిపరిచారు. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత రెడ్డి స్వతహాగా ఫుట్ బాల్ ప్లేయర్ కావడంతో ఈ కార్యక్ర మాన్ని విజయవంతంగా పూర్తి చేసారు. ఆయన ప్లేయర్ డ్రెస్‌తో వచ్చి ఫ్రెండ్లీ మ్యాచులో పాల్గొన్నారు. ఇలాంటి ఈవెంట్‌లో స్వయంగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఎవరన్నా ఉన్నారంటే వీరే. ఉప్పల్ గ్రౌండ్ క్రికెట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానం. కానీ మెస్సీ రాకను దృష్టిలో ఉంచుకుని దానిని ఫుట్ బాల్ ఆడేందుకు వీలైన ఆటస్థలంగా తీర్చిదిద్దారు. కాగా మెస్సీ రాకతో ఈ ప్రాంతంలో ఫుట్ బాల్‌కు ప్రాణం లేచొచ్చింది. అనంతరం సాల్ట్ లేక్ స్టేడియానికి ఆయన వెళ్లారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే ఆయన అక్కడ ఉన్నారు. అక్కడ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడడం ప్రత్యేకత. నిజానికి కలకత్తా అంటేనే ఫుట్ బాల్ ప్రియులు ఎక్కువ మంది ఉండే ప్రాంతంలో అలాంటి కార్యక్రమం లేకుండానే మెస్సీని నిర్వాహకులు తీసుకు వెళ్లిపోవడం తప్పిదమే. ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడతారని నిర్వాహకులు చెప్పగా ఎంతో ఉత్సాహంతో ఫుట్ బాల్ ప్రియులు సిద్ధంగా ఉన్నారు. కానీ మ్యాచ్ ఆడకుండా వెళ్లి పోవడం అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. హాతా శులైన ఫ్యాన్స్ తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. వీరావేశంతో విరగ్గొట్టిన కుర్చీలను సాల్ట్ లేక్ స్టేడియంలో పడేశారు. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించి మెస్సీకి క్షమాపణ చెప్పారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. లియోనల్ మెస్సే, స్పోర్ట్స్ లవర్స్, మెస్సి ఫ్యాన్సుకు కూడా క్షమాపణ చెప్పారు. సంఘటనపై ఎంక్వైరీ కమిటీ వేసారు. బెంగాల్ గవర్నర్ కూడా ఆరా తీశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటానని మమత ఎప్పటిలానే ఓ భరోసానిచ్చారు. భారతదేశంలో తమకిష్టమైన రాజకీయ నాయకులకు, అభిమాన సినిమా స్టార్లకు, ఆటగాళ్లకు జనం నీరాజనాలు, పడుతుంటారు. పాలాభిషేకాలు వారిని కలువలేకపోయినా, దగ్గర నుంచి చూసే అవకాశం లేకపోతే వీరాభిమానం గంగ వెర్రులెత్తి విధ్వంసానికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. కలకత్తాలో జరిగిందిదే. తమిళనాడులో అభిమానుల తీరు వేరే విధంగా ఉంటుంది.తమ అభిమాన రాజకీయ నాయకులకు జరగరానిది జరిగితే ఆత్మాహుతికైనా సిద్ధపడతారు.



మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.

గురునానక్



మాటలకే పరిమితమయ్యే మిత్రుడెవ్వడూ నీ మిత్రుడిగా ఉండలేడు. మానవ సంక్షేమానికి అసలు మూలం పనే.

లియో టాల్‌స్టాయ్


# పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

**దేశాల సంపద పెరుగుతూ, ప్రభుత్వాలు పేదరికంలోకి నెట్టబడు తున్నాయన్న నివేదిక విశ్లేషణ మన దేశంలో జరుగుతున్న పరిణామాలను సాక్షాత్కరించింది. నేషనల్ ఎసెట్ మానిటైజేషన్ పైప్లైన్,ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహా రణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలు, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధా నాలు ఆర్థిక అసమానతలను మరింత పెంపొందిస్తాయన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. అంతర్జాతీయ అనుభ వాల, నివేదికల సారాంశాన్ని క్రోడీకరించి, దేశ ఆర్థిక విధా నాలను పాలకులు పునఃసమీక్షించుకోవలసిన సమయం ఆస న్నమైనది. సంపద కేంద్రీకృతం చేసే కార్పొరేట్ అనుకూల విధానాలను నిలువరించి, ఆదాయ అంతరాలను తగ్గించే దిశగా ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనే భవిష్యత్ తరాలకు చూపే నిజమైన దార్శనికత.**



జి. కిషోర్ కుమార్

ప్రపంచీకరణ వలన అవకాశాలు విశ్వవ్యాప్తమోతాయని, ఆర్థిక సంస్కరణల అమలు వలన అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువౌతాయని ఊదరగొట్టిన ఆర్థిక సంస్కరణాభిలాషుల వాదనలని పూర్వపక్షం చేస్తూ, ఆర్థిక సంస్కరణలు, ఉదారవాద విధానాలు అమలు, ఆచరణలో విఫల యత్నమై తిరోగమన దిశలో పయనించి ఆదాయ అసమానతలని పెంచిందనే వాస్తవాన్ని ఇటీవల విడుదలయిన 'ప్రపంచ అసమానతల నివేదిక 2026' ఆవిష్కరించింది. ఈ నివేదికను ప్యారిస్ కేంద్రంగా ఉన్న వరల్డ్ ఇనీక్వాలిటి లాబ్ ఆధ్వర్యంలో 200 మంది రిసెర్చ్ స్కాలర్స్ క్షేత్ర స్థాయి కృషి, అధ్యయనం, సహాయ సహకారాలతో వివిధ దేశాల నివేదికలను, సూచీలను, పట్టికలను విశ్లేషించి అంతర్జాతీయంగా పెరుగుతున్న అసమాతల సారాంశాన్ని క్రోడీకరించారు. 'ప్రపంచ అసమానతల నివేదిక 2026' ప్రకారం, అత్యంత అసమానతలతో,పెరుగుతున్న పేదరికంతో కూడిన సంపన్న ఉన్నతవర్గం ఉన్నదేశంగా భారత్ ఆవిర్భవించింది. భారత దేశంలో సంపన్న వర్గంగా ఉన్న 1శాతం జనాభా, మొత్తం దేశ సంపదలో 40 శాతం సొంతం చేసుకున్నారు. అలాగే 37 శాతం ప్రపంచ సంపదను, ప్రపంచంలోని కేవలం 1 శాతం సంపన్న వర్గం నియంత్రిస్తోంది. భారత దేశంలో సగటు వార్షిక తలసరి ఆదాయం 7,273 డాలర్లుగానూ, సగటు నెలవారి ఆదాయం 605 డాలర్లుగా ఉంది. భారత దేశ జాతీయ ఆదాయం మొత్తంలో 58 శాతం మేరకు 10 మంది కైవసం చేసుకుంటున్నారు. ఆదాయ అంతరాలు స్థిరంగా కొనసాగుతూనే ఉన్నాయి. రెండు వర్గాల మధ్య ఆదాయ అంతరాల నిష్పత్తి 2014లో 38శాతం ఉంటే, 2024లో ఇది 38.2 శాతానికి పెరిగింది. దేశ జనాభాలో అత్యధికులు దేశ సంపదలో చాలా కొద్ది భాగంతోనే జీవిస్తున్నారని, దిగువన ఉన్న 50శాతం మంది జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే పొందుతున్నారని నివేదిక పేర్కొన్నది. సంపద తారతమ్యాల విశ్లేషణలో భాగంగా భారతదేశంలో 10 శాతం సంపన్న వర్గం మొత్తం దేశ సంపదలో 65శాతం సంపదని కలిగివున్నదని నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా చూసినపుడు 0.001 గా ఉన్న కుబేరులు క్రింది స్థాయిలో ఉన్న 50శాతం కన్నా 3 రెట్లు సంపదను కైవసం చేసుకున్నారు. అంతర్జాతీయంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం సంపన్న వర్గం ప్రపంచ సంపదలో ఉన్న 75 శాతం సొంతం చేసుకున్నారు. క్రింది స్థాయిలో ఉన్న 50శాతం ప్రజానీకం ప్రపంచ సంపదలో కేవలం 2 శాతం భాగస్వామ్యానికి పరిమితమయ్యారు. ప్రపంచ సంపద పంపిణీ విధాన ప్రక్రియలో చైనా పరిస్థితి పురోగమనంలో ఉండడం గమనార్హం. సంపద వృద్ధిలో ప్రజల భాగస్వామ్యం 40శాతానికి పెరిగి, ప్రపంచ సంపద పంపిణీలో ఉన్నత మధ్యతరగతి స్థాయికి చేరింది. అదే సమయంలో భారత్లో ఈ అంశంలో వృద్ధి నమోదుకాక పోగా, మరింత దిగజారుడు ధోరణి కనపర్చడం ఆందోళనకర పరిణామం. శ్రామిక మహిళా భాగస్వామ్యం చాలా తక్కువ స్థాయికి అంటే 15.7 శాతానికి పరిమితమవ్వడమే కాకుండా, వివిధ రంగాల వారీగా కూడా ఆదాయ అంతరాలు హెచ్చుస్థాయిలో చోటుచేసుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా లింగ వివక్ష, అసమానత ధోరణులు కొనసాగుతూనే ఉన్నాయని, పురుషుల ఒక గంట సంపాదనతో పోల్చినప్పుడు మహిళలు దానిలో 61శాతానికి మాత్రమే పరిమితమవున్నారనేది నివేదిక సారాంశం. ప్రాంతాలవారీగా శ్రామిక మహిళా ఆదాయం ప్రాతిపదికగా చూసినప్పుడు మిడిల్ ఈస్ట్,నార్త్ ఆఫ్రికా 16 శాతం, సౌత్ ఈస్ట్ ఆసియా



20శాతం, సబ్ సహారన్ ఆఫ్రికా 28శాతం, ఈస్ట్ ఆసియా 34శాతం, యూరోప్ 40శాతంగా ఉంది. మొత్తం అంతర్జాతీయ శ్రామిక ఆదాయంలో మహిళా శ్రామిక ఆదాయం 25 శాతానికి పరిమితమయినది. వాతావరణ సమతౌల్యం అంశానికి సంబంధించి, ఉన్నత ఆదాయ వర్గానికి చెందిన 10 మంది సంపన్నులు 77శాతం మేరకు,అలాగే 1 శాతం అత్యంత సంపదవర్గం, 41శాతం మేరకు ప్రైవేటు పెట్టుబడుల అజమాయిషీతో కర్బన ఉద్గారాల ఉత్పత్తికి కారణమవుతున్నారు. పేదరిక స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల కర్బన ఉద్గారాల ఉత్పత్తి కేవలం 3శాతం మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా ఆదాయాలు, సంపద, లింగ వివక్ష వంటివి ఆర్థిక వ్యవస్థలలో క్రమానుగతంగా, ప్రభావవంతమైన, లోతైన ప్రభావాన్ని చూపుతున్నాయి. అతి తక్కువ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, అంతర్జాతీయంగా సంపద పంపిణీలో బలహీనమైన బహుపాక్షికమైన పోకడలు, పెరుగుతున్న మహాధనవంతుల సంపద కేంద్రీకరణ, బలహీనమైన పన్నుల విధానాల అమలు వంటి వాటితో పాటు, పన్నుల విధాన అమలు పద్ధతిలో లొసుగులు ధనిక వర్గానికి ప్రయోజనం చేకూర్చేవిగా ఉండడం, సవాళ్లను గుర్తించినప్పటికీ విధానపరమైన సిఫార్సులను అమలుచేయకపోవడం వంటి అంశాలు అసమాతల వృద్ధికి మూలకారణాలని ఈ నివేదిక నిర్ధారించింది. కోటీశ్వరులు, సహస్ర కోటీశ్వరులపై పన్నులు విధించే విధానంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్నతిరోగమన పద్ధతుల ఫలితంగా ఆయా ప్రభుత్వాలు ఆదాయాలు కోల్పోవడం, నష్టపోవడం జరుగుతోందని, విద్యా, వైద్యం, వాతావరణం వంటి కీలక రంగాల అభివృద్ధిని ఇదిప్రభావితం చేస్తోందనేది నివేదికా బృంద అధ్యయనంలో అంతర్భాగంగా ఇమిడివున్న అంశం. ప్రగతిశీల పన్ను విధానాలను అమలుచేయాల్సిన ఆవశ్యకతను నివేదిక పునరుద్ఘాటించింది. పన్నులు విధించే ప్రక్రియలో లొసుగులను తొలగించి, సంపన్న, అతి సంపన్న వర్గాలపై ప్రభావవంతమైన సంపద పన్ను విధానాన్ని అమలుచేయాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక ఉటంకించింది. లింగ వివక్షతకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ, మహిళల వేతన రహిత పనివిధానానికి విలువనివ్వకపోవడం, మహిళల ఆర్థిక వెసులుబాటును అణిచివేస్తోందని, వేతనాలు లేని మహిళల శ్రమను గుర్తించాలని, దానిని తగ్గించాలని, ఇటువంటి అంశాల కోసం ప్రత్యేక కేటాయింపులు చేయడంతో పాటు, మహిళా శ్రామికుల భాగస్వామ్యం,నైపుణ్యాల మెరుగుదల, పిల్లల సంరక్షణ వంటి పరిస్థితులు వారికి అనుకూలంగా ఉండేలా చూడాల్సిన ఆవశ్యత ఉందని నివేదిక ప్రస్తుతించడం గమనార్హం.అంతర్జాతీయంగా భారతదేశంలోనూ, అసమానతలు చారిత్రాత్మక స్థాయికి చేరాయన్న అంశాన్ని ప్రపంచ అసమానతల నివేదిక 2026 స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా సంపద పంపిణీలో భారతదేశ కుంగుబాటును సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకతను స్పష్టీకరించింది. సమ్మిళిత వృద్ధిసాధన కోసం మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, సామాజిక న్యాయం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, ధృఢమైన రాజకీయ చిత్తం, ప్రభావవంతమైన పరిపాలన, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టివంటివి ఆవశ్యకమని నివేదిక ముక్తాయించింది. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పిజి)అమలు నేపథ్యంలోఆంక్షలు, నియంత్రణలులేని, నయా ఉదారవాద విధానాల వలన ఆదాయ వ్యత్యాసాలు మరింతగా పెరిగాయి.నియంత్రణలేని నయా సరళీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాల అమలు, సాగుతున్న ప్రస్తుత నేపథ్యంలో అంతర్జాతీయఅసమానతల నివేదిక 2026 ఆవిష్కరించిన భారతదేశ వాస్తవ పరిస్థితిని సమీక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దేశాల సంపద పెరుగుతూ, ప్రభుత్వాలు పేదరికంలోకి నెట్టబడుతున్నాయన్న నివేదిక విశ్లేషణ మన దేశంలో జరుగుతున్న పరిణామాలను సాక్షాత్కరించింది. నేషనల్ ఎసెట్ మానిటైజేషన్ పైప్లైన్,ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, మూసివేతలు, ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు ఆర్థిక అసమానతలను మరింత పెంపొందిస్తాయన్న వాస్తవాన్ని ప్రభుత్వాలు గ్రహించాలి. అంతర్జాతీయ అనుభవాల, నివేదికల సారాంశాన్ని క్రోడీకరించి, దేశ ఆర్థిక విధానాలను పాలకులు పునఃసమీక్షించుకోవలసిన సమయం ఆసన్నమైనది. సంపద కేంద్రీకృతం చేసే కార్పొరేట్ అనుకూల విధానాలను నిలువరించి, ఆదాయ అంతరాలను తగ్గించే దిశగా ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనే భవిష్యత్ తరాలకు చూపే నిజమైన దార్శనికత. •

# రైతుల సమస్యలు పట్టించుకోండి

తరిగోపుల నారాయణస్వామి

రైతు మన దేశానికి అన్నదాత. భూమిని తల్లిగా భావించి, ఎండలోనూ వానలోనూ శ్రమించి పండించే పంటలు మనకు ప్రాణాధారం. అలాంటి రైతు ఈ రోజుల్లో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో అరటి, మిరప, పత్తి, మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలు విస్తారంగా సాగు అవుతున్నాయి. పండించిన పంటకు సరైన ధర రాక రైతు నిరాశలో మునిగిపోతున్నాడు. పెట్టుబడి కూడా రాక చాలామంది పంటను పశువులకు మేతగా ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అయితే అదే పంటను దళారులు తక్కువ ధరకు కొని పట్టణాల్లో అధిక లాభాలతో అమ్మి ధనాన్ని కూడబెడుతున్నారు. పంట పండించిన రైతు నష్టపోతున్నాడు. పంట కొనుగోలు చేసే వినియోగదారుడు కూడా అధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కానీ మధ్యలో ఏ శ్రమలేని దళారులు సంపన్నులవుతున్నారు. ఇది సామాజిక న్యాయానికి, సమానతా విలువలకు విరుద్ధం. దీనిని మార్చడం అత్యవసరం. ప్రభుత్వం రైతుకు కనీసం పెట్టుబడికన్నా ఎక్కువ లాభం వచ్చే ధరను భరోసా ఇవ్వాలి. మార్కెట్‌లో అన్యాయం చేసే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పంట నిల్వశాలలు, చల్లని నిల్వగదులు, రవాణా సౌకర్యాలు పెంచాలి. ప్రజా



ప్రతి నిధులు రైతుల సమస్యలను కేవలం మాటల్లోనే కాక, పనిలో కూడా పరిష్కరించాలి. వారు గ్రామాల్లోని రైతులతో కలిసి నడిచి వారి కష్టాలను అర్థం చేసుకోవాలి. జపాన్, ఇజ్రాయెల్ దేశాలలో రైతులు తక్కువ భూమిపై ఎక్కువ దిగుబడులు పొందుతున్నారు.అందుకు కారణం నీటి పొదుపు పద్ధతులు, శాస్త్రీయ పంట మార్గదర్శకాలు, రైతే నేరుగా అమ్మే విపణులు. మన రైతుకూ అలాంటి సౌకర్యాలు రావాలి. దళారులు లేకుండా రైతు పంట వినియోగదారుని చేరే మార్గాలు పెరగాలి. గ్రామస్థాయిలో రైతు బజార్లు, సంఘాలు బలపడాలి. గ్రామ పంటగ్రామంలోనే అమ్ముకోవడం జరిగాలి. పట్టణాల్లో స్థానిక పంటలకు మద్దతు పెరగాలి. వాతావరణ సూచనలు, పంటలకు కావలసిన సలహాలు రైతుకు తరచుగా అందాలి.పంట బీమా సంపూర్ణ రక్షణ ఇవ్వాలి. ఒక్క రైతు చెమట చుక్క కూడా వృథ కాకూడదు. స్థానిక రైతుల పట్ల ప్రేమ చూపాలి. రైతు పంటలనే ప్రాధాన్యత ఇవ్వాలి. రైతు కష్టాన్ని గౌరవించే మనస్తత్వం పెరగాలి. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామాలు ప్రగతి పయనం పట్టగలవు. గ్రామాలు మెరుగుపడితేనే దేశం ఎదుగుతుంది. రైతు కష్టంతో దేశం జీవిస్తుంది. రైతు నవ్వితేనే ప్రతి ఇంటిలో ఆనందం వెలుగుతుంది. రైతును నిలబెట్టడం మనందరి కర్తవ్యం. •

# ప్రజావాక్కు



## విర్రవీగుతున్న పాకిస్థాన్

మొన్న జరిగిన ఆపరేషన్‌సిందూర్‌లోజరిగిన స్వల్ప యుద్ధంతో పాకిస్థాన్ గడగడ వణికిపోయి యుద్ధాన్ని ఆపమని భారత్‌ను ప్రాధేయ పడిన విషయం పాక్ ఆర్మీ చీఫ్‌మునీర్‌కు తెలియదనుకోవాలా?మరల యుద్ధం జరిగితే భారత్‌ను ధీటైన సమాధానం పాకిస్థాన్ చెప్పగలదని చేతకాని ఆడంబరాలెందుకో.ఈమధ్యన ఈ మునీర్ సాబ్ అమెరికా వెళ్ళి ట్రంప్ గారిచ్చిన విందును ఆరగించిన తరువాతే ఆయన మాటలు శ్రుతి మించిపోతున్నాయి. ట్రంప్‌యుద్ధ సామాగ్రిని సమకూరుస్తానని వాగ్దానం చేసాడేమో. అసలే అమెరికా దగ్గర చాలా ఆయుధాలు మురిగిపోతున్నాయి. సింధూర్ యుద్ధంతో తోక ముడిచిన ఈ పెద్ద మనిషి తన హోదాను సిడిఎఫ్‌గా ప్రభుత్వపరంగా పెంచుకుని విర్రవీగుతున్నట్లు కనబడుతోంది. ఏ దేశానికైనా ఓ ఆర్మీ ఉంటుంది. కానీ పాకిస్థాన్ ఆర్మీకే ఒక దేశ ముంది. ఇదొక వింతల్లో కల్లా వింత.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## డబ్బెవరికి చేదుకాదు!

**బీహార్** శాసనసభకు నిజాయితీపరులు, విద్యావంతులు ఒక్కరు కూడా ఎన్నికవలేదు. ఎన్నికయిన వారందరు అధికార పార్టీకి చెందినవారు. నేరచరిత గలవారు కోటీశ్వరులు ప్రజలకు డబ్బు ఆశ పెట్టి ఓట్లు వేయించుకున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ చేసిన పనులను ఇప్పుడు బిజెపి చేస్తోంది. ప్రపంచ బ్యాంకు అందించిన డబ్బులను ఇలా ఉపయోగిస్తోంది.

- శాస్త్రి, హైదరాబాద్

## రైతులను ఆదుకోండి

**భారతదేశ** ఆర్థికవ్యవస్థకు వెన్నెముకఅయిన రైతు, వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నాడు.సకాలంలో రుతుపవనాలు రాక పంటలు ఎండిపోతుంటే, అకాలవర్షాలు చేతికొచ్చిన పంటను నాశనం చేస్తున్నాయి. పెట్టుబడికి తగిన గిట్టుబాటు ధర లేకపోవడం, పంట నష్టాలు, అప్పుల భారం రైతులను ఆత్మహత్యల వైపునెడుతున్నాయి.గణాంకాలప్రకారం,ప్రతిరోజూ సగటున 28మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, దేశం మొత్తం ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

-కె.రామారావు, హైదరాబాద్

## డిజిటల్ వ్యసనం

**సాంకేతికపురోగతి** యువతకుఅపారమైన అవకాశాలు తెరవగా, అదే పురోగతి ఒక నిశ్శబ్ద బంధనాన్ని సృష్టిస్తోంది డిజిటల్ వ్యసనం. చరవాణి తెరపై మొదలై సామాజిక మాధ్యమాల్లో ముగిసే ఈ కొత్త జీవన శైలి, తెలియకుండానే యువతను ఒక కనిపించని గోడల వెనుక బంధిస్తోంది. రోజువారీగా వచ్చే నోటిఫికేషన్లు, ఫోటోలపై స్పందనలు, ఇష్టపడింది గుర్తులు, అనుచరుల సంఖ్యలు ఇవన్నీ వారివిలువను నిర్ణయించే ప్రమాణాలుగా మారాయి. బయట ప్రపంచం ఎలా ఉన్నా, స్మార్ట్‌ఫోన్ తెరలపై కనిపించే ప్రతిస్పందనలే సంతోషం, ఆందోళన, ఆత్మవిశ్వాసం అన్నీ అవుతున్నాయి. ఈ వర్చువల్ ప్రపంచంపై అతిగా ఆధారపడటం, నిజజీవిత అనుభూతులను మసకబార్చుతోంది. ముఖాముఖి సంభాషణలు తగ్గిపోగా, ఒంటరితనం పెరుగుతోంది. దీర్ఘకాలిక తెర వినియోగం నిరాశ, ఆతురత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలను పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## నిస్వార్థమైన ఓటుతోనే ప్రగతికి బాటలు

**కులాన్ని** చూసి కాదు గుణాన్ని నమ్మి ఓటేసినప్పుడే సమాజం బాగుపడుతుంది. సమసమాజం ఏర్పడుతుంది. రాజకీయమంటే కులాలు మతాలు కావని లౌకిక రాజ్యమని తెలుసుకోవాలి. ఓటు అనేది అభివృద్ధికి బాటలు వేసేలా ఉండాలి కానీ అవినీతికి పట్టం కట్టేలా ఉండొద్దు. ఓ జనులారా! జెండా కాదు అభ్యర్థి ఏజెండా చూడండి.

- కాల్వ నిఖిత,సిద్దిపేట

## ఆర్థిక సహాయం కల్పించాలి

**విజ్ఞాన** శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణరక్షణకు,సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం, చిరస్మరణీయం. వాటి ఫలితాలు అనుభవించడం చాలా తేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతో పాటు మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్ని రంగాల్లో కొన్ని సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు. వీటికోసం దేశంలో పరిశోధన చేసే విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రోత్సాహం విరివిగా కల్పించాలి. వారికి అన్ని వనరులు కల్పిస్తే వయస్సు పెరిగినా లక్ష్యసాధనకోసం వారు శ్రమించగలరు.

-బి.మేఘనాధం, విశాఖపట్నం

మన వి | ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ద్రవిడ రాజకీయాన్ని విజయ్ తిరగరాస్తాడా?

గోరంట్ల శివరామకృష్ణ

మరో కొన్నినెలల్లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. అక్కడి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. సుమారు 50ఏళ్లుగా ద్రవిడ రాజకీయం పేరుతో అక్కడ పాలన చేస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలకు అనుబంధ పక్షాలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలకు సవాలు విసురుతూ జనంలోకి పోతున్నాడు ప్రముఖ సినీనటుడు టీవీకే అధినేత విజయ్. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే తన లక్ష్యంగా సభలు నిర్వహిస్తూ ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. 234 ఎమ్మెల్యేలున్న ప్రస్తుత తమిళనాడు అసెంబ్లీలో డీఎంకేకు 132మంది, అన్నాడీఎంకేకు 62మంది, కాంగ్రెస్‌కు 18, బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నారు. వీరిలో కాంగ్రెస్, వామపక్షాలు అధికార డీఎంకేకు మద్దతుగా నిలుస్తుండగా, బీజేపీ అన్నాడీఎంకేలు ఒక జట్టుగా వ్యవహరిస్తున్నాయి.అయితే ఈ రెండు కూటములకు ప్రత్యామ్నాయంగా తన కొత్త పార్టీ నిలవాలని భావిస్తున్న విజయ్ మనసులో మాట బయటపెట్టకుండా తనదైన శైలిలో జనంలోకి పోతూ రోజురోజుకూ తన బలాన్ని పెంచుకుంటున్నారు. నిజానికి ద్రవిడ రాజకీయానికి, సినిమాకు అవినాభావ సంబంధం అనాదిగా కొనసాగుతూనే ఉంది. సినిమా రచయిత కరుణానిధి, ఆయన మిత్రుడు, ప్రత్యర్థి ఎంజీఆర్, ఆ తర్వాత సినీ నటి జయలలిత తమిళ సీఎంలుగా గద్దెనెక్కగా, మరెందరో సినీనటులు కీలక పదవులను అధిష్టించగలిగారు.అంతే కాదు తమిళనాట సినీనటులు రాజకీయాల్లో రాణించినతర్వాతే తెలుగునాట ఎన్టీఆర్ సీఎం అయ్యారు.దక్షిణాదిన జీవించే వారే మూలభారతీయులనీ, వీరు ఆర్యుల కంటే ప్రాచీనులనీ, ద్రవిడ సంస్కృతే నిజమైన భారతీయ సంస్కృతిఅని, మనమంతా ఆ ఘనమైన సంస్కృతికి వారసులుగా గర్వపడాలని చెబుతూనాడు పెరియార్ ద్రవిడ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమంలో మరొక నేత అన్నాదొరై కీలక పాత్ర పోషించారు. కొన్ని సినిమాల్లో నటించటమే గాక మాటల రచయితగానూ పనిచేశారు. జనంలో బలమైన ద్రవిడ భావన తీసుకొచ్చేందుకు అన్నాదొరై సినిమాను బలమైన మాధ్యమంగా గుర్తించి వాడుకొని, డీఎంకే పార్టీని స్థాపించి, తర్వాతి రోజుల్లో సీఎం కాగలిగారు. ఆ ఉద్యమంలో అప్పటికి సినీమాటల రచయితగా ఉన్న కరుణానిధి, సినీనటుడిగా ఉన్న ఎంజీ రామచంద్రన్ తదితరులు.. అన్నాదొరైకు అండగా నిలిచారు. వీరిలో కరుణానిధి తన పదునైన సినిమా డైలాగులతో, రామచంద్రన్ తన నటనతో తమిళుల మనసును గెలుచుకోగలిగారు. 1972లో అన్నాదురై మరణం తర్వాత డీఎంకే తరపున సీఎం అయిన కరుణానిధి మరో నాలుగు సార్లు ఆ పదవిని అధిష్టించారు. మిత్రుడైన కరుణానిధి తొలిసారి సీఎంగా ఉన్నకాలంలో ఆయనతో వచ్చిన రాజకీయ విరోధాల వల్ల డీఎంకేలో ఇమడలేకపోయిన ఎంజీ రామచంద్రన్ అన్నాడీఎంకే పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్నారు. 1977 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన



విజయం సాధించిన ఆయన 1987వరకు సీఎంగా కొనసాగారు. ఆయన మరణం తర్వాత ఈయన రాజకీయ వారసురాలిగా వచ్చిన జయలలిత 4 సార్లు సీఎంగా రాణించారు. తర్వాత ప్రముఖ నటుడు కమలహాసన్ 2018లో మక్కల్ నీది మైయం అనే రాజకీయ పార్టీని స్థాపించి రాజకీయ అరంగేట్రం చేసినాపెద్దగా రాణించలేకపోయారు.కరుణానిధి, జయలలిత మరణం తర్వాత తమిళనాట ఏర్పడినరాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు బీజేపీ చురుగ్గా పనిచేస్తోంది. కొత్త పార్లమెంటులో సెంగోల్ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలతో తన ఓటు బ్యాంకును పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతిజిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి, 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించటం,2018 నాటి తూత్తుకుడిపోలీసు కాల్పుల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించటం వంటి సేవాకార్యక్రమాలతో యువతలో తన బలం పెంచుకున్న విజయ్ 2023చివరిలో తన రాజకీయ ప్రవేశం గురించి హింట్ ఇచ్చారు. 224 ఫిబ్రవరిలో 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) పేరుతో పార్టీ పెట్టి జనంలోకి దూసుకుపోతున్నారు. అవినీతి, విభజనపూరిత పాలనకు వ్యతిరేకంగా తాను రాజకీయాల్లోకి వచ్చానని, తనకు అవకాశమిస్తే.. తమిళనాడును దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా మారుస్తానని విజయ్ పదేపదే చెబుతున్నారు.చదువుకున్న మహిళా అభ్యర్థులకు రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తాననీ, తమ పార్టీలోకి వచ్చేవారికి నేర చరిత్ర, అవినీతి మరకలు ఉండకూడదని ఆయన చెబుతున్నారు. తన పార్టీలో సినిమా నటులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉండదనీ ఆయన స్పష్టం చేశారు.టీవీకే నుంచి తానే ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్ ఇది వరకే ప్రకటించుకున్నారు. ద్రావిడ రాజకీయ ప్రభంజనంగా పేరొందిన ఎంజీ రామచంద్రన్‌లా తానూ వస్తున్నట్లు విజయ్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. సామాజిక న్యాయం,సమానత్వం, లౌకికవాదం,తమిళ సంస్కృతి పరిరక్షణ,అవినీతి నిర్మూలన, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. పెరియార్, అంబేద్కర్ మాజీ ముఖ్యమంత్రి కె.కామరాజ్, స్వాతంత్ర్య సమర యోధులు రాణి వేలు నాచియార్, అంజలై అమ్మాళ్ తమ సైద్ధాంతిక స్ఫూర్తి అన్నారు. పుట్టుకతో అందరూ సమానమే అంటూ ప్రతి సభలోనూ నినదిస్తున్నారు. కేంద్ర తెస్తున్న త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించటం, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ, సీఏఏపై కేంద్రం తీరునూ విజయ్ తప్పుబట్టారు. కేంద్రం అమలు చేయాలనుకుంటున్న ఒకేదేశం, ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం లాంటిదేనని మండిపడిన విజయ్ తమిళ విద్యార్థులకు అవరోధంగా ఉన్ననీట్‌పరీక్షల తీరుపై విమర్శలు సంధిస్తూ తాను బీజేపీతో కలవబోనని సంకేతాలు ఇస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల్లో అసంతృప్తిగా ఉన్న నేతలను తనపార్టీలోకి ఆహ్వానిస్తూ పార్టీని బలోపేతంచేస్తున్నారు. అన్నాడీఎంకేలో ఏకంగా 9వసారి ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నేత సెంగోట్టెయ్యన్ తిరుగుబాటు చేయడంతో పార్టీ బహిష్కరించటంతో ఆయనకు స్వాగతం పలికి ప్రత్యర్థులకు షాకిచ్చారు విజయ్. కెప్టెన్ విజయకాంత్ తీసుకొచ్చిన దేశీయ ముర్పొక్కు ద్రావిడ కళగంతో సహా పలు చిన్న పార్టీలనూ కలిపి కూటమికట్టే యత్నాల్లో బిజీగాసాగిపోతున్నారు విజయ్.ఈ ప్రయత్నంలో విజయ్ ఏమేరకు విజయం సాధిస్తారనేది తెలియాలంటే.. మరికొన్ని నెలలు వేచిచూడాల్సిందే. •

# బాండీబీచ్‌లో యూదులపై కాల్పులు



## 12 మందిపైగా మృతి, మరికొందరికి తీవ్ర గాయాలు

## హాహాకారాలు చేస్తూ పరుగులు తీసిన పర్యాటకులు

**సిడ్నీ, డిసెంబరు 14:** ప్రముఖ పర్యాటక బాండీ బీచ్‌లో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శాంతి వాతావరణాన్ని భగ్నంచేస్తూ యూదుల పండుగ 'హనుక్క' తొలి రోజే లక్ష్యంగా ఈకాల్పులు జరిపారు. సిడ్నీలోని బాండీ బీచ్‌లో జరిగిన ఈ ఘటనలో కనీసం 12 మంది పర్యాటకులు మృతిచెందగా పలువురు గాయపడ్డారు. ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మొత్తం 50 రౌండ్ల పాటు కాల్పులు జరిపినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో దుండగుడు హతమవ్వగా మరొకర్ని అరెస్ట్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కాల్పులతో పర్యాటకుల హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. ప్రశాంతంగా ఉన్న బీచ్‌లో ఒక్కసారిగా బీతావాహ పరిస్థితి నెలకుంది. ఈ కాల్పుల ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఆయన అన్నారు. ఘటనా స్థలిలో బాధితులను రక్షించేందుకు పోలీసులు, అత్యవసర సహాయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎఎఫ్‌పి కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌లతో మాట్లాడాను మేము స్థానిక పోలీసులతో కలిసి పనిచేస్తున్నాం, మరిన్ని వివరాలను ధ్రువీకరించిన అనంతరం తదుపరి సమాచారం అందిస్తాం, పోలీసుల సూచనలను ప్రజలు పాటించాలని ఆసీస్ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ విజ్ఞప్తి చేసారు. బాండీ బీచ్‌లో ఘటనపై సమాచారం అందిన వెంటనే స్పందించామని న్యూ సౌత్ వేల్స్ పోలీసులు చెపుతూ అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. కాల్పులు జరిపిన ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నామనిపోలీసులు చెప్పారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని, పోలీసులిచ్చే అన్ని సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎనిమిది రోజుల పాటు కొనసాగే యూదుల పండుగ 'హనుక్కా' మొదటి రోజే ఈ ఘటనచోటుచేసుకుంది. ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం సాయంత్రం 6.30 గంటల తర్వాత యూదుల పండుగ ఆరంభాన్ని గుర్తిస్తూ బీచ్‌లో వందలాది మంది చేరిన సమయంలోనే దుండగులు కాల్పులుప్రారంభించారు. పిల్లలు,వృద్ధులు అనే తేడా లేకుండా విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఘటనపై ప్రతిపక్ష నాయకురాలు సుసాన్‌లే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మనమంతా ఎంతో ఇష్టపడే బాండీలో జరిగిన విద్వేషపూరిత హింసతో యావత్తు దేశం శోకంలో మునిగిపోయిందని వాపోయారు. అయితే కాల్పుల్లో ఒక పర్యాటకుడు యూదు వ్యక్తి ఉగ్రవాదిని ప్రతిఘటించి ఆతడి చేతిలో తుపాకీ లాక్కుని కాల్పులు జరపడంతో ఉగ్రవాది అక్కడికక్కడేహతమయ్యాడు. ఈఘటనపై ఇజ్రాయెల్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిఘా వైఫల్యం వల్లనే ఇలాజరిగిందని, ఆసీస్‌ప్రభుత్వం ఇందుకు బాధ్యత వహించాలని ఒక నిరసనను ఆస్ట్రేలియా ప్రభుత్వానికి తెలియజేసింది.

## వచ్చే ఫిబ్రవరి 12న

# బంగ్లాదేశ్ ఎన్నికలు



## ప్రధాన ఎన్నికల కమిషనర్ నాసిర్ ఉద్దీన్ వెల్లడి

**ఢాకా, డిసెంబరు 14:** బంగ్లాదేశ్‌లో రాజకీయాలు క్షణక్షణం మారుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన దేశంలో సాధారణ ఎన్నికలు జరగనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ నాసిర్ ఉద్దీన్ ప్రకటించారు. ఎన్నికలు నిర్వహించాలన్న ఒత్తిళ్లు పెరుగుతుండటంతో కేర్‌టేకర్ ప్రభుత్వ చీఫ్ మహ్మద్‌యూనస్ ఎన్నికల నిర్వహణకు తలొగ్గాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికల నిర్వహణకు ముహూర్తం ఖరారు అయింది. ముఖ్యంగా ఈనెల 29వ తేదీ నుంచి నామినేషన్లు వేయాల్సి ఉండగా వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు ఉపసంహారణ గడువు ఉంటుంది. అలాగే ఫిబ్రవరి 12వ తేదీన పోలింగ్ నిర్వహించ నున్నారు. బంగ్లాదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 127.6 మిలియన్లకు పైగాఉన్నారు. వీరంతా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియో గించుకోనున్నారు. ఒకేరోజు పార్లమెంటరీ ఎన్నికలతో పాటు రాజ్యాంగ సంస్కరణలపై రెఫరెండం నిర్వహించడం బంగ్లాదేశ్ చరిత్రలో ఇదే తొలిసారి. అయితే ఈ నిర్ణయాన్ని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బిఎన్‌పి వ్యతిరేకించింది. గత యేడాది ఆగస్టు ఆందోళనల తర్వాత మాజీ ప్రధాని షేక్ హాసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ కార్యకలా పాలను నిషేధించారు. దీంతో గణనీయమైన మద్దతు ఉన్న అవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లేకపోవడం, ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మరోవైపు హాసీనా పాలనలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఎన్‌పి ఈ ఎన్నికల్లో ముందున్నట్లు భావిస్తున్నారు. అలాగే 2024 ఆగస్టులో జరిగిన ఆందోళనలకు నేతృత్వం వహించిన విద్యార్థిఉద్యమంనుంచి పుట్టిన నేషనల్ సిటిజన్ పార్టీ, జమాత్‌ఏఇస్లామీకి చెందిన అమర్ బంగ్లాదేశ్ పార్టీతో పొత్తు పెట్టుకొని ఈ ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. షేక్ హాసీనా ప్రభుత్వం దిగిపోయినతర్వాత బంగ్లాదేశ్‌లో జరుగనున్న ఈ ఎన్నికలు ఇపుడు అక్కడి రాజకీయ పార్టీలకే కాకుండా ప్రపంచదేశాలను ముఖ్యంగా ముస్లిం దేశాలకు ప్రాధాన్యతాంశంగా మారాయి.



# సిరియాలో ఐసిస్ దాడులు

## ఇద్దరు అమెరికా సైనికులు, ఒక ట్రాన్స్‌లేటర్ మృతి

**బీరూట్, డిసెంబరు 14:** సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఒక పౌర అనువాదకుడు మరణించారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. దీనికి చాలా తీవ్రమైన ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. ఈ దాడిలో మరో ముగ్గురు సైనికులు గాయపడినట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో తెలిపారు. ఐసిస్‌ను నిర్మూలించేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఇన్హెరెంట్ రిజాల్వ్‌లో భాగంగా ఈ సైనికులు పనిచేస్తున్నారు. పాల్మైరా ప్రాంతంలో కీలక నేతలతో సమావేశమవుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. గత ఏడాది డిసెంబర్‌లో బషర్ అల్‌అస్సాద్ అధికారం కోల్పోయిన తర్వాత సిరియాలో అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా ప్రభుత్వ దళాలకు చెందిన సైనికుడేనని అక్కడి ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. అయితే, అతడిని ఇప్పటికే మట్టుబెట్టామని, అంతర్గత భద్రతా విభాగంలో అతడికి ఎలాంటి నాయకత్వ పాత్ర లేదని సిరియా ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. పాల్మైరా ప్రాంతంలో ఐసిస్ దాడి జరిగే ప్రమాదం ఉందని తాము ముందే అమెరికాను హెచ్చరించినా వారు పట్టించుకోలేదని సిరియా ఆరోపించింది. ఈ దాడి జరిగిన ప్రాంతం సిరియా కొత్త ప్రభుత్వ పూర్తి నియంత్రణలో లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా తీవ్ర ఆగ్రహంతో, ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇటీవలే అల్‌షరా వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య సహకారానికి పరీక్షగా నిలిచింది.

# రోడ్ ఐలాండ్ బ్రౌన్ వర్సిటీలో కాల్పులు



## ఇద్దరు మృతి, ఎనిమిది మందికి గాయాలు

**రోడ్ ఐలాండ్( యుఎస్), డిసెంబరు 14:** అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. రోడ్ ఐలాండ్ రాష్ట్రంలోని ప్రఖ్యాత బ్రౌన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. యూనివర్సిటీలో ఫైనల్ పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నిందితుడి కోసం పోలీసులు క్యాంపస్ వ్యాప్తంగా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రొవిడెన్స్ మేయర్ బ్రెట్ స్మైలీ ఈ ఘటనను ధ్రువీకరించారు. నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి ఈ కాల్పులకు పాల్పడి, ఇంజినీరింగ్ భవనం నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అధికారులు సురక్షితమని ప్రకటించే వరకు బయటకు రావద్దని మేయర్ విజ్ఞప్తి చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు యూనివర్సిటీ అధికారులు తొలుత ప్రకటించినా, ఆ తర్వాత ఆ సమాచారాన్ని సరిదిద్దారు. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందని స్పష్టం చేశారు. తొలుత అదుపులోకి తీసుకున్న వ్యక్తికి ఈ ఘటనతో సంబంధం లేదని తేలినట్లు మేయర్ స్మైలీ పేర్కొన్నారు. ఈ దాడిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఘటన గురించి అధికారులు తనకు వివరించారని, బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా విచారం వ్యక్తం చేస్తూ, దర్యాప్తులో ఎఫ్‌బీఐ సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం క్యాంపస్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 12 చిన్న ప్రావిన్సులుగా పాకిస్థాన్ అంతర్గత విభజన!



**ఇస్లామాబాద్, డిసెంబరు 14:** స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత పాకిస్థాన్‌లో మళ్లీ విభజన అంశం ప్రస్తావనకు వచ్చింది. ఒకటి,రెండుకాదు.. ఏకంగా 12 భాగాలుగా పాకిస్థాన్‌ను విభజించాలని పాక్‌షరీఫ్ ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఇది కేవలం అంతర్గత విభజన. పాక్ జాతీయ సమాచార శాఖ మంత్రి అబ్దుల్ అలీమ్ ఖాన్ విభజన గురించి ప్రకటించడంతో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పాలనా సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పాకిస్థాన్‌ను 12 చిన్న ప్రావిన్సులుగా విభజించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. పాకిస్థాన్‌లో ప్రస్తుతం ఉన్న నాలుగు ప్రావిన్స్‌లు - పంజాబ్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ లను విభజించి 12 చిన్న ప్రావిన్సులుగా చేయడానికి రంగం సిద్ధమైందని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. దీని గురించి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌ల మధ్య ఇప్పటికే చివరి దశ చర్చలు ముగిశాయని మరి కొద్ది రోజుల్లోనే ఈ విభజన ప్రక్రియ మొదలవుతుందన్న ప్రచారం జోరందుకుంది. స్వాతంత్ర్యం నాటికి అంటే 1947 కాలంలో పాకిస్తాన్‌లో ఐదు ప్రావిన్సులు ఉన్నాయి. అవి బలుచిస్తాన్, తూర్పు బెంగాల్, సింధ్, పశ్చిమ పంజాబ్, వాయువ్య సరిహద్దు ప్రావిన్స్. మెరుగైన సేవలు, పరిపాలనా సౌలభ్యం కోసమే చిన్న ప్రావిన్సుల ఏర్పాటు చేయాలనుకుంటున్నట్టు పాక్ పాలకులు చెబుతున్నా దేశంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొంతకాలంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్తాన్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ రెండు ప్రాంతాల ప్రజలు తమను స్వతంత్ర దేశాలుగా ప్రకటించాలని గత కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. అలానే పాక్ ప్రధాని, అసిమ్ మునీర్‌ల పాలన మీద ప్రజల్లో వ్యతిరేకత రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో విభజన చర్చ తెర మీదకు వచ్చింది.

# పవార్ పుట్టినరోజు వేడుకల్లో అదానీ, రాహుల్ కరచాలనం!



**ముంబయి, డిసెంబరు 14:** ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పుట్టినరోజు విందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ముఖాముఖిగా కలుసుకున్నారు. ఇద్దరూ కరచాలనం కూడా చేసుకున్నారు. ఈ అరుదైన దృశ్యం కెమెరాల్లో బందీ కాకుండా నిర్వాహకులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈనెల 11న శరద్ పవార్ 85వ పుట్టినరోజు సందర్భంగా ఈ విందు జరిగింది. రాజకీయాలకు అతీతంగా సంబంధాలు నెరిపే పవార్, ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నేతలతో పాటు వ్యాపార ప్రముఖులను కూడా ఆహ్వానించారు. ఈ విందులో రాహుల్ గాంధీ, పవార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న ఫోటోలు బయటకు వచ్చినా, రాహుల్, అదానీ కలిసిన ఫోటోలు మాత్రం కనిపించలేదు. సీనియర్ జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయ్, ఆదేశ్ రావల్ ఒక చర్చా కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. రాహుల్, అదానీ ముఖాముఖిగా కలవడం నేను చూడటం అదే మొదటిసారి. కానీ ఆశ్చర్యంగా వారి ఫోటో ఒక్కటి కూడా బయటకు రాలేదుఅని సర్దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో పవార్ కుమార్తె, బారామతి ఎంపీ సుప్రియా సూలే జోక్యం చేసుకుని, వారిద్దరి ఫోటోలు ఎవరూ తీయకుండా అడ్డుకున్నారని ఆదేశ్ రావల్ వివరించారు. ఈ ఫోటో బయటకు వస్తే రాజకీయంగా కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవు తాయని ఆమె భావించి ఉండవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు లేకపోయినా, విషయం తెలిసిన వెంటనే బిజెపి కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టింది. అదానీపై నిత్యం గొంతు చించుకునే రాహుల్ గాంధీ, ఇప్పుడు ఆయనతో కలిసి విందులో పాల్గొనడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బిజెపి నేతలు ఆరోపించారు. గత కొన్నేళ్లుగా అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుని రాహుల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల కాంగ్రెస్ వైఖరిలో మార్పు కనిపిస్తోందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అదానీ గ్రూప్ భారీ పెట్టుబడులు పెట్టడమే దీనికి నిదర్శనమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సంక్షిప్తంగా..

## సిఐసి ప్రధాన కమిషనర్‌గా రాజ్‌కుమార్ గోయల్



**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) నూతన ప్రధాన కమిషనర్‌గా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో 8 మందిని కమిషనర్లుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీనేతృత్వంలోని త్రిసభ్య కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఈ నియామకాలు జరిగాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ జర్నలిస్టులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, రైల్వే బోర్డు మాజీ ఛైర్‌పర్సన్ జయవర్మ సిన్హా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుధారాణి రేలంగి వంటి ప్రముఖులు ఉన్నారు. సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాజ్‌కుమార్ గోయల్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నియామకాలతో సిఐసిలో ఖాళీగా ఉన్న చీఫ్ సహా మొత్తం 9 పోస్టులు భర్తీ అయ్యాయి. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత కమిషన్ పూర్తిస్థాయి సామర్థంతో పనిచేయనుండటం గమనార్హం.

## దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన హిందూదేవాలయం

**డర్బన్, డిసెంబరు 14:** దక్షిణాఫ్రికాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. క్వాజులునాటల్ ప్రావిన్స్‌లో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల హిందూ దేవాలయం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో భారత సంతతికి చెందిన వ్యక్తిసహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దర్బన్‌కు ఉత్తరాన ఉన్న రెడ్‌క్లిఫ్ ప్రాంతంలో న్యూ అహోబిలం టెంపుల్ ఆఫ్ ప్రొటెక్షన్ పేరుతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతోంది. కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉండగా భవనంలోని ఒక భాగం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆలయ ట్రస్ట్ కార్యవర్గ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ అయిన విక్కీ జైరాజ్ పాండే (52) మరణించినట్లు అధికారులుగుర్తించారు. ఈ ఘటనలో మొత్తం నలుగురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు.

# కొత్తసంవత్సరంలోనూ రెండు చంద్రగ్రహణాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** కొత్త సంవత్సరంలో రెండు చంద్రగ్రహణాలు కనువిందు చేయబోతున్నాయి. 2025 సంవత్సరంలో కూడా రెండు చంద్రగ్రహణాలు ఏర్పడిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరంలో మార్చి, ఆగస్టు మాసాల్లో చంద్రగ్రహణాలు ఏర్పడనున్నాయి. వాస్తవానికి చంద్రుడు సొంతంగా ప్రకాశించలేడు. సూర్యకిరణాలు చంద్రుడిపై పడినప్పుడు అవి అక్కడి నుంచి ప్రతిబింబిస్తాయి. అందుకే చంద్రుడు ప్రకాశించినట్లుగా మనకుకనిపిస్తుంది. సూర్యుడిచుట్టూ భూమి కక్ష్యలో ఉన్నప్పుడు, చంద్రుడు సూర్యుడికి మధ్యలో భూమి వస్తుంటుంది. ఆ సమయంలో సూర్యకాంతి చంద్రుడిపైపడదు. సూర్యుడు,భూమి, చంద్రుడు వాటికక్ష్యలో ఒకే వరుసలో ఉన్న సమయంలో మాత్రమే ఇలా జరుగుతుంది. ఆ సమయంలో భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. దీంతో, చంద్రుడిపై నీడ ఉన్న భాగం చీకటిగా మారుతుంది. మనం భూమిపై నుంచి చూసిన సమయంలో ఆ భాగం మొత్తం నల్లగా కనిపిస్తుంది. దాన్నే మనం చంద్రగ్రహణంగా పిలుస్తుంటాం. 2026లో తొలి చంద్రగ్రహణం మార్చి 3న ఏర్పడుతుంది. ఇది పాక్షిక చంద్రగ్రహణం. ఈ గ్రహణం తూర్పు యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్, ఆర్కిటిక్, అంటార్కిటికా ప్రాంతాల్లో కనిపిస్తుంది. అలాగే, భారత్‌లోనూ ఈ గ్రహణం దర్శనమిస్తుంది. భారతకాలమానం ప్రకారం సాయంత్రం 6.26 గంటలకు మొదలై.. 6.46 గంటలకు ముగుస్తుంది. రెండో చంద్రగ్రహణం ఆగస్టు 28న ఏర్పడుతుంది. ఈ గ్రహణం భారత్‌లో కనిపించేందుకు అవకాశం లేదు. రెండో గ్రహణం యూరప్, వెస్ట్ ఆసియా, ఆఫ్రికా, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఫసిఫిక్, అట్లాంటిక్ ప్రాంతాల్లో కనిపిస్తుంది.

## దట్టమైన పొగమంచుతో వాహనాలు ఢీ

**చండీగఢ్, డిసెంబరు 14:** హర్యానాలో దట్టమైన పొగమంచు కారణంగా ఇవాళ పలుచోట్ల ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రోడ్లపై కనీసం దారి కూడా కనిపించకపోవడంతో బస్సులు, ట్రక్కులతో సహా దాదాపు 40 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు డ్రైవర్లు, ప్రయాణికులు గాయపడ్డారు. ముఖ్యంగా రోహ్తక్, హిసార్, రేవాడీ జిల్లాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.రోహ్‌తక్‌లోని మెహమ్ ప్రాంతంలో ఒక హైవే కూడలి వద్ద సుమారు 35 నుంచి 40 వాహనాలు గొలుసుకట్టుగా ఢీకొన్నాయి. మొదట ఒక ట్రక్కు, కారు ఢీకొనగా, వెనుక వస్తున్న వాహనాలు ఒకదాని తర్వాత ఒకటి ఢీకొంటూ వెళ్లాయి. ఈ ఘటనలో అనేక వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు.



## భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన

# లష్కరే ఉగ్రవాది

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కాడు. ఢిల్లీని ఆక్రమిస్తాం అనే అర్థం వచ్చేలా 'పెళ్లిపిల్లనుచేస్తాం' అనే వ్యాఖ్యలు చేయడాన్ని భారత్ తీవ్రంగా పరిగణిస్తోంది. భారత వైమానిక దళంపైనా ఆ ఉగ్రవాది నోరుపారేసుకున్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు. పాకిస్థాన్ ఆర్మీ అతడిని గతంలో సాధారణ పౌరుడిగా, అమాయకుడిగా పేర్కొన్నది. అయితే ఇప్పుడు భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతున్నది. తాజాగా అతడు మాట్లాడుతూ జమ్మూకశ్మీర్‌లో పోరాటం సమసిపోయిందనే వాదనలను కొట్టిపారేశాడు. జమ్ముకశ్మీర్‌లో పోరాటం ముగియలేదని, వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరించాడు. ఎల్ఇటి సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు.

# ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హమాస్ కమాండర్ హతం

**జెరూసెలెం, డిసెంబరు 14:** ఇజ్రాయెల్‌పై హమాస్ భీకర ఉగ్రదాడిచేసింది. 1200 మందినిక్రూరంగా హతమార్చిన ఈ సంఘటనకు పథకరచనచేసిన అసలు కమాండర్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది. ఈ మారణహోమానికి సూత్రధారుల్లో ఒకరుగా ఉన్న సీనియర్ హమాస్ సైనిక కమాండర్‌పై వైమానిక దాడిచేసి హతమార్చింది. కస్సామ్‌బ్రిగేడ్స్‌లో సీనియర్ సభ్యుడుగా ఉన్న రాద్‌సాద్‌ను ఐడిఎఫ్‌దళాలు హతమార్చాయి. హమాస్‌కు ఆయుధాలు సమీకరించుకునేందుకు, తయారుచేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. హమాస్ ప్రస్తుత సైనిక అధిపతి ఇజ్ అల్‌దిన్ హద్దాద్‌కు డిప్యూటీగా ఆతడు పరిగణించబడ్డాడని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈదాడికి సంబందించిన విడియోను కూడా విడుదలచేసింది. ఒక వాహనం పేలిపోతున్నట్లు ఇందులోఉంది. రషీద్‌కోస్టల్‌రోడ్‌లో కారులో పారిపోతున్న సమయంలో సాద్‌పై దాడిజరిగింది.

గాజాలో ఇప్పటికీ పనిచేస్తున్న హమాస్ కమాండర్లలో సాద్‌కూడా ఒకరని ఐడిఎఫ్ ప్రకటిం చింది. ఇజ్రాయల్ బలగాలపై దాడులుచేయడానికి సాద్ అనేక ప్రయత్నాలు చేసాడని కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా ఉల్లంఘిస్తున్నట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది.

## రాజస్థాన్‌లో రామ్‌నామ్ డిపాజిట్ బ్యాంకు

**జైపూర్, డిసెంబరు 14:** బ్యాంకు అంటేనే సహజంగా గుర్తుకు వచ్చేది సొమ్ముడిపాజిట్లు లావాదేవీలు. కానీ రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక విభిన్నమైన బ్యాంకు ఉంది. ఇక్కడ ధనానికి బదులుగా రామనామాలను డిపాజిట్లుగా స్వీకరిస్తారు. గోవింద్ దేవ్ జీ ఆలయ ప్రాంగణంలో రామ్ నామ ధన సంగ్రహ బ్యాంక్ పేరుతో ఇది కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ బ్యాంకులో సుమారు 14 వేల కోట్లకు పైగా రామనామాలను భక్తులు డిపాజిట్ చేశారు. బాలకృష్ణ పురోహిత్ అనే వ్యక్తి 1987లో ఈ బ్యాంకును ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు తాము రాసిన రామనామ పుస్తకాలను ఇక్కడ డిపాజిట్ చేస్తారు. ప్రతి భక్తుడికి ఒక మంత్ర అకౌంట్‌ను కేటాయిస్తారు.

# లిబియాలో గుజరాత్ కుటుంబం కిడ్నాప్

## లోకల్ నేరగాళ్ల చెరలో ఉన్నట్లు గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** అక్రమంగా విదేశాల్లో స్థిరపడాలని భావిస్తున్న గుజరాత్‌కు చెందిన మరో కుటుంబం అస్థిరంగా వుంటూ ఉగ్రవాదులకు అడ్డాగా వున్న ఆఫ్రికా దేశం లిబియాలో కిడ్నాపర్లకు బందీలుగా చిక్కారు. దుబాయ్ నుంచి లిబియా మీదుగా యూరోపియన్ దేశం పోర్చుగల్‌కు వెళ్లి అక్కడ అక్రమంగా స్థిరపడాలని గుజరాత్‌కు చెందిన కిస్మత్‌సింగ్ చావ్డా కుటుంబం భావించి మధ్యలో కిడ్నాపర్ల వద్ద బందీలుగా వున్నారు. గుజరాత్‌లోని మెహసానా జిల్లా బాదల్‌పురాకు చెందిన కిస్మత్ సింగ్ చావ్డా సోదరుడు పోర్చుగల్‌లో స్థిరపడ్డాడు. తాను కూడా ఆ దేశంలో స్థిరపడాలని కిస్మత్ సింగ్ చావ్డా భావించాడు. ఇందుకు పోర్చుగల్‌లో వున్న అతని సోదరుడు అంగీకరించాడు. దీని తరువాత గత నెల 29వ తేదీన కిస్మత్ సింగ్ చావ్డా తన భార్య హీనా బెన్, కుమార్తె దేవాన్షీలతో కలిసి దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి లిబియాలోని బెంఘాజి నగరానికి వెళ్లాడు. లిబియా నుంచి పోర్చుగల్‌కు వెళ్లే క్రమంలో వీరిని బెంఘాజి నగరంలో అక్కడి నేరగాళ్లు కిడ్నాప్ చేశారు. వీరిని ప్రాణాలతో వదలాలంటే రెండు కోట్ల రూపాయలు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం కిస్మత్ సింగ్ చావ్డా గుజరాత్‌లోని తన కుటుంబానికి చెప్పగా వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి సహాయం చేయాలని కోరారు. దీంతో మెహసానా జిల్లా కలెక్టర్ ప్రజాపతితో పాటు పోలీసు అధికారులు కేంద్ర హోం శాఖ అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన కేంద్ర హోం శాఖ లిబియాలోని భారత రాయబార కార్యాలయానికి సమాచారం అందించి కిడ్నాపర్ల చెరలో వున్న బాధితులను కాపాడాలని కోరింది. దీనిపై లిబియా దేశ పోలీసులు విచారణ చేబట్టారని గుజరాత్ పోలీసులు తెలిపారు. కాగా రెండు నెలల క్రితం అమెరికాకు అక్రమంగా వెళ్లాలని భావించిన ఓ కుటుంబం ఇరాన్‌లో ఉగ్రవాదుల బందీగా మారగా కేంద్ర హోం శాఖ ఇరాన్ ప్రభుత్వంతో చర్చించి విడుదల చేయించింది.

## విమానంలో కుప్పకూలిన మహిళకు మాజీ ఎమ్మెల్యే సిపిఆర్

**బెంగళూరు, డిసెంబరు 14:** గాలిలో ఉన్న విమానంలో తీవ్ర అస్వస్థతకు గురైన ఓ మహిళా ప్రయాణికురాలిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సిపిఆర్‌చేసి ప్రాణాలు కాపాడారు. విమానం గాల్లో ఉండగా అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన మహిళా ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఒక్కసారిగా కుప్పకూలిన ఆమెకు అదే విమానంలో ప్రయాణిస్తున్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ అంజలి నింబాల్కర్ సిపిఆర్ చేసి కాపాడారు. అంజలి గతంలో కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రయాణికురాలిని కాపాడటంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసలు కురిపించారు.



ఆదివారం స్వామి వారి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు తీసుకవస్తున్న మంత్రి కొండా సురేఖ

## వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం

### స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ

**కొమురవెల్లి, డిసెంబరు 14, ప్రభాతవార్త:** భక్తుల కొంగు బంగారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి క్షేత్రంలో ఆదివారం ఉదయం 10.45 నిమిషాలకు కన్నుల పండువగా జరిగింది. స్వామి వారి కళ్యాణానికి ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సమర్పించారు. దేవాలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద వైదికుల మంత్రోచ్ఛారణలు, భాజా భజంత్రీలతో స్వామి వారి కల్యాణాన్ని వెండి సింహాసనంపై కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి రాష్ట్ర నలుమూల నుంచి కాకుండ పక్క రాష్ట్రాల నుంచి భక్తజనం వేలాదిగా మల్లన్న దేవాలయానికి తరలివచ్చారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. గర్భాలయంలో స్వామి కళ్యాణం నిర్వహించగా స్వామి తరపున పడిగన్నగారి వంశస్థులు అంజనేయులు శారద, అమ్మవార్ల తరుపున మహాదేవుని భాస్కర్ దంపతులు కన్యాదానం స్వీకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకులు ఆలయ నుంచి పోలీసు బొమ్మ, రాతిగీరలు, ఆలయ పరిసరాలలో ఊరేగించారు. అమ్మవారి తరపున మహాదేవుని వినయ్‌కుమార్ దంపతులు, స్వామి వారి తరపున పడిగన్నగారి వంశస్తులు చిన్న మల్లేశం దంపతులు కన్యాదానం స్వీకరించారు. వీరశైవ ఆగమ పండితులు, పురోహితులు, నందుల మఠం శశిభూషణ సిద్దాంతి స్వామిలతో పాటు ఆగమ పాఠశాల వేదపండితులు, విద్యార్థులు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, దేవాదాయశాఖ కమిషనర్ హరీష్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఈవో టంకశాల వెంకటేశం, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెంట్ నీల శేఖర్, ఎంపిడివో పంచాయతీ కార్యదర్శి, మాజీ ప్రజాప్రతినిధులు ఎంపిడివో, తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

## 42 శాతం రిజర్వేషన్‌లతో ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించాలి

### లేకపోతే యుద్ధం తప్పదు: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 14 ప్రభాత వార్త:** వచ్చే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లతో రాష్ట్ర ప్రభుత్వం వెళ్ళాలని, లేకపోతే యుద్ధమై జరుగుతుందని 14 బిసి సంఘాలు హెచ్చరించాయి. గ్రామపంచాయితీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు త్వరలో జరుగుతాయని అందువల్ల ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించి ఎన్నికలను నిర్వహించాలని సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 14 సంఘాల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగిస్తూ గత రెండేళ్ళలో సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి 62 సార్లు వెళ్ళారని, ఒక్కసారి కూడా బిసిల గురించి ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో చరించలేదని, కనీసం అఖిల పక్షాన్ని కూడా ఢిల్లీకి తీసుకు వెళ్లలేకపోయారని ఆరోపించారు. ఈ సారి కోర్టుల్లో కేసులు వాదించడానికి సీనియర్, ప్రాముఖ్యత కలిగిన జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న అద్వకేట్లను నియమించాలని, హైకోర్టులో వేసిన మొత్తం 62 కేసులు వివరంగా చర్చించాలని కోరారు. తమ కేసుబలమైందని, రాజ్యాంగ బద్దంగా, చట్టబద్దంగా, న్యాయబద్దంగా జివో నెంబరు 9ఉందని, అందువల్ల కేసు గెలిచే అవకాశాలు ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దురదృష్టవ శాత్తు కేసు గెలవకపోతే రాజ్యాంగ సవరణ కోసం పోరాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు నీలవెంకటేశ్, మోదీ రాందేవ్, రాజ్‌కుమార్, అఖిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు,

## ప్రశాంతంగా ముగిసిన ఎపిపి రాత పరీక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** పోలీసు విభాగంలోని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి ఆదివారం జరిగిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 118 పోస్టులకు వెలువడ్డ నోటిఫికేషన్‌లో 2925 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి ఆ దివారం నాడు ఉదయం జరిగిన పేపర్ 1 పరీక్షలకు 2306 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం జరిగిన పేపర్ 2 పరీక్షలకు 2270 మంది అభ్యర్థులు హాజరైనట్లు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. కాగా పేపర్ 1కు సంబంధించి ప్రిమిలినరీ కీ త్వరలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

## ఫుడ్‌పాయిజన్‌పై విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలి

### బాధిత విద్యార్థులను పరామర్శించిన జాన్‌వెస్లీ

**హైదరాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని మైనారిటీ గురుకులంలో జరిగిన ఫుడ్ పాయిజన్ బాధిత విద్యార్థులను సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆదివారం కింగ్ కోఠి ఆసుపత్రిలో పరామర్శించారు. రాష్ట్రంలోని గురుకులాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై విచారణ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాదు బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకుల బాలికల హాస్టల్‌లో నవంబర్ 12న కలుషిత పెరుగు, కుళ్ళిన కూరగాయల ఆహారం తిని 26 మంది విద్యార్థినీలు తీవ్ర అస్వస్థతతకు గురై కింగ్‌కోఠి, నీలోఫర్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని ఈ ఘటన బయటకు రాకుండా ప్రిన్సిపాల్ ప్రయత్నించడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తుందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. ఈ ఘటనపై సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళనను వెలిబుచ్చుతుందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నందున .. వాటిని అరికట్టేందుకు ఒక విచారణ కమిషన్ ఏర్పాటు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులను పరామర్శించిన వారిలో హైదరాబాదు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్‌రెడ్డి ఉన్నారు. కింగ్‌కోఠిలో చికిత్స పొందుతున్న విద్యార్థినీలను, వారి తల్లిదండ్రులతో మాట్లాడిన జాన్‌వెస్లీ విద్యార్థినీల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

## సెలవులో పాఠశాల విద్య డైరెక్టర్

### ఎవరికి బాధ్యతలు ఇవ్వని ప్రభుత్వం

### నెలాఖరు వరకు నికోలస్ సెలవు

**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 14:** తెలంగాణ పాఠశాల విద్య శాఖ డైరక్టర్ నవీన్ నికోలస్ సెలవుపై వెళ్లారు. ఆయన సెలవుపై వెళ్లినప్పటికీ పాఠశాల విద్య శాఖ వేరే ఏ ఐఏఎస్ అధికారికి అదనపు బాధ్యతలు ఇవ్వలేదు.. ఇప్పటికే విద్యా శాఖలో కొనసాగుతున్న ఐఏఎస్ అధికారులకు సైతం పాఠశాల విద్య బాధ్యతలను అప్పగించలేదు. దీంతో 60 లక్షల మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాల విద్యకు డైరక్టర్ లేకుండానే శాఖ కొనసాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ ఈ నెలాఖరు వరకు సెలవుపై వెళ్లారు. ఈ 15 రోజులపాటు పాఠశాల విద్య శాఖలోని ఫైళ్లను ఎవరు చూడాలనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. సాధారణంగా రోజువారీ తీసుకునే నిర్ణయాలను సైతం తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. పాఠశాల విద్య శాఖలో 1.08 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వేలాది మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ నెల 20నరాష్ట్ర వ్యాప్తంగా పేరెంట్ టీచర్ మీటింగ్(పిటిఎం)ను కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యకు డైరక్టర్ లేకపోవడంపై ఉపాధ్యాయ సంఘాలతోపాటు, విద్యార్థి సంఘాలు విమర్శలు చేస్తున్నారు. విద్యా శాఖ కార్యదర్శిగా ఉన్న డాక్టర్ యోగితా రాణా తన 45రోజుల సెలవులను ముగించుకొని నేడు(సోమవారం) తిరిగి విధుల్లో చేరనున్నారు. నేడు తిరిగి విధుల్లో చేరిన తరువాత పాఠశాల విద్య అదనపు బాధ్యతలను ఎవరికైనా అప్పగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# తెలంగాణ సత్తా ప్రపంచానికి చాటాం

### హైదరాబాద్‌లో మెస్సీ టూర్ విజయవంతంపై సిఎం రేవంత్ హర్షం

### దిగ్గజ క్రీడాకారులు మెస్సీ, లూయిస్ సువారెజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబరు14:** హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ పర్యటన విజయవంతం కావడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ అంటే క్రీడలు, తెలంగాణ అంటే శ్రేష్ఠత, తెలంగాణ అంటే ఆతిథ్యం అని ప్రపంచానికి చాటి చెప్పామని ఆయన అన్నారు. ఈ మెగా ఈవెంట్‌ను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'మా ఆహ్వానాన్ని మన్నించి హైదరాబాద్ నగరానికి విచ్చేసి క్రీడాభిమానులను, ముఖ్యంగా యువతను ఉత్సాహపరిచిన ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనెల్ మెస్సీ, లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై, శనివారం సాయంత్రాన్ని జీవితాంతం గుర్తుండిపోయేలా చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అహర్నిశలు శ్రమించిన నగరంలోని అధికారులు, భద్రతా సిబ్బంది, నిర్వాహకులు, ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు. వచ్చిన అతిథులకు అత్యుత్తమ ఆతిథ్యం అందించడంలో క్రమశిక్షణతో వ్యవహరించిన క్రీడాభిమానులకు, ప్రజలకు ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ సత్తాను ప్రపంచానికి చూపించేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

**మెస్సీ టూర్ స్మూత్‌గా సాగిపోయింది, హేట్సాఫ్ రేవంత్‌రెడ్డి: నిర్మాత నాగవంశీ**

టాలీవుడ్ యువ నిర్మాత సూర్యదేవర నాగవంశీ హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన ది గోట్ మెస్సీ టూర్ ఇండియా 2025 కార్యక్రమంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇంతటి భారీ అంతర్జాతీయ ఈవెంట్‌ను ఎలాంటి గందరగోళం లేకుండా, ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత, నాయకత్వ పటిమ ఉన్నాయని కొనియాడారు. ఈ విషయంపై నాగవంశీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "మెస్సీ టూర్ ఆద్యంతం ఎంతో సజావుగా సాగింది. ఒక అంతర్జాతీయ కార్యక్రమాన్ని ఇంత అద్భుతంగా నిర్వహించడం గర్వంగా ఉంది. తెలంగాణ రైజింగ్ అనే మాట ఈ రోజు నిజమైందనిపిస్తోంది" అని పేర్కొన్నారు. ఈ ఈవెంట్‌తో హైదరాబాద్ నగరం ప్రపంచ పటంలో ఒక ముఖ్యమైన చర్చనీయాంశంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంతటి ఘనత సాధించడం సీఎం రేవంత్ రెడ్డి అవిశ్రాంత కృషి వల్లే సాధ్యమైందని నాగవంశీ కితాబిచ్చారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే హైదరాబాద్ ఇలాంటి గ్లోబల్ ఈవెంట్లను సునాయాసంగా నిర్వహించగలుగుతోందని అభినందించారు.

## లెవీ బియ్యం సబ్సిడీ బకాయి రూ. 1468 కోట్లు చెల్లించండి

### పిఎంజికెఎవైపై సబ్సిడీ రూ.343.27 కోట్లు విడుదలలో జాప్యం

### సిఎంఆర్2024-25గడువు 2026 జనవరి 31కి పెంచండి

### ధాన్యం సేకరణ లక్ష్యం కేంద్రం 80లక్షల మె.టకు పెంచాలి

### కేంద్ర ఆహార,ప్రజాపంపిణీ మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్,డిసెంబరు 14,ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం నుంచి 2014-15 ఖరీఫ్ కాలంకు సంబంధించిన మిల్‌లెవి బియ్యం సబ్సిడీ రూ. 1468కోట్లు వెంటనే విడుదల చేయాలనీ అదే విధంగా 2021 మే నుంచి ఏప్రిల్ 2022 వరకు మూడు, నాలుగుఐదు దశల్లో ప్రధానమంత్రి గరీబి కళ్యాణ అన్నయోజన పథకం పంపిణీకి తెలంగాణ అలాట్‌చేసిన 10.54లక్షల మె.ట బియ్యం తాలుకు సబ్సిడీ రూ.343.27కోట్ల విడుదలకు జాప్యం జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహల్లాద్ జోషికి ఉత్తమ్‌కుమార్ రెడ్డి లేఖరాస్తు కేంద్రం తెలంగాణ రైతాంగ ప్రయోజనం కోసం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. తెలంగాణలో ధాన్యం సేకరణకు ఆటంకం కలగకుండా 80లక్షల మె.ట ధాన్యం సేకరణకు ఎఫ్‌సిఐ లక్ష్యం పెట్టుకోవాలని ఆయన సూచించారు. ఎఫ్‌సిఐ గోదాములు తక్కువ నిల్వసామర్థ్యంతో ఉన్నాయని అదనంగా 15లక్ష మె.ట నిల్వసామర్థ్యంతో గోదాములు నిర్మించాలని సూచించారు. ప్రస్తుతం 36లక్షల టన్నుల బియ్యం సేకరణ లక్ష్యం పెట్టారని తెలంగాణలో 148లక్షల మె.ట ధాన్యం దిగుబడైందని కనీసం 54లక్షల మె.ట బియ్యం సేకరణ లక్ష్యం చేసుకోవాలని సూచించారు. 13.5లక్షల మె.ట బియ్యం రవాణాకు రైల్వే రేక్స్ కేంద్రం కేటాయించాలని కోరారు. వ్యాగన్లు లేక గిడ్డంగుల్లో స్థలం లేదని వాపోయారు. 12నవంబరుతో సిఎంఆర్ గడువు ముగిసిందని జనవరి 31వరకు పెంచాలని కోరారు. 3.50 లక్షల మె.ట బియ్యం రైసుమిల్లుల వద్ద గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయని ఆయన లేఖలో వివరించారు. 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ తోపాటు రబి కి కలిపి అదనంగా మరో 10లక్షల మె.ట బాయిల్డ్ రైస్ సిఎంఆర్ కింద తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 35లక్షల మె.ట బియ్యం తీసుకొంటామని చెప్పి కేవలం 17.83లక్షల మె.ట పారాబాయిల్డ్ రైస్ , 1.13 ముడిబియ్యం సేకరణ చేశారని ఆయన లేఖలో ఎత్తి చూపారు. ఇంకా 1.56 లక్షల మె.ట బాయిల్డ్‌రైస్, 14.01లక్షలమె.ట ముడిబియ్యం తీసుకోవాల్సి ఉన్నా తీసుకోవడంలేదని అన్నారు. దీనికి అదనంగా పదిలక్షల మె.టన్నుల బాయిల్డ్‌రైస్ రబీ సీజన్‌కు చెందినది తీసుకొనేలా అదనపు కోటా కేటాయించాలని కేంద్ర ఆహార,ప్రజాపంపిణీ మంత్రికి తెలిపారు.

## విద్యుత్ గ్రిడ్ బలోపేతం

### సైబర్ దాడుల నుండి మరింత రక్షణ

### భద్రతకు విద్యుత్ మంత్రిత్వశాఖ కీలక ప్రతిపాదనలు

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** విద్యుత్ రంగం సైబర్ దాడుల నుండి మరింత భద్రతను మెరుగుపరచేందుకు చర్యలు చేపడుతోంది. కీలకమైన సేకరణ టెండర్ రద్దు తర్వాత, గ్రిడ్ రక్షణపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న సైబర్ ముప్పు నుండి జాతీయ విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌లను రక్షించడానికి అధునాతన, బహుళ భద్రతా చర్యలు చేపట్టాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. మంత్రిత్వ శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం ఇందుకు భారతదేశ విద్యుత్ రంగం డిజిటలైజేషన్ సైబర్ భద్రతపై దృష్టిని పెంచింది. దీనికి సంబంధించి పలు కీలకాంశాలను ప్రతిపాదిస్తోంది. ఇందులో భాగంగా రియల్‌టైమ్ పర్యవేక్షణ మరియు అంతర్జాతీయ ప్రమాణాలపై దృష్టి సారించింది. ఆధునిక విద్యుత్ గ్రిడ్‌లు పరస్పరం అనుసంధానించబడిన వ్యవస్థలపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. రియల్‌టైమ్ పర్యవేక్షణ, ఏకీకరణ మరియు అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు కట్టుబడి ఉండటం ద్వారా విద్యుత్ పంపిణీనికి అడ్డంకులు లేకుండా చూసుకోవాలని కోరుతున్నాయి. విద్యుత్ రంగం ఆధునీకరణకు సంబంధించి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సబ్‌స్టేషన్ ఫైర్‌వాల్‌ల కోసం ఒక ముఖ్యమైన టెండర్‌ను రద్దు చేసింది. ఈ నిర్ణయం సైబర్ సెక్యూరిటీ అప్‌గ్రేడ్‌ల అత్యవసర అవసరం గురించి వాటాదారులలో ఆందోళనలను రేకెత్తించింది. పార్లమెంటరీ విచారణల మధ్య, కొనసాగుతున్న చర్చలు భారతదేశ విద్యుత్ రంగానికి పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలకు దారితీస్తాయని భావిస్తోంది. గ్రిడ్ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడంతో, సైబర్ భద్రతా సంసిద్ధతను నిర్వహించడం దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళికలో కీలకమైన లక్ష్యంగా మిగిలిపోయింది. భారత దేశం తన పవర్ గ్రిడ్‌ను డిజిటలైజేషన్ (స్మార్ట్ మీటర్లు, పునరుత్పాదక శక్తి)తో ఆధునీకరిస్తు న్నందున, సైబర్ భద్రతపై దృష్టి తీవ్రమైంది. దీని ఫలితంగా కొత్త నిబంధనలు, అంకితమైన స్పందన టీమ్‌లు, పరిశోధనా కేంద్రాలు, సాంకేతిక నవీకరణలు (అధునాతన ఫైర్‌వాల్‌లు) అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ముప్పుల నుండి కీలకమైన మౌలిక లక్ష్యాలను రక్షించడానికి, క్లీన్ ఎనర్జీ లక్ష్యాలతో పాటు గ్రిడ్ స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. విద్యుత్ రంగానికి అంకితమైన కంప్యూటర్ సెక్యూరిటీ ఇన్సిడెంట్ రెస్పాన్స్ టీం, గ్రిడ్ సైబర్ భద్రత కోసం పరిశోధన మరియు అభివృద్ధిపై దృష్టి సారించేందుకు పవర్‌గ్రిడ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసింది. థర్మల్, హైడ్రో, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్, రెన్యూవబుల్స్, గ్రిడ్ కార్యకలాపాల కోసం ఆరు ప్రత్యేక టీమ్‌లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ముందస్తు ముప్పు గుర్తింపు, స్మార్ట్ మీటర్ డేటా విశ్లేషణ మరియు దొంగతనాలను నిరోధించడం, స్మార్ట్ గ్రిడ్‌లు, పునరుత్పాదకశక్తి, పరస్పరం అనుసంధానించబడిన వ్యవస్థల విస్తరణ పెంచుతుంది.

## మరణించిన ఉద్యోగికి ఎలక్షన్ విధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్14:** మృతి చెందిన ఉద్యోగికి ఎలక్షన్ డ్యూటీ వేసిన సంఘటన నిర్మల్ జిల్లా, కడెం మండలం, పెద్దూర్ తండాలో చోటు చేసుకుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వీలుగా పెద్దూరు తండాకు చెందిన హార్టికల్చర్ ఉద్యోగికి అధికారులు డ్యూటీ వేశారు. దీంతో పలువురు ఒక్కసారి షాక్‌కు గురయ్యారు.

గ్రామానికి చెందిన సదరు ఉద్యోగి మరణించాడని, కానీ అతనిక ఎలక్షన్ డ్యూటీ వేయడమేంటని పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు.

ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించే ఎన్నికల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావడం, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యమని ఎస్‌సి. ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకుడు రాజేశ్ నాయక్ విమర్శించారు.

ఇప్పటికైనా ఉద్యోగుల జాబితా పూర్తిగా తెలుసుకున్నాకే ఎన్నికల విధులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అంతరపంటలో వెనుకబడిన రాష్ట్రం

### వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** మిశ్రమ (అంతర) పంటల సాగులో రాష్ట్రం వెనుకంజలో ఉన్నట్లుగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధ్యయనంలో వెల్లడైంది. మిశ్రమ పంటల సాగులో తెలంగాణ దేశంలో 12వ స్థానంలో నిలిచింది. 2023-24 సంవత్సరానికి సంబంధించిన అధ్యయన రిపోర్ట్ వెల్లడించింది. ఒకే వ్యవసాయ క్షేత్రంలో ఏకకాలంలో రెండు, అంతకంటే ఎక్కువ పంటలను పండించే అంతర పంటల సాగు దేశంలో ఏటా విస్తరిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. దేశంలో అంతర పంటల సాగులో బంగాల్, పంజాబ్, గుజరాత్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల తర్వాత స్థానంలో తెలంగాణ నిలిచిందని నివేదిక పేర్కొంది. ప్రధాన పంటల మధ్య స్వల్పకాలిక పంటలను వేస్తున్నట్లుగా గుర్తించింది. కూరగాయలు, పండ్ల తోటల్లోనూ మిశ్రమ పంటలు సాగవుతున్నాయి. వరి పంట సాగు, ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, మిశ్రమ పంటల సాగులో పురోగమించడం లేదని గుర్తించింది. రైతులు ప్రధాన పంటలు పండించేందుకే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్లు పేర్కొంది. అంతర పంటలపై అంతగా ఆసక్తి లేకపోవడం, ప్రభుత్వపరంగా ఆశించినటువంటి స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం తదితర అంశాలు దీనికి కారణాలుగా తెలిపింది.

## ఎరువుల ఫ్యాక్టరీ కేంద్ర కార్యాలయాన్ని రాష్ట్రానికి తరలించాలి

### కేంద్రానికి స్టాండింగ్ కమిటీ లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) కేంద్ర కార్యాలయాన్ని నోయిడా నుంచి రాష్ట్రానికి తరలించాలని ఫెర్టిలైజర్స్ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి లేఖ రాసింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో వరుస సాంకేతిక అవరోధాలతో ప్లాంట్ తరచూ షట్ డౌన్ అవుతోంది. హల్దర్ టాప్స్ సమకూర్చిన హెచ్‌టీఆర్ టెక్నాలజీ వైఫల్యం చెందడంతో తరచూ షట్‌డౌన్‌లు కలుగడం, వాటిని సరి చేసే సమయంలో నిర్ణయాల జాప్యం వల్ల సరైన సమయంలో మరమ్మతులు పూర్తికాక ఉత్పత్తికి నష్టం ఏర్పడుతుంది. తద్వారా తెలంగాణ రైతాంగానికి యూరియా సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మరోపక్క దేశ వ్యాప్తంగా ఆర్ఎఫ్‌సీఎల్ సింగిల్ యూనిట్ ప్లాంట్‌గా ఉన్నా కేంద్ర కార్యాలయం నోయిడాలో ఉండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. క్లిష్టమైన సమయంలో సంస్థ సీఈఓ, డైరెక్టర్(ఫైనాన్స్), హెచ్‌ఆర్ డైరెక్టర్లు నోయిడాలో ఉండడం వల్ల నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందనే విమర్శలున్నాయి. ఆర్ఎఫ్‌సీఎల్ యేటా 12లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థంతో పని చేయాల్సి ఉంటుంది. అయితే తరచూ సాంకేతిక అవరోధాలతో ఎరువులు ప్రధానంగా యూరియా ఉత్పత్తికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## పేద పిల్లలు మట్టిలో మాణిక్యాలు సిఎం రేవంత్‌రెడ్డి

### మెస్సీతో ఫ్రెండ్లీ మ్యాచ్‌లో గురుకుల విద్యార్థులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్14:** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత్లో పర్యటిస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో శనివారం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మెస్సీ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి సందడి చేసిన విషయం తెలిసిందే. గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్సీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సింగరేణి ఆర్‌ఆర్9, అపర్ణ మెస్సీ జట్ల పేరుతో ఈ మ్యాచ్ జరిగింది. అయితే సింగరేణి ఆర్‌ఆర్9 టీమ్‌లో సీఎంతో పాటు పాల్గొన్న మిగితా ప్లేయర్స్.. సోషల్ వెల్ఫేర్ స్టూడెంట్స్ కావడం విశేషం. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర పోస్ట్ షేర్ చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న పేద పిల్లలు మట్టిలో మాణిక్యాలని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. అవకాశం కల్పిస్తే ఆకాశమే హద్దుగా రాణిస్తారు అన్నది నా ప్రగాఢ విశ్వాసం అని తెలిపారు. ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం మెస్సీతో ఫ్రెండ్లీ ఫైట్‌లో తలపడి, తెలంగాణ ప్రైడ్‌కు ప్రతీకలుగా నిలిచిన ఈ యువ సోదరులకు నా అభినందనలు అని పేర్కొన్నారు. భవిష్యత్లో ప్రపంచ క్రీడా వేదికలపై తెలంగాణ ఖ్యాతిని చాటిచెప్పే స్థాయికి మీరంతా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ట్వీట్‌లో పేర్కొన్నారు.

### నిర్మల్‌లో విషాదం..

## కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతి

**హైదరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లాలో విషాదం నెలకొంది, జిల్లాలోని కుబీర్ మండలం సిర్పల్లి తాండలో ఆదివారం ఉదయం ఎన్నికల ప్రచారం కోసం స్థానిక యువకులు టెంట్ వేస్తుంగా పైన వున్న కరెంటు తీగలకు టెంట్‌లోని ఇనుప రాడ్ తగిలింది. ఈ ఘటనలో నవీన్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. ఈ యువకుడిని ఆసుపత్రిలో చేర్పించారు. దీనిపై పోలీసులు విచారణ చేబట్టారు.

## అంబులెన్స్‌లో వచ్చి ఓటేసిన వ్యక్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్14:** తాను అనారోగ్యంతో బాధపడుతున్నా కూడా ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటిచెప్పేవిధంగా అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఒక వ్యక్తి ఓటు వేసి ఎందరికో ఆదర్శంగా నిలిచాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వలిగొండ మండల కేంద్రానికి చెందిన బత్తిని సత్యనారాయణ గౌడ్ వచ్చాడు. అయితే, ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నా కూడా ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటిచెప్పేలా అంబులెన్స్‌లో వచ్చి ఓటు వేశాడు. పలువురు వ్యక్తులు నేటి యువత అతనిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని హితవు పలికారు.

## మెస్సీ పర్యటన భద్రతపై డిజిపి సంతృప్తి

**హైదరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ హైదరాబాద్ పర్యటన వేళ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన భద్రతపై డిజిపి శివధర్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. మెస్సీ పాల్గొన్న కార్యక్రమాలకు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ పోలీసులు సమన్వయంగా వ్యవహరించి పటిష్ట భద్రత కల్పించారని డిజిపి తెలిపారు. ఇందుకు పోలీసులను, మెస్సీ వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఆయన అభినందించారు. అతిథుల కోసం చేబట్టిన భద్రత బాగుందని డిజిపి ఎక్స్‌లో ఆదివారం నాడు ట్విట్ చేశారు.

# ఐదుమ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత్ ఆధిక్యం

## మూడో మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో టీమిండియా విజయం, భారత్ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికాకు వణుకే..





**ధర్మశాల, డిసెంబరు 14:** ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. రెండో టి20లో ఘోరంగా ఓడిన భారత్‌జట్టు మూడో టి20తో ఫామ్‌లోకి వచ్చింది. ధర్మశాల వేదికగా ఆదివారం జరిగిన మూడో టి20లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 118 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు కేవలం 15.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అభిషేక్ శర్మ 18 బంతుల్లో 35; 3 ఫోర్లు, 3 సిక్సర్లు బాదేసి మరోసారి మెరుపులు మెరిపించాడు. తిలక్ వర్మ కూడా 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 3 ఫోర్లుసైతం సాధించి చివరి దాకా క్రీజులో ఉండి మ్యాచ్‌ను ముగించాడు. శుబ్‌మన్ గిల్ (28) టెస్టు బ్యాటింగ్ చూపించాడు. సూర్యకుమార్ యాదవ్ 12 పరుగులకే నిరాశ పరిచాడు. ఈ మ్యాచ్‌లో గెలవడంతో భారత జట్టు ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టి20 ఈనెల 17న జరగనుంది. స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు అభిషేక్ శర్మ అదిరిపోయ ఆరంభాన్ని ఇచ్చాడు. తొలి బంతినే సిక్సర్‌గా బాది దూకుడు మీద కనిపించాడు. క్రీజులో ఉన్నం తసేపు బౌండరీల వర్షం కురిపించాడు. 3 ఫోర్లు 3 సిక్సర్లతో అదరగొట్టాడు. మరో ఎండ్‌లో ఉన్న గిల్ మరో సారి డకౌట్ అయ్యేవాడు. అంపైర్ అవుటివ్వగా రివ్యూలో బంతి బ్యాట్‌కు తాకినట్లుగా తేలింది. దాంతో బతికిపోయాడు. అయితే చాలా సమయాల్లో బంతి అతడి బ్యాట్ ఎడ్జ్ తీసుకొని స్లిప్ లోకి వెళ్లింది. అయితే అక్కడ ఫీల్డర్ లేకపోవడంతో బతికిపోయాడు. తక్కువ లక్ష్యం ఉన్నా కూడా గిల్ ఆకట్టుకోలేకపోయాడు. క్రీజులో ఇబ్బంది పడుతూనే ఆడాడు. అయితే అభిషేక్ శర్మ మెరుపు ఆరంభం ఇవ్వడం ఆ తర్వాత తిలక్ వర్మ నిలబడటం తో భారత్ ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 117 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ 46 బంతుల్లో 61; 6ఫోర్లు, 2 సిక్సర్లు సాధించి ఒంటరి పోరాటం చేశాడు. డెనోవాన్ ఫెరీరా 20, నోకియా 11 మినహా మిగిలిన ప్లేయర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలకు తలా 2 వికెట్లు లభించాయి. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలకు చెరో వికెట్ లభించింది. తొలుత బ్యాటింగ్ కు దిగిన దక్షిణాఫ్రికాను అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు తమ పేస్ బౌలింగ్‌తో హడలెత్తించారు. ఫలితంగా పవర్ ప్లేలో సౌతాఫ్రికా పూర్తిగా తడబడింది. కేవలం 25 పరుగులు మాత్రమే చేసింది. 3 వికెట్లను కోల్పోయింది. గత మ్యాచ్‌లో 90 పరుగులు చేసిన క్వింటన్ డికాక్ ఈ మ్యాచ్‌లో ఒక్క పరుగు చేసి అవుటయ్యాడు. రీజా హెండ్రిక్స్ డకౌట్ అయ్యాడు. డివాల్డ్ బ్రేవిస్ 2, స్టబ్స్ 9, బాష్ 4 ఇలా వచ్చి అలా వెళ్లారు. కెప్టెన్ మార్క్‌రమ్ అర్ధ సెంచరీ చేయడంతో సౌతాఫ్రికా 100 పరుగులు చేయగలిగింది. లేదంటే 50లోపే ఆలౌట్ అయ్యి ఉండేది. భారత బౌలర్లు పిచ్ నుంచి దక్కిన సహకారాన్ని చక్కగా ఉపయోగించుకున్నారు.

## జిల్లాల వారీగా,పార్టీల వారీగా 2వ విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇలా ఉన్నాయి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్14:**

| జిల్లాలు | కాంగ్రెస్ | బిఆర్ఎస్ | బిజెపి | ఇతరులు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్(156) | 51 | 27 | 45 | 27 |
| కొత్తగూడెం(156) | 79 | 32 | – | 43 |
| హనుమకొండ(73) | 40 | 23 | 2 | 6 |
| జగిత్యాల(144) | 99 | 15 | 12 | 14 |
| భూపాలపల్లి(85) | 50 | 28 | 2 | 5 |
| జనగామ(79) | 30 | 38 | 4 | 5 |
| రాజన్న సిరిసిల్ల(88) | 38 | 28 | 5 | 17 |
| మహబూబాబాద్(158) | 108 | 35 | – | 14 |
| మహబూబ్‌నగర్(151) | 81 | 44 | 7 | 19 |
| మంచిర్యాల(114) | 77 | 25 | – | 4 |
| మెదక్(149) | 55 | 45 | 16 | 30 |
| ములుగు(52) | 32 | 14 | – | 4 |
| నాగర్‌కర్నూల్(151) | 79 | 54 | 5 | 9 |
| నల్లగొండ(282) | 172 | 65 | 1 | 36 |
| నారాయణపేట(95) | 49 | 21 | 13 | 12 |
| నిర్మల్(130) | 44 | 3 | 48 | 29 |
| నిజామాబాద్(196) | 104 | 29 | 15 | 42 |
| పెద్దపల్లి(73) | 45 | 14 | – | 14 |
| రంగారెడ్డి(178) | 74 | 65 | 15 | 24 |
| సంగారెడ్డి(243) | 138 | 80 | 3 | 17 |
| వనపర్తి(94) | 52 | 28 | 2 | 12 |
| సిద్దిపేట(182) | 28 | 107 | 13 | 34 |
| సూర్యపేట(181) | 104 | 44 | 2 | 28 |
| వికారాబాద్(175) | 89 | 36 | 4 | 46 |
| గద్వాల(74) | 40 | 22 | 2 | 10 |
| కామారెడ్డి(197) | 126 | 30 | 5 | 33 |
| కరీంనగర్(113) | 44 | 44 | 11 | 12 |
| ఖమ్మం(183) | 115 | 39 | – | 26 |
| ఆసిఫాబాద్(113) | 24 | 40 | 20 | 20 |
| వరంగల్(117 | 70 | 40 | 2 | 4 |
| భువనగిరి(150) | 70 | 59 | 2 | 18 |
| మొత్తం(4,331) | 2216 | 1177 | 269 | 619 |

# పండిన ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది

### ఎపి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

### తోట్లవల్లూరులో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ప్రారంభించిన మంత్రి




విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎక్కడ లేని విధంగా 24 గంటల్లో పైకం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం మంత్రి రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి జన్మదిన వేడుకలలో భాగంగా తొట్ల వల్లూరులో ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ తాను రైతు బిడ్డ అని, రైతుల కష్టాలు తెలుసని, రైతులకు మేలు చేయాలని ఉద్దేశంతోనే తాను కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించే ఏర్పాటు చేశామన్నారు. శనివారం జరిగిన సంఘటనను వివరిస్తూ మంత్రి కొంతమంది రైతులు రైస్ మిల్లర్ల నుండి తడిసిన ధాన్యం సంబంధించి నష్టపోతున్నట్లు తన దృష్టికి తీసుకొని వచ్చారన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడడం మాట్లాడటం జరిగిందన్నారు. తన సొంత ఊరు కారకంపాడు నుండి వస్తుంటే పక్క గ్రామం అయిన పెద్ద ముత్తేవి నుండి 3 లారీల ధాన్యం లోడ్ చేసుకుని వెళుతుంటే ఆ లారీలను ఆపి ఎక్కడి నుండి వస్తున్నాయి, ధాన్యం ఎంతకు కొనుగోలు చేశారు అని లారీ డ్రైవర్ను అందులోని వారిని అడిగితే తమకు తెలియదని తాము కేవలం రవాణాకు చెందిన వాళ్ళమని గుడివాడ రైల్వే షెడ్‌లో వ్యాగిన్స్‌లో లోడ్ చేసుకునేందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారన్నారు. ఎవరు కొన్నారు వారిని పిలిపించాలని పక్క గ్రామమే కదా అని వారిని అడిగితే ప్రక్క గ్రామం నుండి వారు వచ్చారన్నారు. నాతో మొదట 1550 అని ఆ తరువాత 1450 రూపాయలకు కొనుగోలు చేసినట్లు చెప్పార న్నారు. అంత తక్కువకు కొనుగోలు ఎలా చేశారని చేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించానన్నారు. వెంటనే గోనెసంచిలో నుండి ధాన్యాన్ని బయటకు తీసి తేమ శాతం పరీక్షి ంచే యంత్ర పరికరాన్ని తెప్పించి పరిశీలిం చగా 22శాతం తేమ ఉందన్నారు. అడిగితే ధాన్యం రంగు మారిందని చెప్పారు. అక్కడే ఒక బేరగాడు ఉంటే ధాన్యాన్ని అరచేతిలో వేసుకుని నూరితే లోపల బియ్యం ఎక్కడ రంగు మారలేదన్నారు. బియ్యం అంతా బాగానే ఉన్నా నూక రంగు మారితే మీకు వచ్చే నష్టమేంటని ప్రశ్నించామన్నారు. ఎవరు దీన్ని తక్కువ ధరకు కొనమని చెప్పారని అంటూ రైతు సేవా కేంద్రంలోని సాంకేతిక సిబ్బందిని పిలిపించామన్నారు. తేమ శాతం పరికరాన్ని అప్పటికప్పుడు తెప్పించామన్నారు. తేమశాతం పరిశీలిస్తే 22 శాతం ఉందని ధాన్యం బాగుందని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17కంటే ఎన్ని పాయింట్లు ఎక్కువ ఉంటే అన్ని కిలోల బియ్యం తగ్గించుకోవలసి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 5 కిలోల బియ్యానికి కిలో 24 రూపాయల చొప్పున 120 రూపాయలు తగ్గించాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రకారం 1450 రూపా యలు కొనుగోలు చేయడం ఏంటని మిల్లర్లతో మాట్లా డటం జరిగిందన్నారు. 1650 రూపాయలు చెల్లిస్తే గాని లారీలను వెళ్ళనివ్వమని గట్టిగా చెప్పడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం లాగా రైతులకు డబ్బులు ఎగ్గొట్టే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అనా పైసలతో సహా నిబంధనల ప్రకారం ప్రతి రైతు పండించిన పంటకు ధర చెల్లించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతులకు చెల్లిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. తాను పేదరికం నుంచి వచ్చానని తనకు రైతుల బాధలు తెలుసన్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగకూడదన్నది ప్రధాన ఉద్దేశం, ప్రతి రైతుకు మేలు జరగాలన్నదే తమ అభిమతం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.



## శ్రీవారి దివ్యప్రసాదములు పుస్తకాన్ని ఆవిష్కరించిన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, డిసెంబర్14:** శ్రీవారి దివ్యప్రసాదములు పుస్తకాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారంనాడు ఆవిష్కరించారు, హైదరాబాద్‌క్యాంప్ కార్యాలయంలో చైర్మన్‌ను రచయిత, శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షి తులు సహా రచయిత కోటా నీలమ కలిశారు. శ్రీవారి ప్రసాదాల ప్రాశస్త్యాన్ని ఈ పుస్తకంలో వివరించారు. శ్రీ అష్టోత్తరశత చుక్కల ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పుస్తకాన్ని ముద్రించిన రాజ మండ్రి గొల్లపూడి వీరాస్వామి సన్ పబ్లిషర్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించారు. శ్రీవారికి వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే కైంకర్యాల్లో నివేదించే అన్నప్రసదాలు, పన్యారాలు గురించి పూర్తి వివరాలను పుస్తకంలో పొందుపరచారు. భక్తులు శ్రీవారి ప్రసాదాల విశిష్టతను తెలుసు కొని వారివారి గృహాల్లో , ఆలయాల్లో, ఉత్స వాల్లో సులభంగా శ్రీవారి ప్రసాదాలు తయారుచేసు కునేలా సమాచారం ఇందులో ఉంది. ప్రసాదాలు తయారీ విధానం, నివేదిన పద్ధతి...ప్రసాదాల్లో వినియోగించే దినుసులు, ఆరోగ్య రహస్యాలు, ప్రాచీన కాలం నుండి నేటి వరకు శ్రీవారి ప్రసాదాలకు సంభందించి శిలాశాసనాల్లోని సమగ్ర



# టన్నుమట్టి తవ్వితీస్తే... 2 గ్రాముల పసిడి చేతిలోకి!

- కర్నూలు జిల్లా జొన్నగిరిలో జోరుగా తవ్వకాలు
- 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తింపు

కర్నూలు, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: కర్నూలు జిల్లాలో బంగారం వెలికి తీసే పనులు చురుకుగా సాగుతున్నాయి. తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో బంగారం మెరుపుతో ధగ ధగ మెరిసిపోతున్నది. జిల్లాలోని పగిడిరాయి, జొన్నగిరి ప్రాంతాల మధ్య బంగారు నిక్షేపాలు ఉన్నాయనే అనుమానంతో.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పసిడి కోసం పరిశోధనలు జరిగాయి. ఆఖరికి కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నిర్ధారించింది. దీంతో జొన్నగిరి పగిడిరాయి గ్రామాల పరిసర ప్రాంతాల్లో సుమారు 1,477.24 ఎకరాల్లో తవ్వకాలు జరిపేందుకు జియో మైసూర్ అనే కంపెనీ ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. తవ్వకాలు కూడా ప్రారంభించింది. ఈ ప్రాంతంలో టన్ను మట్టిని తవ్వి తీస్తే.. 1.5 గ్రాముల2 గ్రాముల వరకు పసిడి ఉత్పత్తి అవుతుంది. అయితే టన్ను మట్టి నుంచి ఈ రెండు గ్రాముల బంగారం వెలికి తీసేందుకు గాను.. సుమారు 5 వేల వరకు ఖర్చవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇలా వెయ్యి టన్నుల మట్టికి సుమారు 700 గ్రాముల బంగారం వెలికి తీయడం సాధ్యం అవుతుందని ఇక్కడ తవ్వకాలు జరుపుతోన్న సంస్థ యాజమాన్యం చెబుతోంది. జియో మైసూర్ సంస్థ రానున్న పది సంవత్సరాల కాలంలో ఈ ప్రాంతంలో సుమారు 6 వేల టన్నుల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ప్రతి రోజు 1000 టన్నుల ఖనిజాన్ని శుద్ధి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కోటి టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నట్లు జియో మైసూర్ సంస్థ అంచనా వేస్తోంది. ముఖ్యంగా తూర్పు బ్లాక్‌లో భూమి అడుగున 180 మీటర్ల లోతులో.. 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం 4 లక్షల టన్నుల ఖనిజాన్ని వెలికితీసి దీనిలో సుమారు 3 లక్షల టన్నులను శుద్ధి చేయాలని మైనింగ్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం కంపెనీ నిర్వాహకులు అధునాతన యంత్రాలను తెప్పించుకుని పనులు చేపడుతున్నారు.

# విద్యుత్ చార్జీల భారం తగ్గనుంది

### ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ, డిసెంబరు 14 ప్రభాత వార్త ప్రతినిధి:** సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ వినియోగ దారులకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితం గా, బీసీలకు ప్రత్యేక రాయితీ లను ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇస్తోందని గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. దీనివల్ల పేదలకు విద్యుత్ చార్జీల భారం గణనీయంగా తగ్గనుందని అన్నారు.విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఆచరణలో సాధ్యమవు తోందని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మాజీ సీఎం జగన్ పెంచిన ట్రూ అప్ చార్జీలను ట్రూ డౌన్ చేసే దిశగా ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను ఆదాయ వనరుగా మాత్రమే చూసిందని గొట్టిపాటి అన్నారు. విద్యుత్ రంగంపై చంద్రబాబుకు ఉన్న అపార అనుభవం తో విద్యుత్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆదాయం సమకూరుస్తున్నారని తెలిపారు. 18 నెలల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి అనతికాలంలోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టామని వివరించారు. పీఎం సూర్యఘర్, కుసుమ్, బ్యాటరీ స్టోరేజ్ విధానం, డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి పెంచుతూ తీసుకొచ్చిన సంస్కరణలతో చార్జీలు తగ్గించగలుగుతున్నామని పేర్కొన్నారు.





## కల్తీనెయ్యి కేసులో రేపు సుప్రీంకు 'సిట్'!?

### టిటిడి మాజీ అధికారులకు విచారణ తాఖీదులు

తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూల తయారీకి 2020–24 మధ్య కాలంలో కల్తీనెయ్యి సరఫరా కేసులో ఇప్పటి వరకు సేకరించిన సమాచారాన్ని సిట్ సుప్రీంకోర్టుకు అందజేయనుందనేది తెలుస్తోంది. మంగళవారం టిటిడి బోర్డు సమావేశం జరగనున్న నేపథ్యంలో టిటిడిలో మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగాలకు చెందిన కొందరు మాజీ అధికారులను సిట్ విచారణకు రమ్మని తాఖీదులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కల్తీనెయ్యి కేసులో 16న కొంత సమాచారంతో సుప్రీం న్యాయస్థానంకు వెళితే తదుపరి ఎలాంటి ఆదేశాలు వెలువ డతాయనేది తెలియాలి. 2020 ఆగస్టులోనే తిరుమ లకు కల్తీనెయ్యి సరఫరా అవుతోందని అప్పట్లోనే గుర్తించిన టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగం అధికారులు బోర్డుకు తెలిపినా అప్పటి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పెద్దగా పట్టించుకోలేదనేది సిట్ కస్టడీ లోని మాజీ జిఎం సుబ్రమణ్యం వాంగ్మూలం. ఇంకా పలు సంచలన విషయాలు సిట్ అధికారు లకు సుబ్రమణ్యం తెలియజేయడంతో ఇప్పుడు టిటిడి వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే కల్తీనెయ్యి కేసులో భాగస్వాములైన గత అధికారులు 12మందిని గుర్తించిన సిట్ వారిని విచారణకు పిలిచేందుకు టిటిడి ఇఒకు లేఖ రాయడం, దానిపై 16న ఆదేశాలు వెలువడ నున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాతే ఆ 12మందిని విచారణకు పిలిచే అవకాశం కనిపిస్తోంది. వీరిలో ముగ్గురు అధికారులు ఇప్పటికే పదవీవిరమణ చేశారు. ఉద్యోగులను విచారణకు ఇఒ అనుమతి అసవరం. నాగేంద్రప్రసాద్, శేఖర్, ఈశ్వర్‌రెడ్డి, వెంకట అనిల్‌కుమార్, వెంకట నగేశ్‌బాబు, జగదీశ్వర్ రెడ్డి, సుబ్రమణ్యం, మురళీకృష్ణ, గోశాల మాజీ డైరెక్టర్ (సస్పెన్షన్ వేటుకు గురైన) డాక్టర్ హరినాథ రెడ్డి కల్తీనెయ్యిలో కీలకమనేది సిట్ కథనం. కీలకమైన ఐదుగురు టిటిడి ఉద్యోగులను విచారణ చేస్తే నెలకొన్న చిక్కుముడి వీడి పోతుందనేది వినిపిస్తున్న వ్యాఖ్యలు.

## 30నుండి జనవరి 8వరకు విఐపి దర్శనాలు బ్రేక్

**తిరుమల, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ప్రత్యేక పర్వదినాలు పురస్కరించుకుని ఆయా రోజుల్లో టిటిడి విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసింది. అంతేగాక ఆ రోజులకు ముందురోజులు ఎటువంటి సిఫార్సులేఖలు కూడా స్వీకరించరని తెలిపింది. ఈనెల 23వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 29న వైకుంఠ ఏకదశి ముందురోజు, 30వ తేదీ నుండి జనవరి 8 వరకు వైకుంఠద్వార దర్శనాలు సందర్భంగా పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసింది. ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తే వారికి దర్శనం కల్పిస్తుంది. జనవరి 25వతేదీ రథసప్తమి పర్వదినాన కూడా విఐపి బ్రేక్ రద్దుచేసింది. ఈ సందర్భాలు భక్తులు గమనించి టిటిడికి సహకరించాలని కోరింది.

# అందరి చూపు రవికుమార్ ఆస్తులపైనే!

- నేటి నుండి సిఐడి, ఎసిబి దర్యాప్తు షురూ
- ఐటి, ఇడి సైతం రంగంలోకి






తిరుమల, డిసెంబర్ 14 ప్రభాతవార్త ప్రతినిధి: చిరు ఉద్యోగి... ఆపై పరకామణిలో లక్షల్లో చోరీ... ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే అనుమానాలపై హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో నిందితుడు రవికుమార్ ఆస్తుల లెక్కలు తేల్చేపనిలో సిఐడి, ఎసిబి అధికారులు రంగంలోకి దిగుతున్నారు. వీళ్ళు సేకరించిన సమాచారాన్ని ఆదాయపు పన్నుశాఖ (ఐటి), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి అందజేయాలని వెలువడించిన ఆదేశాల వెనుక పెద్దకుట్ర ఉందనేది న్యాయస్థానం కూడా అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. క్షుణ్ణంగా నిందితుడు ఆస్తులు ఎలా సంపాదించాడు, ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని ఎవరెవరికి విక్రయించాడు, ఇంకా ఏ మేరకు ఆస్తులు ఉన్నాయనే వివరాలు సేకరణలో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ బృందం, ఎసిబి చీఫ్ బృందం కార్యాచరణ రూపొందించుకుని సిద్ధమైంది. ఇప్పటికే ఈ తతంగంలో నిందితుడికి సంబంధించి తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నంలో భారీగా ఆస్తులు ఉన్నట్లు తగిన ఆధారాలు సేకరించి హైకోర్టు ధర్మాసనానికి సమర్పించింది. ఇంకా ఆ ఆస్తుల క్రయవిక్రయాల డాక్యుమెంట్లను, రికార్డులను సిఐడి రాబట్టిందనేది కీలక సమాచారం. ఇప్పుడు వీటన్నిటిపై నిశితంగా దర్యాప్తు చేసి తదుపరి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు ఐటి, ఇడిలకు సమాచారం ఇస్తే ఆ తరువాత ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది టిటిడిలో, రాజకీయవర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. 2023 ఏప్రిల్ 29న తిరుమల పరకామణిలో గుమస్తా సివి రవికుమార్ 920 అమెరికన్ డాలర్లు చోరీ చేయడం, తిరుమల పోలీసులు కేసు నమోదు చేయడం, తదుపరి విచారణ చేసినా చట్టపరంగా చర్యలు తీసుకోలేదని, లోక్‌అదాలత్ ద్వారా కేసు రాజీ చేసుకోవడం వరకు అంతా సంచలనంగా మారింది. ఈ కేసులో ఇంకా మరింత లోతుగా దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశించడంతో సిఐడి, ఎసిబితో బాటు ఐటి, ఇడి శాఖల అధికారులు ఇక రంగంలోకి దిగుతున్నారు. 2023 జూన్‌లోనే అప్పటి టిటిడి బోర్డు పెద్దలు రూ.14.43 కోట్ల విలువైన ఆస్తులను 7 గిఫ్ట్ డీడ్‌లుగా శ్రీవేంకటేశ్వరస్వామికి స్వీకరించడం జరిగింది. వాటి విలువ మార్కెట్లో రూ.40 కోట్లు చేస్తుందని సిఐడి అంచనా. చోరీ సొత్తు విలువ లక్షల్లో ఉంటే శ్రీవారికి కానుకగా రూ.14 కోట్ల ఆస్తులు ఎందుకు స్వీకరించారనేది హైకోర్టు అనుమానాలు. ఈ వారంలో అనుమానాలు పటాపంచలు కానున్నాయనే చర్చమొదలైంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసిపి ప్రభుత్వ హయాంలోని టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డిని, భూమన కరుణాకర్‌రెడ్డిని, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డితోబాటు మాజీ సివిఎస్ఒ నరసింహా కిశోర్, మాజీ విజిఒ గిరిధర్, ఏవిఎస్ఒ పద్మనాభంను, అప్పటి తిరుమల సిఐలు జగన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డిలను పరకామణి విధుల్లో ఉన్న టిటిడి అధికారులను వరుసగా 35మందిని పలు దఫాలుగా విచారణ చేసి వాంగ్మూలాలు రాబట్టిన విషయం తెలిసిందే.

## కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: పారిశ్రామిక పాలసీలో భాగంగా అనేక సంస్థలకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ, పర్యాటక శాఖలు సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేశాయి. కొత్త పాలసీలోని ఎర్లీ బర్డ్ పథకం కింద కొన్ని సంస్థలకు పెట్టుబడి రాయితీలు ప్రకటించగా, మరికొన్ని సంస్థలకు ఉన్న రాయితీలను కొనసాగించాలని నిర్ణయించారు. మరికొన్ని సంస్థలకు భూ కేటాయింపులు కూడా చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధానంగా బాపట్ల జిల్లాలోని వలపర్లలో జెన్‌ఐటీ సంస్థ రూ.198 కోట్లు పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాన్ని కొ నసాగించాలని, కర్నూలు జిల్లాలోని గొండివర్ల పారిశ్రామిక వాడలో టీజీవి స్రాక్ లిమిటెడ్ రూ.1,216 కోట్ల ప్రాజెక్టుకు కూడా ప్రోత్సాహకాల కొనసాగింపునకు ఉత్తర్వులు ఇచ్చారు. కృష్ణా జిల్లాలోని మురవరంలో వెంకటేశ్వర బయోటెక్ లిమిటెడ్‌కు 30శాతంతో పెట్టుబడి రాయితీగా 25.8 కోట్లు కేటాయించారు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఫోటో వాల్టాం ఇండియా లిమిటెడ్‌కు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని, ఏలూరు జిల్లాలోని రుచమ్మగూడ్ గ్లోబల్ ఫుడ్ పార్కు 20 శాతం పెట్టుబడి రాయితీగా రూ.30.5 కోట్లు ఇవ్వాలని, రేణిగుంటలో రూ.305 కోట్ల పెట్టుబడితో ఉన్న మల్లాడి డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌కు ప్రోత్సాహకాలు కొనసాగించాలని నిర్ణయించారు. గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ ప్రోత్సాహకాలు కొనసాగింపు, ఎమర్జ్ గ్రీన్ ఇండస్ట్రీస్‌కు రూ.39 కోట్ల పెట్టుబడి రాయితీ కల్పిస్తూ పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పర్యాటక రంగంలో కూడా తిరుపతిలో నాలుగు నక్షత్రాల నాంది హోటల్స్, బాపట్ల జిల్లాలోని పాండురంగాపురం బీచ్‌లో యాగంటి ఎస్టేట్స్‌కు ప్రోత్సాహకాలు అందించేందుకు పర్యాటకశాఖ నిర్ణయించింది. అలాగే విశాఖలోని ఎండాడలో వివి ఆర్ హాస్పిటాలిటీస్ ద్వారా ఫైవ్ స్టార్ హోటల్‌కు భూమితోపాటు ప్రోత్సాహకాలు అందించేందుకు, మధురవాడలో మెగన్ లీసర్స్ ద్వారా ఐదు నక్షత్రాల హోటల్, మెగా కన్వెన్షన్ సెంటర్‌కు ప్రోత్సాహకాలను, తిరుపతిలో ఒబరాయ్ హోటల్ అభివృద్ధికి 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

## బొత్స చెప్పేవన్నీ అబద్ధాలు

### - టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర అప్పులపై శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అసత్యాలు చెబుతున్నారని టిడిపి రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌రావు విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేయడంతో పాటు రూ.1.40 లక్షల కోట్లు బకాయిలు పెట్టిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిల్లో ఇప్పటికే రూ.40 వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం తీర్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.10 వేల కోట్లు మ్యాచింగ్ నిధులు గత ప్రభుత్వం చెల్లించలేదని, ఈ నిధుల్ని చెల్లించి కేంద్ర పథకాలు పునరుద్ధరించామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.12 వేల కోట్లు చెల్లించామని వివరించారు. జగన్ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వమే సంక్షేమంపై ఖర్చు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి తమ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తోందన్నారు. జగన్ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పు చేసినా అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అప్పులకు వడ్డీ కట్టడానికి, బకాయిలు తీర్చడానికే అధిక శాతం అప్పులు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందడం చూసి ఓర్వలేక, జగన్ చేసిన అప్పుల్ని కప్పి పెట్టుకోవడానికే నేటి అప్పులపై జగన్ అసత్యాలు ప్రచారం చేస్తోందని పల్లా శ్రీనివాస్‌రావు ఆరోపించారు.

## కోడి గుడ్ల ధరలకు రెక్కలు

### - 100 గుడ్లు రూ.690లు



విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో రోజు రోజుకూ కోడి గుడ్ల ధరలు సామాన్యులకు అందనంతగా ఆకాశంలోని దూసుకెళ్తున్నాయి. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయించిన రేట్ల ప్రకారం ఇవాళ విజయవాడలో 100 గుడ్ల ధర అత్యధికంగా రూ.690గా ఉంది. అంటే ఒక్కో గుడ్డు రూ.6.90లుగా ఉంది. రిటైల్‌లోకి వచ్చే సరికి రూ.7 నుంచి రూ.8.50 వరకు ఉంది.ఇది కుడా సాధారణ మార్కెట్‌ల్లో లభిస్తున్న ధర. ఇక కార్పోరేట్ మాల్స్‌లో ఒక్కో గుడ్డు రూ.10 అమ్ముతుంది. ఉమ్మడి గోదావరి జిల్లాలో అనపర్తి, తణుకులో 100 గుడ్లు ధర రూ.665, విజయనగరం, శ్రీకాకుళంలో100 గుడ్లు ధరరూ.664, చిత్తూరులో 100 గుడ్లు రూ.663, విశాఖలో 100 గుడ్లు రూ.660 పలుకుతోంది. రిటైల్లో 810 రూపాయలకి అమ్ముతున్నారు. 4 నెలల కిందట ఈ రేటు రూ.5.50గా ఉండేది. గుడ్ల ఉత్పత్తి తగ్గడంతోనే రేట్లు అధికమయ్యాయని వ్యాపారులు చెబుతున్నారు.

## పిన్నెల్లి సోదరులకు పరామర్శలా!

### టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: మున్సిపల్ చైర్మన్ పదవి కోసం వేలంపాట పెట్టి, దాడులు మరియు హత్యలకు పాల్పడిన దుర్మార్గులు పిన్నెల్లి సోదరులు అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తీవ్రంగా విమర్శించారు. వారికి నాయకత్వం వహించిన వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అని, వీళ్ళంతా కలిసి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. విజయవాడలో టీడీపీ నేత బుద్ధా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను అరెస్టు చేస్తే, దానిని తప్పు, అన్యాయం అని మాజీ సీఎం జగన్ మాట్లాడడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో టీడీపీ మద్దతుదారులను చంపేయాలని లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తులు పిన్నెల్లి బ్రదర్స్ అని, ఒక కులాన్ని టార్గెట్ చేసుకుని బూతులు మాట్లాడిన చరిత్ర వారిదని మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సామాజికవర్గం పైనా దుర్మార్గాలకు తెగబడ్డారని, తమపై దాడులు చేసిన ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని తెలిపారు. జై వైసీపీ అనలేదని పీక కోసి చంపిన ఘటనలు ఉన్నాయని, చనిపోవడానికి సిద్ధమైన చంద్రయ్య ఖిజై టీడీపీఖి అని ప్రాణాలు విడిచారని, అది తమ బడుగు బలహీన వర్గాలకు టీడీపీపై ఉన్న కమిట్‌మెంట్ అని స్పష్టం చేశారు.

## ఆ క్రికెటర్లకు భరోసా ఇచ్చి... పవన్ చేసి చూపించారు!



### దీపిక, కరుణకుమారి ఇళ్లకు గృహోపకరణాలు అందజేత

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: అంధుల మహిళా ప్రపంచ క్రికెట్ కప్ గెలిచిన జట్టు సభ్యులు దీపిక, కరుణకుమారి ఇళ్లకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గృహోపకరణాలు పంపించారు. ఆ క్రికెట్ జట్టుతో ఇటీవల పవన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు ఆయన దృష్టికి వచ్చాయి. దీంతో ఆ ఇద్దరు మహిళా క్రికెటర్లకు తక్షణమే గృహోపకరణాలు పంపాలని పవన్ నిర్ణయించారు. ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకుల ద్వారా వీటిని అక్కడికి చేరవేయించారు. "ఎక్స్" వేదికగా ఈ విషయాన్ని డీ సీఎం కార్యాలయం వెల్లడించింది. శ్రీ సత్యసాయి జిల్లా తంబలహట్టి తండాలో జట్టు కెప్టెన్ దీపిక కుటుంబానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా వంట్లమామిడిలో కరుణ కుమారి కుటుంబానికి వంట సామాగ్రి, టీవీ, టేబుల్ ఫ్యాను, మిక్సర్ గ్రైండర్, కుర్చీలు, చాపలు, స్టీల్ ప్లేట్లు, ప్రెషర్ కుక్కర్లు, ఎల్ఈడీ బల్బులు, ఇస్త్రీ పెట్టె, పాత్రలు, దుప్పట్లు, దిండులు, కుటుంబం మొత్తానికి వాళ్ల ఇళ్లకు ఇవి చేరుకున్నాయి. హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టీసీ.వరుణ్, జనసేన నాయకుడు పొదిలి బాబూరావు తదితరులు తంబలహట్టి తండాకు వెళ్లి ఈ వస్తు సామాగ్రిని దీపిక కుటుంబానికి అందించారు. నూతన ఏపీ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, జనసేన నేత వన్నెంరెడ్డి సతీష్‌రెడ్డి తదితరులు కరుణకుమారి ఇంటికి వెళ్లి వస్తువులను అందజేశారు. ఇద్దరు తెలుగు క్రికెటర్లకు క్రీడా కారుల కోటా కింద కొత్త గృహాలు నిర్మించి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. కొత్త ఇళ్లు నిర్మించిన తర్వాత వాటికి తగిన విధంగా ఇతర అవసరమైన గృహోపకరణాలు సమకూర్చాలని నిర్ణయించారు.

## బహు క్రీడా దేశంగా భారత్

### అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలింగం

### తిరుపతి ఐఐటిలో 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్



శ్రీకాళహస్తి, డిసెంబరు 14 ప్రభాతవార్త: ప్రపంచ దేశాల్లో భారత దేశం బహుక్రీడా దేశంగా అభివృద్ధి చెందుతుందని ఒలింపియన్, అర్జున్ అవార్డు గ్రహీత సతీష్ శివలంగం అన్నారు. ఆదివారం తిరుపతి ఐఐటి అవరణలో తిరుపతి, మద్రాస్, హైదరాబాద్‌లు కలసి 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఇది సంస్థ అభివృద్ధికి సాంకేతం అన్నారు. ఈ సందర్భంగా అతిథి శివలింగం మాట్లాడుతూ 'ఖేలో ఇండియా' తాజా జాతీయ క్రీడా విధానాలుయువతకు దేశవ్యాప్తంగా ఉన్న అవకాశాలను దిశ దెశ నిర్దేశం చేస్తుందని వివరించారు. తిరుపతి ఐఐటిలోనూ ఇతర భాగస్వామ్య ఐఐటిలలో అభివృద్ధి చెందుతున్న ప్రపంచస్థాయి క్రీడా సదుపాయాలు భవిష్యత్ ఛాంపియన్లను తయారు చేయటంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని అభినందించారు. భారత క్రీడల భవిష్యత్తు స్పోర్ట్స్ సైన్స్, డేటా అనలిటిక్స్ మరియు టెక్నాలజీ ఆధారంగా ముందుకు సాగుతుందని చెబుతూ ఐఐటి విద్యార్థులు కేవలం ఆటగాళ్ళుగా కాకుండా ఆవిష్కర్తలు, ఇంజనీర్లు, వ్యాపారవవేత్తలుగా క్రీడా రంగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వేదికలు స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, హై-పర్ పార్మెన్స్ స్పోర్ట్స్ వాటి అనుబంధ రంగాల్లో మార్గలను తెరిస్తా యని అన్నారు. క్రమశిక్షణ జట్టు స్ఫూర్తి, సహనాన్ని జీవితంలో కొనసాగించాలని శివలింగం ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన 58వ ఇంటర్ ఐఐటి స్పోర్ట్స్ మీట్‌ను 2025కు అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా బెలూన్లను ఆకాశంలోకి వదిలిపెట్టారు. తిరుపతి ఐఐటిలో శ్రీకారం చుట్టిన స్పోర్ట్స్ మీట్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో సంప్రదాయ కళలకు పెద్దపీట వేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గ్రామాల్లో సాధన చేసే కర్రసాము, ఇతర నృత్య ప్రదర్శనలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చదరంగం, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీకారం చుట్టారు.



## భవాని దీక్ష విరమణ సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

విజయవాడ, డిసెంబరు 14 ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న భవాని దీక్షల విరమణ సేవలలో 100 మంది జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు( ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మేరిస్టెల్లా కళాశాల, విజయ ఇన్స్టిట్యూట్ టెక్నాలజీ ఫర్ ఉమెన్) నుంచి భవాని దీక్షల విరమణకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం వారు ఏర్పాటుచేసిన సదుపాయాల మీద అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. దేవస్థానం అధికారుల పిలుపుమేరకు కృష్ణా యూనివర్సిటీ ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 11 నుంచి 15 వరకు దేవస్థానం వారు అందిస్తున్న సేవల మీద అభిప్రాయ సేకరణ నిర్వహించమని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కోరారు అందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భక్తులు నుంచి దేవస్థానం వారు కల్పించిన సదుపాయాల పైన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వాలంటీర్లు తెలిపారు.



## మంత్రాలయమంతా భక్తజనం

### అశేష భక్తుల నడుమ శ్రీ రాఘవేంద్రులు పల్లకి ఉత్సవం

మంత్రాలయంటౌన్, డిసెంబరు 14 ప్రభాతవార్త; పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై నిత్యం వివిధ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేస్తుంటారు. అందులో భాగంగానే ఆదివారం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై లక్షలాదిమంది వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేశారు. అయితే శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు శ్రీ మఠం అధికారులు,శ్రీ మఠం పీఠాధిపతులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిత్య అన్నదానం నిర్వహించారు. అంతే కాకుండా స్వామివారి దర్శనార్థమై విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండగా స్వామివారి దర్శనం ఏర్పాటు గావించారు.ఇదిలా ఉండగా భక్తులు పవిత్ర తుంగభద్ర నదిలో స్నానలాచరించి లక్షలాది సంఖ్యలు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ మఠం ధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం అశేష భక్తుల నడుమ, ఉదయం నుండి శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అష్టోదకం, సుప్రభాత సేవలతో మొదలై, వేద పండితులు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు మూల బృందావనానికి నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి ఉత్సవం, స్వర్ణ రథోత్సవం నవరత్న రత్నోత్సవం, గజవాహన ఉత్సవం, శ్రీ మఠం పీఠాధిపతుల శ్రీ మూల రాముల ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భక్తులను అశేషంగా అలరించాయి, అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు భక్తులకు ఫలమంత్రాక్షతలిచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, శ్రీ మఠం మేనేజర్లు, శ్రీనివాస చారి, వెంకట్ జోషి, ఐపి నరసింహమూర్తి, శ్రీపతి, వ్యాసరాజ చారి, అనంత స్వామి, తంబి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి భక్తులతో కిటకిట



శ్రీకాళహస్తి, డిసెంబరు 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి ఆలయంలో ఇసుకేస్తే రాలనంత రద్దీ చోటు చేసుకుంది. వేకువ జాము నుంచే ఆలయంలో భక్తులు శివనామ స్మరణ చేస్తూ పునీతం చేసారు. ఆలయాధికారులు సమాచారం మేరకు పాతిక వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు అభిషేకాలు 56 మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 27 జరిగాయి. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5వేలు జరిగినట్లు వివరించారు. ఇక సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్లు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శనానికి వెళ్ళే భక్తులు అతిథులు సుమారు 6వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. ఇక ప్రసాదాలు సుమారు పాతికవేలు అమ్ముడుపోయినట్లు వివరించారు. ఓ వైపు చలి వణిస్తున్నా భక్తులు ఖాతరు చేయక ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



## వదలని గజరాజులు

### లక్షలాది రూపాయల పంట నష్టం

కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబర్ 14 ప్రభాతవార్త: పార్వతీపురం మన్యం జిల్లాలో గజరాజుల వల్ల లక్షల రూపాయలు వంట నష్టం వాటిల్లినట్లు రైతులు అంటున్నారు. గత కొన్నేళ్లుగా కురుపాం నియోజవర్గంలో కురుపాం, కొమరాడ, జిఎం వలస, గరుగుబిల్లి మండలాల్లో ఏనుగులు తిరుగుతూ చేతికందే పంటలు నాశనం చేస్తూ రైతులకు లక్షల రూపాయలు నష్టము వాటిల్లే విధంగా చేస్తున్నాయి. ఆదివారం కురుపాం మండలం సీతంపేట గ్రామంలో చేతికందే పంటలు కోకో, కర్బుజ మొక్కలు, మోటర్ పైపులు ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి. సుమారు 100 టన్నుల చెరుకు పంటను గజరాజులు నాశనం చేశాయి. సుమారు 3 లక్షల వరకు పంటనష్టం జరిగిందని రైతు చిన్నారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల తరలింపుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## భారత్... ప్రగతి పథంలో దూసుకెళ్తోంది

### ● ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ● తిరుపతిలో అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ, ఆయన జీవితం, ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు భారత దేశానికి ఎప్పటికీ మార్గదర్శకమని ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు. ఆదివారం రేణిగుంట హైవేలోని మర్రిగుంట కూడలి నందు నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ విష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, శ్రీకాళహస్తి శాసనభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎం.పి వరప్రసాద్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ కలియుగ దైవం సుఖసంతోషాలు, శాంతి, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని" తెలిపారు. యమునా, గంగా పవిత్ర నదులు ప్రవహించే దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్ నుంచి వచ్చిన తనకు ఈ శుభ కార్యంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అద్భుతమైన వాక్చాతుర్యం, గంభీరమైన ఆలోచనాశక్తి, విశాల హృదయం కలిగిన నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని పేర్కొన్నారు. "పదవుల కంటే ప్రజలే ముఖ్యమని నమ్మిన నాయకుడు వాజ్‌పేయి. అధికారం కన్నా మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన మహనీయుడు" అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళమెత్తి, జీవితాంతం దేశ సేవకే అంకితమై పనిచేశారని గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేకి ఎవరూ శత్రువులు లేరని, అందుకే ఆయనను అజాతశత్రువుగా దేశం మొత్తం గౌరవించిందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థి దశ నుంచే వాజ్‌పేయి గారి మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించిందని, లక్నో పార్లమెంట్ నియోజకవర్గంలో విద్యార్థి నాయకుడిగా ఆయన ఎన్నికల సమయంలో పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. దేశాభివృద్ధికి బలమైన పునాది వేసిన నాయకుడు వాజ్‌పేయి అని పేర్కొంటూ, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన ద్వారా గ్రామాలకు రహదారులు, స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్ట్ ద్వారా దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం, టెలికాం విప్లవానికి శ్రీకారం చుట్టిన ఘనత ఆయనదేనని అన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని పూర్తి కాలం విజయవంతంగా నడిపిన తొలి ప్రధాని కూడా అటల్ బిహారీ వాజ్‌పేయి అని తెలిపారు. అభివృద్ధి, సుపరిపాలన, పారదర్శకతను ప్రాతిపదికగా తీసుకుని పాలన అందించిన ఆయన, సమాజంలో అట్టడుగున ఉన్న వర్గాల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. వాజ్‌పేయి ఆశయాల నుంచి స్ఫూర్తి పొందిన నేటి ప్రధాని నరేంద్ర మోదీ కూడా సేవ, సుపరిపాలన, అభివృద్ధి లక్ష్యంగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. లోకల్ ఫర్ లోకల్, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి వినూత్న కార్యక్రమాలతో భారత్‌ను స్వయం సమృద్ధ, ఆత్మనిర్భర దేశంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. డిసెంబర్ 25న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోదీ సహకారంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. డబుల్ ఇంజన్ సర్కార్ కారణంగా అభివృద్ధి అత్యంత వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షులు చామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్... నో పెట్రోల్

### తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పోలీసులు భద్రతపై ఫోకస్!



తిరుపతి, డిసెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి ,చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా రోడ్డు భద్రతపై పోలీసులు ప్రత్యేక ఫోకస్‌చేశారు. ఇప్పటి వరకు అటూఇటూ ఉదారతతో వ్యవహరించిన పోలీసులు ఇప్పుడు కొరఢా ఝుళిపించనున్నారు. ఈ రెండు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించకుంటే నేటి నుండి పెట్రోల్ పట్టరని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు స్పష్టం చేశారు. ఆదివారం హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ తిరుపతిలో చేపట్టారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో సుమారు 45 మరణాలు ద్విచక్ర వాహనదారుల మితిమీరిన వేగం మరియు హెల్మెట్ లేకుండా ప్రయాణం వల్ల జరుగుచున్నవని గణాంకాలు తెలియజేస్తున్నాయి. 40 మరణాలు హెల్మెట్ వాడకం వల్ల తగ్గే అవకాశం ఉన్నట్లు జాతీయ గణాంకాలు సూచిస్తున్నాయి. సరియైన రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే కుటుంబంలో ఒకరు మరణిస్తే కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో నేటి నుండి ద్విచక్ర వాహనదారులకు నో హెల్మెట్ నో పెట్రోల్ నిబంధనలను అమలు చేసేలా పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలిచ్చారు. ప్రజలకు, విద్యావంతులైన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, యువత మరియు అందరూ ద్విచక్ర వాహనదారులు అనగా వాహనం నడుపుతున్న వారు, వెనుక కూర్చొని వున్నవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

## అందరి సమన్వయంతో సంబరం చేద్దాం

### -రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

### ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలి : జిల్లా కలెక్టర్



మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబరు 14 ప్రభాతవార్త: సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర ఏర్పాట్లను పూర్తిచేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో ప్రారంభం కానున్న శంబర జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి దేవాదాయ శాఖ అదికారులు, దేవాలయ కమిటీ, ఇతర శాఖల అధికారులతో మంత్రి శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సంబర పోలమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో నెల రోజుల ముందుగా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని, కొళాయిలు, బోర్లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు సిద్ధం చేయాలని, పారిశుధ్యం నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అమ్మవారి మారు జాతర ముగిసే వరకు పారిశుధ్యంపై ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. పార్కింగ్ స్థలాలు, ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలని, అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్ళుటకు రహదారి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమగు విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు సమాచారం ఇచ్చుటకు, సమాచారం స్వీకరించుట మైక్‌ల ద్వారా ప్రకటించుటకు పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ ఏర్పాటు చేసి అచ్చట నుండి సమాచారం అందించాలని సూచించారు.

మైక్ ద్వారా ఇచ్చే సమాచారం జాతర జరిగే మొత్తం ప్రాంతంలో వినిపించాలని, రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు భవనాలు శాఖను సూచించారు. వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం ఇబ్బందులు ఉండకుండా తగిన బస్సులు ప్రజా రవాణా శాఖ ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ శాఖ అవసరమగు సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. 2026 జనవరి 26 నుండి 28 వరకు జరగనున్న ఈ ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించేందుకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.పి మనీషా రెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అధికారి రాజారావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# వ్యర్థాలతో ఉపాధి

నిర్వహణ కరవై.... నీటిలో తేలుతూ... ప్రవాహాన్ని అడ్డుకునే గుర్రపు డెక్కలు అందరికీ వ్యర్థంగానే కనిపిస్తున్నాయి. కానీ, వాటిని ఉపయోగించే మహిళలకు ఉపాధి కల్పిస్తు న్నారు. పూర్ణిమా బోర్గోహైన్. ఆమెకి ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే.... ప్రకృతి మనకు ఇచ్చిన వనరులెన్నో. వాటిని వినియోగించుకోవడం మనకు తెలియాలంటే, కాస్త సృజనాత్మకత ఉండాలే కానీ చుట్టూ ఉన్న ఏ వస్తువు వృథా కాదు. ఆఖరికి చెరువులు, చిత్తడనేలల్లో పనికిరాని మొక్కగా భావించే గుర్రపు డెక్క కూడా పూర్ణిమ. అసోంలోని శివసాగర్ జిల్లా, భోరోలువా గ్రామం ఈమెది అక్కడ చెరువుల సంఖ్య ఎక్కువ. కానీ అవన్నీ ఎక్కడికక్కడ గుర్రపు డెక్కలతో నిండి ఉండటం గమనించారామె. 'వీటిని ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బ్యాగులూ, పర్సుల తయారీలో వాడితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. వెంటనే సాధ్యాసాధ్యాల దిశగా దృష్టి సారించా తెలిసిన వాళ్లని అడిగితే... మందుల తయారీకి వాడుతున్నారని కొందరు చెబితే, ఉపకరణాలు తయారు చేస్తారు. వాడొచ్చు అన్నారు మరికొందరు. ఇలాంటి వాటికి శిక్షణ ఇచ్చే కేంద్రం అహ్మదాబాద్‌లో ఉందని తెలుసుకుని అక్కడకు వెళ్లా అని గుర్తుచేసుకుంటారు పూర్ణిమ. అక్కడ నైపుణ్యాలను అందిపుచ్చుకుని.. మాస్టర్ ట్రైనర్గా మారారీమె. తర్వాత అసోంకు వచ్చి, స్థానిక మహిళలకూ ఈ నైపుణ్యాలను నేర్పారు. అలా అసోంలో వందల మందికి ఈ విద్యను అందించారు. తన ఇంటి వెనక కొంత శిక్షణ కేంద్రంగా మలిచి... చెరువులూ, నదుల్లోంచి సేకరించిన గుర్రపుడెక్కని శుద్ధి చేస్తున్నారు. తర్వాత వాటితో డైనింగ్ టేబుల్ మ్యాట్లూ, చాపలూ, బ్యాగులూ, పరు నిలువు తయారుచేస్తున్నారు. ఓ చిన్న పరిశ్రమను ప్రారంభించి, మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించాలనేదే తన కోరిక అంటారు పూర్ణిమ. ◻

# సమయం వృథా చేయకండి

**మనం స్నేహితులను కలవడానికి వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ జామ్ అయిదనుకోండి. అప్పుడు మీకు ఏమనిపి స్తుంది? అబ్బా ఈ ట్రాపిక్‌లో ఎంతసేపూ సమయం గడవదే అనే కదా! అదే మరి స్నేహితులతో సరదాగా ముచ్చట్లాడు తుంటే ఏమనిపిస్తుంది. అప్పుడు టైమ్ అయిపోయిందా! అని కదా. సమయం ఎప్పుడూ ఒకలానే ఉంటుంది. మరిమనికి ఎందుకు అలా అనిపిస్తుందో తెలుసా!**

'సమయమే డబ్బు', 'సమయాన్ని ఆదా చేయడం, ఖర్చుచేయడం' లాంటి మాటలు ప్రస్తుత జీవనశైలిలో మనం సమయానికి ఇచ్చే ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా ఇవి పట్టణ వాతావరణంలో నివసించే వారికి బాగాసరిపోతాయి. ఎందుకంటే వీళ్ల ప్రకృతి సూచనల కంటే ఇంట్లో గడియారాన్ని అనుసరించే రోజువారీ పనులు చేసుకుంటారు కాబట్టి. నిజానికి సమయంపై ఇంతలాధారపడడం, మన ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తుందని టుర్కూ యూనివర్సిటీ చేసిన పరిశోధనల్లో వెల్లడైంది. సమయం సరిపోవట్లేదు అనే భావనా ఇందులో



నుంచి వచ్చిందేనట. అందుకే నగారల్లో ఉండేవారు ఎక్కువగా ప్రకృతిలో ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి. అప్పుడే మనకు 'బ్యాలెన్స్‌డ్ సెన్స్ ఆఫ్ టైమ్ వస్తుంది. సహజసిద్ధ వాతావరణంలో ఉండేవారికీ, పట్టణ వాతావరణంలో ఉండేవారికీ సమయాన్ని గడపడంలో తేడా ఉంటుందట. అంతేకాదు కొంతమందిని గతంలో జరిగిన చేదు విషయాలూ, చెడు సంఘటనలూ వర్తమానంలో పదేపదే గుర్తుకు వస్తూ వేధిస్తుంటాయి. అటువంటి వారూ ప్రకృతిలో గడపడం వల్ల వాటినుంచి బయటపడ గలుగుతారట. అందుకే మన నగరాలు పట్టణాలను పార్కులూ, పచ్చదనం ఉండేలా నిర్మించుకోవాలని పరిశోధనలు సూచిస్తున్నాయి. ◻




# జల సంరక్షణలో ఉత్తమ ప్రతిభ

**సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా, ఈ ఘనత సాధించిన తొలి దళిత చరిత్ర సృష్టించిన టీనా దాబి గుర్తున్నారు కదా! వ్యక్తిగత విషయాల్లోనే కాదు... ఐఎఎస్‌గా ఆబాధ్యతలు తీసుకున్నప్పటి నుంచీ తాను చేపట్టిన కార్యక్రమాలతో ఎప్పుడూ వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా వర్షపు నీటి సంరక్షణలో అత్యుత్తమ పనితీరు కనబజనాభాగీదారి (జేఎస్సీబీ) అవార్డును** అందుకున్నారు.

ఐఏఎస్ అధికారిణి టీనా దాబి తన కెరియర్‌లో మరో అద్భుత విజయాన్ని నమోదు చేసు కున్నారు. తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జల్‌సంచయ్-జన్‌భాగీదారీ (జన భాగస్వామ్యంతో జల సంరక్షణ) అవార్డు, రూ.2 కోట్ల నగదు బహుమతిని అందుకున్నారు రాజస్థాన్‌లోని బాడ్మేర్ జిల్లా కలెక్టర్‌గా క్యాచ్ ది రెయిన్ వేర్ ఇట్ ఫాల్స్... వెన్ ఇట్ అంటూ తన బృందంతో కలిసి జల సంరక్షణకు నడుం కట్టారు. ఇందులో భాగంగానే ట్యాంకులు, చెరువులు, దిగుడు బావులు... వంటివాటిని నిర్మించారు. వర్షపు చినుకుల్ని ఒడిసి పట్టారు. ఈ పనిలో ప్రజల్ని పెద్ద ఎత్తున అందజేయ గలిగారు. ఫలితంగా వర్షపు నీరు ఆదా అవ్వడమే కాదు... భూగర్భ జలాలూ పెరిగాయి. చెరువులు, కుంటలు, సరస్సులన్నీ నీటితో కళకళలాడు తున్నాయి. ఇలా పొదుపు చేసిన జలాన్ని ప్రజలు తాగడానికి నీరు అవసరాలకోసం ఉపయోగించగలుగు తున్నారు.

**మహిళలకోసం...** గ్రామాల స్వయం సమృద్ధి, మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తారు టీనా. రాజస్థాన్ లోని అజ్మీర్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలిపోస్టింగ్. ఆపై భిల్వాడా జిల్లా సబ్ డివిజ విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో కోవిడ్ కట్టడి



చర్యలతో వార్తల్లో నిలిచారీమె. జైపుర్ జాయింట్ సెక్రటరీగా పనిచేసిన టీనా జైసన్ శక్తి (లేడీస్ ఫస్ట్) పేరుతో బాలికలు ఆరోగ్యం, రక్షణ, చదువులపై దృష్టి పెట్టారు. అందరి దృష్టినీ ఆకర్షించారు. గతేడాది కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాక 'మరు ఉడాన్' పేరుతో మరో తెలుగు రూపకల్పన చేశారు. పరిసరాల స్వచ్ఛతే లక్ష్యంగా 'నవో బాడ్మేర్' ప్రోగ్రామ్‌ని నడిపించారు. అప్పటికి 22 ఏళ్ల... టీనా దాబి భోపాల్‌లో పుట్టిపెరిగారు. ఈమె తండ్రి జస్వంత్ దాబి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి తల్లి హిమాలీ ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ మాజీ అధికారిణి... తన ఇద్దరు పిల్లల్ని పెంచడానికి స్వచ్ఛందపదవీ విరమణ చేశారు. చెల్లి రియా కూడా అక్కబాటలోనే నడిచి ఐఎఎస్ అధికారిణిగా పనిచేస్తోంది.

టీనా దాబి భోపాల్‌లోని కార్మెల్ కాన్వెంట్‌లో విద్యాభ్యాసం పూర్తి చేశారు.. ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో డిగ్రీ చదివారు. ఆపై 2015లో సివిల్‌సర్వీసెస్ పరీక్షలు రాశారు. టీనా తొలి ప్రయత్నంలోనే ఐఎఎస్ టాపర్‌గా నిలిచారు. అప్పటికి ఆమె వయసు 22 ఏళ్లే. ఆ ఘనత సాధించిన తొలి దళిత మహిళగానూ గుర్తింపు పొందారు. టీనా దాబీకి ఫాలోయింగ్ కూడా ఎక్కువే 1.5 మిలియన్లకు పైగానే ఫాలోయర్లు ఉన్నాయి. ◻

# పరమశివుడి అనుమతి

**సీతాపహరణ తర్వాత రామలక్ష్మణులు** దండకారణ్యంలో సంచరిస్తుంటే. వాళ్లకో మనోహరమైన ప్రాంతం కనిపించింది. సీతమ్మవారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలనుకున్నా శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరిచాడు లక్ష్మణుడు. సోదరా నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకుండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి, మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది.కానీ అక్కడెవరూ లేరు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యుంటాడు. ఆయన అనుమతి తీసుకో లక్ష్మణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో, దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు.సోదరుడి వద్దకు వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా! శివుడి ఆజ్ఞ లభించింది! కుటీరం నిర్మించు అన్నాడు. ఆజ్ఞ ఎప్పుడు లభించింది? ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా! మితిమీరిన స్వార్థం, జిహ్వా చాపలనయత్రం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించుకోగలిగితే.. ఇక్కడే కాదు- ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు! ఈ మూడింటినీ మనం నిగ్రహించుకోగలమని పరమశివుడు గ్రహించాడు. కనుకనే నృత్య భంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు. ◻

# ముగ్గులకు ఆహ్వానం



ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం. ఆసక్తిగల మహిళలు ముగ్గులు వేసి పంపించగలరు.

**సూచనలు :**

★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు.
★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు.
★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి.
★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి.
★ ముగ్గులు క్లీయర్‌గా, రంగు లతో కనిపించాలి.
★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా**

ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# పంజాబీ ఛోలే...



**కావలసినవి :**
శనగలు-2 కప్పులు, టొమాటో గుజ్జు-రెండున్నర కప్పు, ఉల్లి తరుగు కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద-ఒకటిన్నర చెంచా, యాలకులు -5, బిర్యానీ ఆకులు-2. దాల్చినచెక్క-అంగుళం ముక్క మిరియాలు పావు చెంచా , లవంగాలు -4, ఉప్పు-తగినంత, ఛోలే మసాలా-3 చెంచాలు, గరం మసాలా - పావు చెంచా, కారం-అర చెంచా, కొత్తమీర, తరుగు-అర కప్పు, జీలకర్ర పొడి-ఒకటిన్నర చెంచా, సన్నగా తరిగిన అల్లం పాదుచెంచా,మెంతి ఆకుల పొడి-అర చెంచా, నూనె-2 చెంచాలు, నెయ్యి-ఒక టేబుల్ స్పూన్.

**తయారీ :** శనగలు ముందు రోజు రాత్రి నానబెట్టి, ఆ నీళ్లు తీసేయాలి. వాటికి ఐదు కప్పుల నీళ్లు, ఉప్పు జతచేసి కుక్కర్‌లో ఐదు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి.కడాయిలో నూనె వేడయ్యాక బిర్యానీ ఆకులు, దాల్చినచెక్క మిరియాలు, యాలకులు, లవంగాలు వేయాలి. మంచి వాసన వస్తుండగా అల్లం వెల్లుల్లి ముద్ద , ఉల్లి తరుగు వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేగనివ్వాలి. అందులో టొమాటో గుజ్జు వేసి ఉడికించాలి. మధ్యలో అడుగంటకుండా కలియబెడుతుండాలి. పావు గంట తర్వాత ఛోలే మసాలా, కారం ఉప్పు, జీలకర్ర పొడి, ఉడికించిన శనగల, కప్పు నీళ్లు ఇంకో ఆరేడు నిమిషాలు ఉడికించాలి. నీళ్లు ఇగిరి, చక్కగా ఉడికిందనుకున్నాక.. నెయ్యి, అల్లం తరుగు, గరం మసాలా, మెంతి ఆకులు పొడి, కొత్తిమీర తరుగు వేసి కలియబెట్ట దించేయాలి. అంతే ఘుమఘుమలాడే పంజాబీ ఛోలే తిని ఆనందించడమే తరువాయి.

తెర

# సంక్రాంతి పెర్‌ఫెక్ట్ ఎంటర్ టైనర్



మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి 'మన శంకరవర ప్రసాద్ గారు ' షూటింగ్ పూర్తి, జనవరి 12న సంక్రాంతి కానుకగా గ్రాండ్‌గా రిలీజ్‌మెగాస్టార్ చిరంజీవి మాస్‌అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఆకట్టుకునే ప్రమోషనల్ కంటెంట్, దూకుడుగా సాగుతున్న ప్రచార కార్యక్రమాలతో సంచలనం సృష్టిస్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, అర్చన సమర్పిస్తున్నారు. ఈ రోజు చిత్ర నిర్మాతలు సినిమా విడుదల తేదీని ప్రకటించడానికి ఒక గ్రాండ్ ఈవెంట్ నినిర్వహించారు. 'మన శంకరవర ప్రసాద్ గారు' పూర్తి షూటింగ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపు కుంటోంది. ఈ చిత్రం సంక్రాంతికి కేవలం2 రోజుల ముందు, జనవరి 12న థియేటర్లలో విడుదల కానుంది. మెగాస్టార్ చిరంజీవి యంగ్ అండ్ డైమనిక్ గా కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. రెడ్ కార్ పై బ్లాక్ సూట్ లో కాఫీ సిప్ చేస్తూ మెగా స్వాగ్ తో మెస్మరైజ్ చేశారు చిరంజీవి.

# ఘనంగా 'విధాత' మూవీ ట్రైలర్ లాంచ్

ఏబీసీ ప్రొడక్షన్ పతాకం పై భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రదారులుగా మణికంఠ రాజేంద్ర బాబు దర్శకత్వం లో అప్పిన పల్లి భాస్కరాచారి నిర్మించిన చిత్రం "విధాత". వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన ఈ



ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోదర్శకుడు మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ సినిమా పరిశ్రమలో అవకాశాల కోసం ఎంతో ప్రయత్నించాను. ఇక్కడ లభించని అవకాశం మా ఊరిలో మా ప్రొడ్యూసర్ భాస్కరాచారి రూపంలో దక్కింది.

అతిథిగా వచ్చిన నటుడు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పలు పోరాటాల రూపంలో విధాత అడుగుపెడతాడు.

తప్పుచేసిన వారిని శిక్షి స్తాడు.

నిర్మాత డాక్టర్ అప్పిన పల్లి భాస్కరాచారి మాట్లాడుతూ మా విధాత సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కు అతిథిగా వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. కొన్ని వాస్తవ ఘటనల నేపథ్యంతో ఈ సినిమాను నిర్మించాం.

# 'దేఖ్‌లేంగే సాలా' గీత ఆవిష్కరణ వేడుక



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్‌లేంగే సాలా విడుదలైంది. ఈ గీతావిష్కరణ కార్యక్రమం రాజమండ్రిలో జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, నిర్మాత నవీన్ యెర్నేని, గీత రచయిత భాస్కరభట్లలు పాల్గొన్నారు.

అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి విడుదలైన తొలి గీతం 'దేఖ్‌లేంగే సాలా' అభిమానులు, సినీ ప్రేమికుల్లో ఒక్కసారిగా భారీ ఉత్సాహాన్ని రేపింది. ఉత్సాహభరితమైన సంగీతం, అద్భుతమైన నృత్య రీతులతో రూపొందిన ఈ పాటలో పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రజాదరణ పొందిన అవతారంలో కనిపిస్తున్నారు. వింటేజ్ స్టైల్, రా ఇంటెన్సిటీతో ఒకప్పుడు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన తన ఐకానిక్ బ్లాక్‌బస్టర్ పాటల జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తున్నారు. ఉండబోతుందో తెలిపేలా సాహిత్యం అద్భుతంగా కుదిరింది. ఇక విశాల్ దద్లానీ గాత్రం పాటకు మరింత పవర్‌ను జోడించి, దీనిని ఖచ్చితంగా అందరూ ఇష్టపడే గీతంగా మార్చింది.

# సాంగ్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడం ఆనందానిచ్చింది

## మ్యూజిక్ డైరెక్టర్ మిక్కీ జే మేయర్



ఆకట్టుకునే కథలను అందించడంలో స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. వారి అప్ కమింగ్ మూవీ ఛాంపియన్ ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఛాంపియన్ ప్రీ ఇండిపెండెన్స్ టైం లో జరిగే కథ..

**ఈ సినిమాకి మ్యూజిక్ చేయడం ఎలా అనిపించింది?**

ఇండిపెండెన్స్ సమయంలో జరిగే కథలు ఇప్పుడు వరకు చాలానే వచ్చాయి. ఆ చిత్రాల్లో బ్రిటీషర్స్ తో జరిగిన పోరాటాన్ని చూపించడం జరిగింది.

పీరియడ్ సినిమాలు చేయడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఒక టైం నుంచి మరో టైం లోకి వెళ్లి ఒక కాలాన్ని చూడడమనేది ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటుంది. మహానటి సినిమా కూడా అలాంటి అనుభూతిని ఇచ్చిన సినిమానే.ఛాంపియన్ మ్యూజిక్ విషయానికి వచ్చేసరికి తెలంగాణ జానపదంతో పాటు వెస్ట్రన్ మ్యూజిక్ ని మిళితం చేసి ఒక జానెర్ క్రియేట్ చేసే అవకాశం ఈ కథ కల్పించింది.

**డైరెక్టర్ ప్రదీప్‌ఈ కథ చెప్పినప్పుడు మీ రియాక్షన్ ఏమిటి?**

డైరెక్టర్ ప్రదీప్ ఈ కథని నాకు ఫోన్ లో చెప్పారు. అయినా కథ చెప్పినప్పుడే నాకు చాలా నచ్చింది. ఖచ్చితంగా ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉండబోతుంది అనిపించింది.

**గిరగిర పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది కదా.. ఆ సిచువేషన్ గురించి చెప్పండి?**

ఆ పాటకు మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అది మంచి కమర్షియల్ సాంగ్. నిజానికి హీరో ఇంట్రో సాంగ్ అది. మంచి మెలోడీ. మంచి బీట్ కూడా ఆడ్ అవ్వడంతో చాలా కొత్త ఫ్లేవర్ వచ్చింది .

# డి.వి.ఎస్ రాజు 97వ జయంతి

తెలుగు సినిమాకు అపారమైన సేవలందించిన డి.వి.ఎస్. రాజు. ఈరోజు డిసెంబర్ 13 డి.వి.ఎస్ రాజు 97వ జయంతి జరువుకున్నారు.ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని ఎఫ్.డి.సిఅధ్యక్షుడుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించడంలోను, రిచర్డ్ అటెన్ బరో నిర్మించిన ఆస్కార్ అవార్డు సినిమా గాంధీ లాభాల్లోకొంత భాగాన్ని ఎన్.ఎఫ్.డి.సి అధ్యక్షుడుగా భారతీయ కార్మికుల నిధిని ఏర్పాటు చెయ్యడంలోను కీలకమైన భూమిక పోషించారు. సినిమా నిర్మాణం చేస్తూనే సినిమా రంగ సంస్థలను బలోపేతం చెయ్యడంలో విశేషమైన కృషి చేశారు. 1950లో మహానటుడు ఎన్.టి. రామారావుతో పరిచయం రాజు జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది. రాజుని తన భాగస్వామిగా చేసుకొని నేషనల్ ఆర్ట్ థియేటర్ సంస్థలో ఎన్.టి.ఆర్ ఎన్నో గొప్ప చిత్రాలను నిర్మించారు. 1960లో రాజు డి.వి.ఎస్ ప్రొడక్షన్స్ సంస్థను ప్రారంభించారు. అయినా రాజుతో రామారావు మైత్రీ బంధం కొనసాగింది. 1983లోరామారావు ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన తరువాత రాజుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థకు అధ్యక్షుడుగా నియమించారు ఫిలింనగర్ సొసైటీ, చలన చిత్ర వాణిజ్య మండలి, దక్షి ణ భారత చలన చిత్ర వాణిజ్య మండలి, ఎఫ్ .డి.సి,ఎన్ .ఎఫ్.డి.సి, ఫిలిం ఫెడరేషన్, ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ మొదలైన సంస్థల అభివృద్ధిలో రాజు కృషి ఎంతో వుంది,.రాజు నిస్వార్థ సేవ, అంకిత భావం, అవిరళ కృషి ని గుర్తించిన భారత ప్రభుత్వం 2001వ సంవత్సరంలో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది .



# 25న 'బ్యాడ్ గాళ్స్ 'చిత్రం విడుదల

ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ముఖ్య తారాగణంతో 30 రోజుల్లో ప్రేమించడం ఎల్లా సినిమా తో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం "మా 'బ్యాడ్ గాళ్స్ కానీ చాలా మంచోళ్ళు అనేది ట్యాగ్ లైన్. శశిధర్‌నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు.అయితే ఈ చిత్రం క్రిస్మస్ పండుగ కానుకగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నారు చిత్ర యూనిట్. ఈ సందర్భంగా.. ఈ చిత్ర దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి మాట్లాడుతూ "మా 'బ్యాడ్ గాళ్స్' పూర్తి ఎంటర్టైనర్ చిత్రం. జాతిరత్నాలు, మ్యాడ్ లాంటి హిలేరియస్ చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రం మా బ్యాడ్ గాళ్. సినిమా చాలా బాగా వచ్చింది. అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను.



# బంగ్లాదేశ్ సూపర్ విక్టరీ

## అఫ్ఘానిస్థాన్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ జట్టు అఫ్ఘానిస్తాన్‌పై 3 వికెట్ల తేడాతో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన పురుషుల అండర్ 19 ఆసియా కప్ గ్రూప్ బి మ్యాచ్‌లో ఓపెనర్లు రిఫత్ బేగ్, జావాద్ అబ్రార్ అర్ధ సెంచరీలు సాధించారు. ఫైసల్ షినోజాడా 103 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్ 283/7 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ ఆలస్యంగా పతనమైనప్పటికీ ఒక ఓవర్ మిగిలి ఉండగానే ఛేదనను పూర్తి చేసింది. బంగ్లాదేశ్ 236/2 వద్ద ఛేదనకు నియంత్రణలో ఉన్నట్లు కనిపించింది. ఎనిమిది వికెట్లు చేతిలో ఉండగా 45 బంతుల్లో 48 పరుగులు మాత్రమే అవసరం. కానీ నాలుగు ఓవర్ల వ్యవధిలోనే 4 వికెట్లు పడటంతో ఆఫ్ఘనిస్తాన్‌కు ఆశలు చిగురించాయి. ఆల్ రౌండర్ రిజాన్ హోసాన్ 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచి బంగ్లాదేశ్‌ను 7 బంతులు మిగిలి ఉండగానే విజయతీరాలకు చేర్చాడు. ఓపెనర్లు అబ్రార్, బేగ్ 151 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యంతో బంగ్లాదేశ్ విజయానికి వేదికగా నిలిచారు. 27వ ఓవర్లో బేగ్ 62 పరుగులకు ఔట్ కాగా, అబ్రార్ సెంచరీ మిస్ అయ్యాడు. రూహుల్లా అరబ్ 96 పరుగుల వద్ద అవుట్ అయ్యాడు. కెప్టెన్ అజీజుల్ హాకీమ్, కలాం సిద్దికి మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. కానీ మిడిల్ ఆర్డర్‌లో తడబాటు కారణంగా హోసాన్ జోక్యంతో లక్ష్యాన్ని చేధించారు. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్ షినోజాదా 103 పరుగులతో నిర్మించబడింది. అతను ఉస్మాన్ సదత్‌తో 66, ఉజైరుల్లా నియాజైతో 89 పరుగుల భాగస్వామ్యంతో స్కోరును 200 దాటించాడు. అయితే ఆఫ్ఘనిస్తాన్ 46వ ఓవర్లో 225/7కి పడిపోయింది, అజీజుల్లా మియాఖిల్ (38), అబ్దుల్ అజీజ్ (26) వారిని 283 పరుగులకు చేర్చారు.

# ఒడిశా మాస్టర్స్‌లో ఉన్నతి, కిరణ్‌కు టైటిళ్లు

న్యూఢిల్లీ: ఒడిశా మాస్టర్స్ 2025లో భారత్ షట్లర్లు ఉన్నతి హుడా, కిరణ్ జార్జ్ సింగిల్స్ టైటిళ్లను గెలుచుకున్నారు. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన మాస్టర్స్ సూపర్ 100 టోర్నీలో భారత షట్లర్లు రెండు టైటిళ్లతో వరల్డ్ టూర్‌ను ముగించారు. ఉన్నతి మొత్తం భారత మహిళల సింగిల్స్ ఫైనల్లో ఇషారాణి బారువాను ఓడించింది. ఆమె తన క్లాస్‌ను ప్రదర్శించి, వరుస గేమ్‌లలో 21-17, 21-10 తేడాతో ఆధిపత్య విజయాన్ని నమోదు చేసింది. ఈ సంవత్సరంలో ఆమెకు ఇది మొదటి విజయం. మరోవైపు, కిరణ్ ఇండోనేషియా యువ ఆటగాడు మొహమ్మద్ యూసుఫ్‌తో జరిగిన మూడు గేమ్‌ల మ్యాచ్‌లో 21-14, 13-21, 21-16 తేడాతో చాలా కఠినమైన ఆటతీరును కనబరిచాడు. మొదటి గేమ్‌లో మంచి ఆధిక్యాన్ని కొనసాగించి 21-14తో గెలుచుకున్నాడు. రెండవ గేమ్‌లో యూసుఫ్ మెరుగ్గా కనిపించి కిరణ్‌పై ఒత్తిడి తెచ్చాడు, కానీ భారత ఆటగాడు స్కోర్‌లను అదుపులో ఉంచుకుని ఒక పాయింట్ మాత్రమే వెనుకబడి ఉన్నాడు. అయితే, అతను వరుసగా 8 పాయింట్లు ఇచ్చి రెండవ గేమ్‌ను కోల్పోయాడు. దీనితో కిరణ్ దానిని విజయంగా మార్చుకున్నాడు.



ఆట

# ఐపిఎల్‌లో దిగ్గజాలు ఔట్

## ముగిసిన స్టార్ ప్లేయర్ల హిస్టరీ











**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 కోసం జోరుగా సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఈ ఐపీఎల్‌కు సంబంధించి ఈ నెల 16 న అబుదాబిలో జరగబోయే మినీ వేలం దగ్గర పడుతున్న కొద్దీ, పలువురు స్టార్ ఆటగాళ్లు ఈ సీజన్ నుంచి తాము తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఐపీఎల్ చరిత్రలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ ఆటగాళ్ల నిర్ణయాలు చర్చనీయాంశమైంది. వీరిలో కొంతమంది ఆటగాళ్లు ఇతర లీగ్‌లను ఎంచుకోగా, మరికొందరు రిటైర్మెంట్, బ్రేక్ తీసుకుంటున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన సీనియర్ ఆల్‌రౌండర్ మోయిన్ అలీ ఐపీఎల్ 2026 లో ఆడకూడదని నిర్ణయించుకుని, బదులుగా పాకిస్తాన్ సూపర్ లీగ్ వైపు మొగ్గు చూపాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున అలీ గత సీజన్ అంతగా బాగా ఆడకపోయినా, మోయిన్ ఆల్‌రౌండ్ సామర్థ్యాలకు మంచి గుర్తింపు ఉంది. ఐపీఎల్‌లో 73 మ్యాచ్‌ల్లో 1167 పరుగులు చేసి, 41 వికెట్లు పడగొట్టాడు. అలాగే దక్షి ణాఫ్రికా దిగ్గజం ఫాఫ్ డు ప్లెసిస్ కూడా పాకిస్తాన్ సూపర్ లీగ్ ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ఐపీఎల్ తనకు సంవత్సరాలుగా గుర్తింపు మరియు గౌరవాన్ని ఇచ్చిందని, అయితే ఈ నిర్ణయం తీసుకోవడం తనకు చాలా కష్టమైందని పేర్కొన్నాడు. చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ జట్ల తరపున అద్భుతంగా రాణించిన ఫాఫ్, ఐపీఎల్‌లో మొత్తం 4773 పరుగులు చేసి నమ్మదగిన బ్యాట్స్‌మన్‌గా ఉన్నాడు. ఇక ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసకర ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఏ కారణం చెప్పకుండానే వచ్చే ఐపీఎల్ వేలం నుంచి తన పేరును ఉపసంహారించుకున్నాడు. గత రెండు సీజన్లలో అతని ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. 15 ఇన్నింగ్స్‌లలో కేవలం 100 పరుగులు మాత్రమే చేయగలిగాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఐపీఎల్ నుంచి అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. రస్సెల్ ఐపీఎల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆటగాళ్లలో ఒకడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 140 మ్యాచ్‌లలో 2651 పరుగులు, 123 వికెట్లు రస్సెల్ పవర్ తెలియజేస్తాయి. కాగా భారత దేశపు మంచి ఆఫ్‌స్పిన్నర్లలో ఒకడైన రవిచంద్రన్ అశ్విన్ కూడా ఐపీఎల్ కెరీర్‌కు ముగింపు పలికాడు. ఆగస్టులో ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన అశ్విన్ 187 వికెట్లతో ఐపీఎల్ చరిత్రలో టాప్5 బౌలర్‌లలో ఒకరిగా ఉన్నాడు. 2010, 2011 లో చెన్నై సూపర్ కింగ్స్ టైటిల్ విజయాల్లో అతడు కీలక పాత్ర పోషించాడు. అయితే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర టీ20 లీగ్‌లలో ఆడతానని అశ్విన్ స్పష్టం చేశాడు.



# స్క్వాష్ ప్రపంచ కప్‌లో ఫైనల్‌కు భారత్

## సింగిల్స్‌ను గెలిచిన వేలవన్, అనహత్

### 3-0 తేడాతో ఈజిప్టు ఓటమి

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ కప్-2025లో ఈజిప్టును ఓడించిన భారత్ తొలి ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. స్క్వాష్ ప్రపంచ కప్ ఫైనల్‌కు భారత్ రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ ఈజిప్ట్‌ను 3-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. జాతీయ ఛాంపియన్లు, భారత్‌కు చెందిన వేలవన్ సెంథిల్‌కుమార్ మరియు అనహత్ సింగ్ పురుషుల మరియు మహిళల సింగిల్స్‌ను గెలుచుకున్నారు. సెంథిల్‌కుమార్ 3-0 తేడాతో గెలిచినప్పటికీ, అనాహత్ 3-2 తేడాతో గెలవడానికి తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. అభయ్ సింగ్ 3-1 తేడాతో విజయాన్ని సాధించాడు,పురుషుల ర్యాంకింగ్స్‌లో 45వ స్థానంలో ఉన్న సెంథిల్‌కుమార్, ప్రపంచ 96వ ర్యాంకర్ ఇబ్రహీం ఎల్కబ్బానీని తొలి మ్యాచ్‌లో 7-1, 7-3, 7-6 తేడాతో ఓడించి భారత్‌ను ఆధిక్యంలోకి నెట్టాడు. ఇక 17 ఏళ్ల వయసులో ప్రపంచ కప్ అరంగేట్రం చేసిన అనాహత్ సింగ్, 44వ ర్యాంక్‌లో ఉన్న నూర్ హైకల్‌పై 6-7, 7-5, 7-3, 3-7, 7-3 తేడాతో గట్టి పోరాటం చేసి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. ఆ తర్వాత అభయ్ సింగ్ ఆడమ్ హవాల్‌ను 3-1 (7-5, 6-7, 7-5, 7-6) తేడాతో ఓడించి ఫైనల్‌లో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

# పాక్ ఘోర ఓటమి

## టీమిండియా 90 రన్స్‌తో ఘన విజయం

**న్యూఢిల్లీ:** అండర్ 19 ఆసియా కప్-2025లో యువ భారత్ జట్టు జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో భాగంగా ఆదివారం దాయాది పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 90 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ బౌలర్లు అద్భుతం చేశారు. 241 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక పాకిస్థాన్ చతికల పడింది. భారత్ బౌలర్ల ధాటికి పాక్ జట్టు 41.2 ఓవర్లలో కేవలం 150 పరుగులకే కుప్పకూలింది.

దీపేష్ దేవేంద్రన్, కన్షిక్ చౌహాన్ తలా 3 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. వీరితో పాటు, కిషాన్ కుమార్ 2 వికెట్లు సాధించారు. పేసర్ దీపేష్ పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. పాక్ బ్యాటర్లలో హుజైఫా అహ్సాన్ (70) ఒంటరి పోరాటం చేశాడు. ఓ వైపు వికెట్లు పడతున్నప్పటికీ అహ్సాన్ మాత్రం దూకుడుగా ఆడి భారత్‌పై వత్తిడి పెంచాడు. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశి క్యాచ్‌లో పెవిలియన్‌కు పంపాడు. పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో ముగ్గురే ముగ్గురు డబుల్ డిజిట్ స్కోర్ సాధించారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. భారత్ బ్యాటర్లలో ఆరోన్ జార్జ్ (85) టాప్ స్కోరర్‌గా నిలవగా, కనిష్క్ చౌహాన్ (46), మాత్రే (38) రాణించారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశి (5) చెత్త ప్రదర్శన చేశాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ సయ్యామ్, అబ్దుల్ సుభాన్ తలా మూడు వికెట్లు పడగొట్టారు.



# వాణిజ్యం

## టాప్ 8 కంపెనీల్లో రూ.79వేల కోట్లకుపైగా మార్కెట్‌క్యాప్ పతనం!

**ముంబయి, డిసెంబరు 14:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారంనెలకొన్న ధోరణులతో టాప్10 కంపెనీలలో 8 సంస్థలు భారీగా నష్టపోయాయి. ఈ కంపెనీలు వారం వ్యవధిలో తమ మార్కెట్ విలువల నుంచి ఏకంగా రూ.79,129.21 కోట్లను కోల్పోయాయి. ఇందులో బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయిన సంస్థగా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ ఏకంగా రూ.19,289.7 కోట్లు తగ్గి రూ.6,33,106.69 కోట్లకు చేరింది. ఆ తర్వాతి స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఉంది. ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ.18,516.31 కోట్లు క్షీణించి రూ.9,76,668.15 కోట్లకు పడిపోయింది. ఇదే బాటలో భారతీ ఎయిర్‌టెల్ రూ.13,884 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.7,846 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.7,145 కోట్లు, టీసీఎస్ రూ.6,783 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.4,460





కోట్లు కూడా భారీగా నష్టపోయాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)కూడా రూ.1,201కోట్లు నష్టపోయింది. ప్రతికూల మార్కెట్ పరిస్థితుల్లోనూ రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ టూబ్రో (ఎల్ అండ్‌టి) లాభాలను నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.20,434.03 కోట్లు పెరిగి రూ.21,05,652.74 కోట్లకు చేరుకుంది. లార్సెన్ అండ్ టూబ్రో విలువ రూ.4,910.82 కోట్లు పెరిగి రూ.5,60,370.38 కోట్లకు చేరింది. గత వారం బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 444.71 పాయింట్లు (0.51 శాతం) పడిపోవడం ఈ నష్టాలకు ప్రధాన కారణం.మార్కెట్ ఒడిదొడుకులకు గురైనప్పటికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్,రిలయన్స్, టీసీఎస్ సంస్థలు దేశంలోఅత్యంత విలువైన కంపెనీలుగా స్థానాలను నిలబెట్టుకున్నాయి.

## 2510.86 మిలియన్ డాలర్ల జ్యుయెలరీ ఎగుమతులు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** దేశవ్యాప్తంగా గతనెలలో జెమ్స్ అండ్ జ్యూయెలరీ ఆభరణాల ఎగుమతులు 2510.86 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఒక్క నవంబరునెలలోనే 19.64శాతం పెరిగినట్లు అసోసియేషన్ వెల్లడించింది. గత ఏడాది ఇదే నవంబరునెలలో 2098.59 మిలియన్ డాలర్లకంటే గణనీయంగా ఎగుమతులు వృద్ధిచెందినట్లు సంఘం ప్రకటించింది. ఇదేరంగంలో స్థూల దిగుమతులు కూడా నవంబరునెలలో 1894.92 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గత ఏడాది నవంబరునెలలో 1393.23 మిలియన్ డాలర్లకంటే 36.01 శాతం పెరిగినట్లు జిజెపిఇసి ప్రకటించింది. ఏప్రిల్‌నుంచి నవంబరు నెలవరకూ స్థూల ఎగుమతులు 18867.43 మిలియన్ డాలర్లుగా



ఉన్నాయి. స్వల్పంగా అంటే 0.07శాతం పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో 18854.83 మిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సంఘం నివేదిక విడుదలచేసింది. అలాగే ఏప్రిల్‌నుంచి నవంబరువరకూ దిగుమతులు కూడా పెరిగాయి. 6.87శాతంపెరిగి 12,932.06 మిలతియన్ డాలర్లనుంచి 13,820.863 మిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఎగుమతి దిగుమతుల గణాంకాలను పరిశీలిస్తే దేశీయంగా డిమాండ్‌పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉత్పత్తిరంగంలో చురుకుదనం, కస్టమర్లలో విశ్వాసం పెరగడంతోపాటు పండుగలు, పెళ్ళిళ్ల సీజన్ రానుండటంతో మరింతగా ఎగుమతిదిగుమతులుండవచ్చని చెపుతోంది. కామా జ్యూయెలరీ ఎండి కోలిన్‌షా మాట్లాడుతూ గ్లోబల్‌స్థాయిలో సవాళ్లు ఎదురవుతున్నా భారతజెమ్స్ అండ్ జ్యూయెలరీ సెక్టార్ గణనీయమైన వృద్ధిని నమోదుచేసిందన్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు ఎదురయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్‌ను సాధించిందన్నారు. భారత్, యుఎఇ సెపా వంటి ఒప్పందాలుకూడా ఎగుమతులకు దోహదంచేసినట్లు జెమ్స్ అండ్ జ్యూయెలరీ ప్రోత్సాహక మండలి ప్రకటించింది.

## టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణ గణాంకాలే కీలకం!

### ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలివే!

**ముంబయి, డిసెంబరు 14:** అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులు, టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం గణాంకాలు, భారత్ అమెరికా వాణిజ్యచర్చల్లో పురోగతి వంటి అంశాలు వచ్చే వారం మార్కెట్లను ప్రభావితంచేయనున్నాయి. అదేవిదంగా అంతర్జాతీయంగా డాలర్ రూపాయి చెలామణి కదలికలతోపాటు విదేశీ ఇన్వెస్టర్ల కార్యకలాపాలపైనా ట్రేడర్లు ఆసక్తి పెంచుతారని





తెలుస్తోంది. గత వారం మార్కెట్లలో ఇన్వెస్టర్లు భారీగానే కుమ్మరించారు. బిఎస్ఇలో జాబితా అయిన మొత్తం కంపెనీల విలువ రూ.466.6 లక్షలకోట్లనుంచి ఒక్కసారిగా రూ.470 లక్షలకోట్లకు పెరిగింది. అంటే మూడు లక్షలకోట్లు ఒక్కరోజులోనే పెరిగింది. ఈవారం కూడా ఇన్వెస్టర్ల తీరుతెన్నులు కొంత కీలకం అవుతాయని అంచనా. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ టోకుధరల సూచీ ద్రవ్యోల్బణ గణాంకాలు ఈనెల 15వ తేదీ అంటే సోమవారం విడుదలచేస్తులంది. భారత్ అమెరికాలు నిర్మాణాత్మక వైఖరితో వాణిజ్యచర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత ప్రతినిధుల బృందం అమెరికా డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్‌బృందంతో చర్చలు జరుపుతున్నది. రెండుదేశాలకు ప్రయోజనకారి కాగల వాణిజ్య ఒప్పందం దిశగా వేగంగా చర్చలు కొనసాగుతున్నాయని రెండుదేశాలప్రతినిధులు చెపుతున్న సంగతి తెలిసిందే. కేంద్రం తరపున వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్‌బృందం చర్చలు జరుపుతున్నది. అయితేఈ ఏడాది మార్కెట్లలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు నికర విక్రేతలుగా మారారు. గడచిన రెండుదశాబ్దాల్లో ఎన్నడూలేనంతగా పెట్టుబడులు విత్‌డ్రాచేసారు. ఈ అంశాలకుతోడు గ్లోబల్ మార్కెట్ల ధోరణులపైనా ఇన్వెస్టర్లు దృష్టిపెట్టే అవకాశాలున్నాయి.





## కృత్రిమమేధలో భారత్ నం.3

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ తన సత్తా చాటుతోంది. ప్రపంచంలోనే అత్యంత పోటీ ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆదివారం విడుదల చేసిన గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు 3వ ర్యాంకు ఇచ్చిది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగం, నైపుణ్యం కలిగిన మానవ వనరులే ఈ ఘనతకు కారణమని సంస్థ పేర్కొంది. ఈ జాబితాలో 78.6 స్కోర్‌తో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, 36.95 స్కోర్‌తో చైనా రెండో స్థానంలో నిలిచింది. భారత్ 21.59 స్కోర్‌తో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా, యూకే, సింగపూర్, జపాన్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలను భారత్ అధిగమించడం విశేషం.పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి), టాలెంట్ లభ్యత, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు వంటి అనేక కీలక అంశాలను విశ్లేషించి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ ర్యాంకులను కేటాయించింది. ముఖ్యంగా టాలెంట్ విభాగంలో భారత్ ప్రపంచంలోని టాప్3 దేశాల్లో ఒకటిగా నిలిచింది. దేశంలోని ఇంజనీర్లు, డెవలపర్ల భారీ సంఖ్య ఇందుకు దోహదపడింది. తక్కువమధ్య ఆదాయ దేశాల కేటగిరీలో ఈ జాబితాలో ఇంత ఉన్నత స్థానంలో నిలిచిన ఏకైక దేశం భారత్ కావడం గమనార్హం. ఏఐ రంగంలో భారత్‌లో పెరుగుతున్న పెట్టుబడులు, బలమైన స్టార్టప్ వ్యవస్థ, విస్తరిస్తున్న పరిశోధనలకు ఈ ర్యాంకింగ్ అద్దం పడుతోంది.



## ప్రపంచంలోనే అతిపెద్ద ఐపిఓ స్పేస్‌ఎక్స్!

**న్యూయార్కు, డిసెంబరు 14:** ప్రపంచంలో అతిపెద్ద ఐపీఓగా రికార్డు అయిన సౌదీ ఆరాంకోను దాటి ఇపుడు ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ ఐపిఓ రాబోతోంది. సౌదీ ఆరాంకో 25 బిలియన్ డాలర్లకుపైగా నిధుల్ని ఐపీఓ ద్వారా సమీకరించింది. ఈ రికార్డును బ్రేక్‌చేయాలన్న లక్ష్యంతోనే ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్ వచ్చే ఏడాదే భారీ ఐపిఓకు వస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఇందుకోసం అంతర్గత వాటా విక్రయం ప్రక్రియ చేపడుతోంది. దీని ద్వారా కంపెనీ విలువను ఏకంగా 800 బిలియన్ డాలర్లుగా భారత కరెన్సీలో సుమారు రూ. 72 లక్షలు కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీంతో చాట్‌జీపీటీ పేరెంట్ కంపెనీ ఓపెన్ ఏఐ రికార్డును దాటి అత్యంత విలువైన ప్రైవేట్ కంపెనీగా నిలుస్తోంది. స్పేస్ ఎక్స్ ప్రస్తుతం అర్హులైన వాటాదారుల నుంచి మొత్తం 2.56 బిలియన్ డాలర్లను సమీకరించాలనినిర్ణయించింది. భారత కరెన్సీలో రూ. 23 వేల కోట్లకుపైగా విలువ ఉంటుంది. షేర్ల కొనుగోలు ప్రాసెస్ ఇప్పటికే ప్రారంభించింది. ఇక్కడ ఒక్కో షేరుకు 421 డాలర్లు అంటే రూ. 38 వేల వరకు చెల్లించేందుకు ఆఫర్ ఇచ్చింది. స్పేస్ ఎక్స్ సీఎఫ్ఓ బ్రెట్ జాన్సెన్ వాటాదారులకు ఒక లేఖ రాశారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్ని స్టార్ షిప్ రాకెట్ అభివృద్ధి, ఏఐ డేటా సెంటర్స్ వంటి లక్ష్యాల కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా కంపెనీ 25 బిలియన్ డాలర్లకుపైగా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారత కరెన్సీలో చూస్తే రూ. 2.25 లక్షల కోట్లకు పైనే ఉంటుంది. సౌదీ ఆరామ్‌కోను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓల్లో ఒకటిగా నిలవనుందన్న అంచనాలు జోరందుకున్నాయి.

## రూ.150లక్షలకోట్లతో ఇన్‌ఫ్రాపైప్‌లైన్ ఏర్పాటు?

### కేంద్రానికి పారిశ్రామిక మండలి సిఐఐ ప్రతిపాదన

**న్యూఢిల్లీ, డిసెంబరు 14:** పెట్టుబడుల ఆధారిత ఆర్థికవృద్ధిని మరింత సాధించేందుకువీలుగా వచ్చే బడ్జెట్‌లో సంస్కరణలు తీసుకురావాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ కేంద్రానికి సూచించింది. కొత్త బడ్జెట్‌లో పెట్టుబడుల వృద్ధికి ఆస్కారం ఇచ్చే మార్పులు చేర్పులు ఉండాలని ప్రతిపాదించింది. మూలధన వ్యయాన్ని 12శాతం పెంచాలని సూచించింది. అలాగే రాష్ట్రాలకు కూడా ఈ వ్యయం పది శాతంపెంచాలని 2026-32 ఐదేళ్ల కాలానికిగాను 150 లక్షలకోట్లతో నేషనల్ ఇన్‌ఫ్రా పైప్‌లైన్ (ఎన్ఐపి)ని ప్రారంభించాలనిసూచించింది. పెట్టుబడులపరంగా గణనీయమైన రికార్డుసాధించిన కంపెనీలకు పన్నులరూపంలో కొంత ఊరటకల్పించాలనికోరాయి. అలాగే ఎన్ఆర్ఐ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్‌ఫండ్‌ఖు ఏర్పాటుచేయాలని, కొత్త మూలధన వ్యయం పెంచేందుకువీలుగా ఎంఎస్ఎంఇలకుఇతర ఉత్పత్తి రంగాలకు కూడా ప్రోత్సాహకాలుండాలని, కనీస ప్రత్యామ్నాయ పన్ను జోలికి వెళ్లకుండా రాయితీలు ఉండాలని సూచించారు. ఆర్థికవృద్ధికి ప్రైవేటు, విదేశీ పెట్టుబడులు అత్యవసరమని తదుపరి వృద్ధిదశను అధిగమించాలంటే ఎంతో కీలకం అవుతుందని అన్నారు. ఇందుకోసమే ప్రభుత్వ ప్రైవేటు సంస్థను ఏర్పాటుచేసి 49శాతం ప్రభుత్వ వాటాను ఏర్పాటుచేయాలనిసూచించారు. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు రెండునెలలనుంచి మూడునెలల్లోపే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించేలా చూసుకోవాలని, భారీ స్థాయి పెట్టుబడులకు కూడా ఈ సూత్రం వర్తింపచేయాలని సిఐఐ కేంద్రానికి ప్రతిపాదనలుచేసింది. కొత్త సంవత్సరంలో పెట్టుబడుల ఆధారిత ఆర్థిక వృద్ధి వ్యూహం ఎంతో అవసరమని సంస్థాగత సంసనకరణలు భారత తదుపరి అభివృద్ధి దశను నిర్దేశిస్తాయని సిఐఐ విశ్లేషించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.